


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 273

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మంగళవారం 24-12-2019


జనవరి 7
నోటిఫికేషన్..

జనవరి 8,9,10
నామినేషన్ల స్వీకరణ

జనవరి 25
లెక్కింపు.. ఫలితాలు

జనవరి 22న

# మున్సి ‘పోల్స్’

## 4న ఓటర్ల జాబితా ప్రకటన

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో ఓటర్ల జాబితా ఖరారుపై అధికారులు దృష్టి సారించారు. డిసెంబర్ 30న ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారు. అనంతరం అభ్యంతరాల స్వీకరణ, రాజకీయ పార్టీలతో ఎన్నికల అధికారుల సమావేశం వంటి ప్రక్రియలు పూర్తి చేసి జనవరి 4న వార్డులవారీగా ఫొటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురిస్తారు. జనవరి 8న రిటర్నింగ్ అధికారులు ఎన్నికలు జరగనున్న పట్టణ స్థానిక సంస్థల్లో వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారు.

**120 మున్సిపాలిటీలు,**
**10 కార్పొరేషన్లకు మోగిన ఎన్నికల నగారా**

- 25న ఓట్ల లెక్కింపు.. అనంతరం ఫలితాల ప్రకటన
- బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహణ
- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- కోర్టు కేసుతో జహీరాబాద్ మున్సిపాలిటీకి ఎన్నిక వాయిదా
- వారం పది రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు చేసే చాన్స్
- జనవరి 4న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మరో ఎన్నికల ఘట్టానికి తెర లేచింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మున్సిపల్ ఎన్నికల నగారా మోగించింది. 120 మున్సిపాలిటీలు, 10 మున్సిపల్ కార్పొరేషన్లకు జనవరి 22న ఎన్నికలు నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎస్ఈసీ కమిషనర్ వి.నాగిరెడ్డి సోమవారం విడుదల చేశారు. 120 మున్సిపాలిటీల్లోని 2,727 వార్డులకు, 10 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని 385 డివిజన్లకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగనున్నాయి. హైకోర్టులో పాత కేసు పెండింగ్‌లో ఉండడంతో జహీరాబాద్ మున్సిపాలిటీకి ఎన్నికల నిర్వహణను వాయిదా వేశారు. మున్సిపల్ ఎన్నికలకు మిగతా 2వ పేజీలో ▶



సోమవారం ఢిల్లీలో జరిగిన 66వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఉత్తమ నటి అవార్డు (మహానటి చిత్రానికిగాను) అందుకుంటున్న కీర్తి సురేశ్




## న్యూ ఇయర్ ‘షాక్’

- ఈవెంట్ల నిర్వహణకు భారీ వడ్డన నిర్ణయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- టికెట్ల ఆధారంగా రూ.50 వేల నుంచి రూ.2.5 లక్షల వరకు ఎక్సైజ్ ఫీజు
- జీహెచ్ఎంసీ పరిధిలో స్టార్ హోటల్ ఈవెంట్లకు రూ.20 వేల వరకు పెంపు
- సాధారణ ఈవెంట్లకు రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.9 వేలు
- క్రికెట్ మ్యాచ్‌ల్లో మందు పెడితే రూ.2.5 లక్షలు చెల్లించాల్సిందే

- వివరాలు 2లో

## జేఎంఎం కూటమి జయకేతనం

- జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీ ఓటమి
- ఓడిపోయిన సీఎం రఘుబర్ దాస్, పలువురు మంత్రులు
- సోరెన్‌కు ప్రధాని శుభాకాంక్షలు
- విభజన శక్తులను ప్రజలు చిత్తుగా ఓడించారు: సోనియా

5 లో

అసెంబ్లీ ఎన్నికలు-2019

జార్ఖండ్..



81 మొత్తం అసెంబ్లీ స్థానాలు

| ఫలితాలు ఇలా | 2014 | 2019 |
|---|---|---|
| జేఎంఎం | 19 | 30 |
| కాంగ్రెస్ | 6 | 16 |
| బీజేపీ | 37 | 25 |
| ఏజేఎస్‌యూ | 5 | 2 |
| జేవీఎం(పీ) | 8 | 3 |
| ఇతరులు | 6 | 3 |
| ఇండిపెండెంట్లు | 0 | 2 |

## ముగిసిన రీ పోస్టుమార్టం

- దిశ నిందితుల మృతదేహాలకు 4 గంటలపాటు సాగిన ప్రక్రియ
- గాంధీ ఆస్పత్రిలో నిర్వహించిన ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు
- మృతదేహాలపై బుల్లెట్ గాయాల పరిశీలన.. వీడియో చిత్రీకరణ
- 2 రోజుల్లో హైకోర్టుకు నివేదిక
- కుటుంబాలకు మృతదేహాల అప్పగింత.. ముగిసిన అంత్యక్రియలు

14 లో



## ఒక ఆవరణలో ఒకటే బడి!

- కొత్త కాన్సెప్ట్‌పై విద్యా శాఖ దృష్టి
- రెండు మూడు స్కూళ్లను కలిపి ఒకటిగా చేయాలని యోచన
- తగ్గిపోనున్న 3 వేల ప్రభుత్వ పాఠశాలలు.. సాధ్యాసాధ్యాలపై అధికారుల తర్జనభర్జన
- చేయగలిగితే సమర్థంగా వనరుల సద్వినియోగం

**సాక్షి, హైదరాబాద్:** ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఒకే స్కూల్. ఎక్కువ మంది విద్యార్థులు.. సరిపడా టీచర్లు.. మౌలిక వసతుల సద్వినియోగం.. తద్వారా మెరుగైన విద్యా బోధన అనే కొత్త ప్రణాళికపై విద్యా శాఖ దృష్టి సారించింది. అమలు సాధ్యాసాధ్యాలపై ఆలోచనలు చేస్తోంది. అయితే అన్ని స్కూళ్లలో కాకుండా కనీసం ఒకే ఆవరణలో (50 మీటర్లలోపు) ఒకటికి మించి ఉన్న స్కూళ్లను కలిపేసి ఒకే స్కూల్‌గా చేయొచ్చా..? సాంకేతిక సమస్యలేమైనా వస్తాయా..? ఉపాధ్యాయ సంఘాల నుంచి ఎలాంటి వాదన మిగతా 2వ పేజీలో ▶















epaper.sakshi.com

## రాష్ట్రంలో భారీ థర్మల్ ప్లాంట్

- 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం
- సింగరేణి ఆధ్వర్యంలో నిర్మాణం
- పర్యావరణ అనుమతులు జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా మరో భారీ థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కానుంది. సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా జైపూర్‌లో మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి పర్యావరణ అనుమతులు లభించాయి. జైపూర్‌లో ఇప్పటికే సింగరేణి సంస్థ నిర్మించిన 1200 (2x600) మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోంది. అక్కడే రూ.5,879.62 కోట్ల అంచనా వ్యయంతో 800 మెగావాట్ల కొత్త ప్లాంట్‌ను సంస్థ నిర్మించనుంది. ఈ ప్లాంట్ నిర్మాణానికి పర్యావరణ అనుమతులు జారీ చేస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే 550 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఈ ప్లాంట్‌కు ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి బొగ్గు కేటాయింపులను కేంద్రం జరిపింది. ఈ విద్యుత్ ప్లాంట్ నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించడం, పరిసర ప్రాంతాల్లో పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం రూ.1,128.756 కోట్ల వ్యయంతో వివిధ రకాల నిర్మాణాలను చేపట్టాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశించింది.



సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో లోకాయుక్తగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ చింతపంటి వెంకటరాములుకు శుభాకాంక్షలు చెబుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ తమిళిసై, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ తదితరులు

## లోకాయుక్తగా సీవీ రాములు ప్రమాణ స్వీకారం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ చింతపంటి వెంకటరాములు, ఉపలోకాయుక్తగా రిటైర్డ్ జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి వొలిమినేని నిరంజన్‌రావు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వీరితో ప్రమాణం చేయించారు. అనంతరం గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వీరికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఐదేళ్లపాటు లోకాయుక్త, ఉపలోకాయుక్త పదవిలో వీరు కొనసాగనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపలోకాయుక్తగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వొలిమినేని నిరంజన్‌రావు

# సదరం.. ఇక సత్వరం

### దివ్యాంగుల కోసం 'ఆన్‌లైన్ స్లాట్ విధానం' ప్రారంభం
### మీసేవలో ముందుగానే బుక్ చేసుకుంటే చాలు..
### ఆసరా లబ్ధిదారులకు ఇబ్బంది కలగకూడదనే..: ఎర్రబెల్లి



సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల కష్టాలు తీరనున్నాయి. ఇక నుంచి సదరం సర్టిఫికెట్లను వారు ఈజీగా పొందవచ్చు. వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం దివ్యాంగులు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కొత్తగా 'సదరం'ఆన్‌లైన్ స్లాట్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సెర్ప్ సహకారంతో మహిళా రైతు ఉత్పత్తిదారులు (ఎఫ్‌పీవో) నిర్వహించే బేనిషాన్ కంపెనీని ప్రారంభించిన పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. సదరం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానానికి కూడా శ్రీకారం చుట్టారు. సాంకేతిక, ఇతర కారణాలతోగానీ పెన్షన్ల చెల్లింపులో ఆసరా లబ్ధిదారులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో వినతుల స్వీకరణ, పరిష్కారం చేస్తున్నామని, తాజాగా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ సిస్టంను అందుబాటులోకి తెస్తున్నామని ఆయన తెలిపారు.

**త్వరగా ధ్రువీకరణ పత్రం..**

- కొత్త విధానంతో అర్హులైన దివ్యాంగుల(వికలాంగుల)కు త్వరగా దివ్యాంగుల ధ్రువీకరణ పత్రం జారీ చేయవచ్చు.
- దివ్యాంగులు వారికి సమీపంలోని మీసేవ కేంద్రానికి వెళ్లి వైకల్యం అంచనా, ధ్రువీకరణ పత్రం కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చు.
- దీనికోసం సదరు వ్యక్తి ఆధార్ కార్డును మీసేవ కేంద్రానికి తీసుకెళ్లాల్సి ఉంటుంది.
- మీసేవ కేంద్రం నమోదు ప్రక్రియ దరఖాస్తుదారుల వేలిముద్ర/ఐరిస్ ప్రామాణీకరణతో మొదలవుతుంది. అలాగే మొదటిసారి స్లాట్ బుకింగ్ కోసం పేరు, చిరునామా వివరాలను నమోదు చేస్తారు.
- అనంతరం ఆయా జిల్లాల్లో ఏ రోజున, ఏ మెడికల్ క్యాంపునకు హాజరుకావాలో స్లాట్ బుకింగ్ చేసి వివరాలతో కూడిన రసీదును దరఖాస్తుదారుకు ఇస్తారు.
- ఒకవేళ దివ్యాంగులు అంతకుముందే 'సదరం ధ్రువీకరణపత్రం'కలిగి ఉన్నా... వైకల్య శాతం గతంలోనే అంచనా వేసి, అర్హత కంటే తక్కువ శాతం ఉంటే స్లాట్ బుకింగ్‌ను తిరస్కరిస్తారు.
- స్లాట్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి మీసేవ రసీదుతో మెడికల్ క్యాంపునకు హాజరవుతారు. మెడికల్ క్యాంపులోని నిర్వాహకులు దరఖాస్తుదారుడికి సదరం గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు.
- సదరం క్యాంపులో వైద్యులు దరఖాస్తుదారుడి వైకల్యం శాతాన్ని అంచనా వేస్తారు. సదరు దరఖాస్తుదారుకు అదేరోజున సదరం సర్టిఫికెట్ ఇవ్వబడుతుంది.

## క్లినికల్ ట్రయల్స్‌పై హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: నిలోఫర్ ఆసుపత్రిలో జరుగుతున్న క్లినికల్ ట్రయల్స్‌పై సమగ్ర విచారణ జరిపించాలని మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ)లో హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ ఫిర్యాదు చేశారు. నిలోఫర్‌లో అనధికారికంగా క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, ఈ ఆరోపణల్లో ఉన్న నిజానిజాలను నిగ్గుతేల్చాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ట్రయల్స్ వల్ల ఎంత మంది పిల్లలు చనిపోయారో కూడా తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని విచారించి, ఉల్లంఘనలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య హామీ ఇచ్చారని భాస్కర్ తెలిపారు. కాగా తెలంగాణ హెచ్‌ఆర్‌సీ ఏర్పడ్డాక ఇదే తొలి ఫిర్యాదు కావడం గమనార్హం.

# 22న మున్సి'పోల్స్'

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించి ఎస్‌ఈసీ జనవరి 7న నోటిఫికేషన్ జారీ చేయనుంది. మరుసటి రోజు ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసులు ఇస్తారు. అదే రోజు ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్ల దాఖలు ప్రారంభమై 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. 22న ఎన్నికలు నిర్వహిస్తారు. 25న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించి, అది ముగిసిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. కాగా, ఎన్నికలు జరిగే పట్టణ స్థానిక సంస్థల పరిధిలో సోమవారం నుంచే 'ఎన్నికల ప్రవర్తనా నియమావళి'అమల్లోకి తెస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్ నోటిఫికేషన్ జారీచేశారు.

**వారం పది రోజుల్లో రిజర్వేషన్ల ఖరారు?**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మరో వారం పది రోజుల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు కావొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే ఎస్టీ, ఎస్సీ ఓటర్ల జాబితాలు సిద్ధం కాగా, బీసీ జాబితా దాదాపు రెండు నెలల క్రితమే రూపొందించారు. అయితే ఈ మధ్యకాలంలో కొత్త ఓటర్లు నమోదు కావడంతో మరోసారి బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్ల జాబితా పూర్తిచేసి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేస్తారని సమాచారం. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ముందుగా ఎస్టీ, ఆ తర్వాత ఎస్సీ రిజర్వేషన్లు ఖరారు చేసి మిగిలిన శాతం రిజర్వేషన్లను బీసీ వర్గాలకు కేటాయిస్తారు. పది మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లు, 120 మున్సిపాలిటీలకు చైర్మన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం, జనరల్ కేటగిరీ కింద 50 శాతం కేటాయిస్తారు. అదే విధంగా మున్సిపాలిటీల్లోని 2,727 వార్డులకు, 10 కార్పొరేషన్లలోని 385 డివిజన్లకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి 800 మంది ఓటర్ల చొప్పున వార్డుల్లో ఓటరు జాబితాను రూపొందిస్తారు. ఆ తర్వాత వార్డుల వారీగా బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటరు జాబితాలను ప్రకటిస్తారని అధికారవర్గాల సమాచారం.



**ఇదీ ఎన్నికల షెడ్యూల్ ...**

| | |
|---|---|
| రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ | జనవరి 7 (మంగళవారం) |
| రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటీసులు | జనవరి 8 (బుధవారం) |
| వార్డులవారీగా ఓటర్ల జాబితాల ప్రదర్శన | జనవరి 8 (బుధవారం) |
| నామినేషన్ల దాఖలు ప్రారంభం | జనవరి 8 ఉదయం 10.30 గంటల నుంచి |
| నామినేషన్ల దాఖలుకు గడువు | జనవరి 10 (శుక్రవారం) సాయంత్రం 5 గంటల వరకు |
| నామినేషన్ల పరిశీలన | జనవరి 11 (శనివారం) ఉదయం 11 గంటల నుంచి |
| నామినేషన్ల తిరస్కరణపై అప్పీలు | జనవరి 12 (ఆదివారం) సాయంత్రం 5 గంటల వరకు |
| అప్పీళ్ల పరిష్కారం | జనవరి 13 (సోమవారం) సాయంత్రం 5 గంటల లోపు |
| నామినేషన్ల ఉపసంహరణకు గడువు | జనవరి 14 (మంగళవారం) మధ్యాహ్నం 3 గంటల లోపు |
| అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ | జనవరి 14 మధ్యాహ్నం 3 గంటల తర్వాత |
| పోలింగ్ తేదీ | జనవరి 22 (బుధవారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు |
| రీపోలింగ్ తేదీ (అవసరమైన పక్షంలో) | జనవరి 24 (శనివారం) |
| ఓట్ల లెక్కింపు | జనవరి 25 (శనివారం) ఉదయం 8 గంటల నుంచి (లెక్కింపు ముగియగానే ఫలితాల ప్రకటన) |

**ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్ ఇదీ...**

| | |
|---|---|
| ముసాయిదా ఫొటో ఓటర్ల గుర్తింపు జాబితా ప్రదర్శన | డిసెంబర్ 30 |
| అభ్యంతరాల స్వీకరణ | డిసెంబర్ 31 నుంచి 2020 జనవరి 2 వరకు |
| జిల్లాస్థాయిలో రాజకీయ పక్షాలతో ఎస్‌ఈసీ భేటీ | డిసెంబర్ 31 |
| మున్సిపల్ స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం | 2020 జనవరి 1 |
| అభ్యంతరాల పరిష్కారం | జనవరి 3 |
| వార్డులవారీగా తుది ఓటర్ల జాబితా ప్రచురణ | జనవరి 4 |

| మున్సిపల్ కార్పొరేషన్ | డివిజన్ల సంఖ్య |
|---|---|
| కరీంనగర్ | 60 |
| రామగుండం | 50 |
| బడంగ్‌పేట | 32 |
| మీర్‌పేట | 46 |
| బండ్లగూడ | 22 |
| బోడుప్పల్ | 28 |
| పీర్జాదిగూడ | 26 |
| జవహర్‌నగర్ | 28 |
| నిజాంపేట్ | 33 |
| నిజామాబాద్ | 60 |
| మొత్తం:10 కార్పొరేషన్లు | 385 డివిజన్లు |

## మహిళలు, విద్యార్థినుల రక్షణపై కార్యక్రమాలు: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: అత్యవసర సమయాల్లో డయల్ 100, 112లకు ఫోన్ చేయడంతో పాటు మహిళలు, పిల్లల రక్షణకు పోలీస్ శాఖ చేపట్టిన చర్యలు, హాక్ ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేయడం, షీ టీమ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని స్కూళ్లు, కాలేజీల్లో పోలీసు అధికారులతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ఎం.మహేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 872 పెట్రోలింగ్ కార్లు, 1,515 బ్లూకోట్స్ బృందాలు రోజూ తమ పరిధిలోని అన్ని స్కూళ్లు, కాలేజీల్లో ఈ చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని మహేందర్‌రెడ్డి తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. రోజూ 2వేలకు పైగా స్కూళ్లు, కాలేజీలను సందర్శించి ప్రార్థన, ఖాళీ సమయాల్లో ఈ చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. 'దిశ' ఘటన నేపథ్యంలో మహిళలు, స్కూళ్లు, కాలేజీ విద్యార్థినుల్లో భద్రతపై ఆత్మవిశ్వాసం కల్పించేందుకు ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. డీజీపీ ట్వీట్‌పై పలువురు నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు.

# న్యూ ఇయర్ 'షాక్'

- ఈవెంట్ల నిర్వహణకు భారీ వడ్డన నిర్ణయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- టికెట్ల ఆధారంగా రూ.50 వేల నుంచి రూ.2.5 లక్షల వరకు ఎక్సైజ్ ఫీజు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈవెంట్ల నిర్వహణ కోసం ఎక్సైజ్ ఫీజు భారీగా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2020 సంవత్సరాన్ని స్వాగతిస్తూ హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఈవెంట్లను నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోన్న తరుణంలో గతంలో ఉన్న ఈవెంట్ల ఫీజును సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.9 వేలు ఉన్న ఫీజును రూ.50 వేల నుంచి రూ.2.5 లక్షలకు పెంచినట్టు ఎక్సైజ్ శాఖ వర్గాలు వెల్లడించాయి. పెంచిన ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు ఇవి అమల్లో ఉంటాయని ఆ శాఖ అధికారులు చెపుతున్నారు.

**గతంలో రూ.9 వేలే...**

వాస్తవానికి గతంలో ఈవెంట్ల నిర్వహణకు చాలా తక్కువగా ఎక్సైజ్ ఫీజు వసూలు చేసేవారు. ఈవెంట్లకు హాజరయ్యే వారి సంఖ్య, ఇతర అంశాలతో సంబంధం లేకుండా జీహెచ్‌ఎంసీ పరిధిలో అయితే రూ.9 వేలు, మిగిలిన ప్రాంతాల్లో రూ.4,500 ఎక్సైజ్ ఫీజు కింద వసూలు చేసేవారు. అంటే ఈవెంట్లలో మద్యం సరఫరా అనుమతికి గాను ఈ ఫీజు తీసుకునేవారు. కానీ, చాలాకాలంగా ఈ ఫీజును సవరించకపోవడం, ఈవెంట్ల నిర్వహణ ఖరీదు కావడంతో ఫీజును పెంచాలని రెండు నెలల క్రితం ఎక్సైజ్ శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు సాధారణ ఈవెంట్ల నిర్వహణకు గాను జీహెచ్‌ఎంసీ పరిధిలో.. రూ.9 వేల నుంచి రూ.12 వేలకు పెంచారు. అదే స్టార్ హోటళ్లలో ఈవెంట్లను నిర్వహిస్తే దాన్ని రూ.9 వేల నుంచి రూ.20 వేలకు పెంచారు. ఇక జీహెచ్‌ఎంసీ వెలుపలి ప్రాంతాల్లో.. సాధారణ ఈవెంట్లకు రూ.4,500 నుంచి రూ.9 వేలకు, స్టార్‌హోటళ్లలో అయితే రూ.4,500 నుంచి రూ.12వేలకు ఎక్సైజ్ ఫీజు పెంచారు.

**వాణిజ్య, క్రీడా ఈవెంట్లకు భారీ వడ్డన...**

హైదరాబాద్ పరిధిలో న్యూఇయర్‌తో పాటు పలు సందర్భాలనుపురస్కరించుకునినిర్వహించే ఈవెంట్లలో మందు సరఫరా అనుమతికి గాను కట్టాల్సిన ఫీజు కూడా గతంలో రూ.9 వేలే ఉండేది. ఇప్పుడు ఆ ఫీజును ఈవెంట్లకు హాజరయ్యే వారి సంఖ్య ఆధారంగా ఎక్సైజ్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. కనీసం 1000 మంది హాజరయ్యే ఈవెంట్లలో మందు సరఫరా కోసం రూ.50వేలు,5వేలమందిలోపుహాజరయ్యే ఈవెంట్లకు రూ.లక్ష, అంతకన్నా ఎక్కువ మంది హాజరయితే రూ.2.5 లక్షలు ఫీజు వసూలు చేయాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఇక నుంచి హైదరాబాద్‌లో జరిగే వాణిజ్య ఈవెంట్ల ద్వారా భారీ ఆదాయం సమకూరనుంది. ఉప్పల్ స్టేడియంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తే అక్కడ లిక్కర్ సరఫరాకు గాను గతంలో రూ.9 వేలు చెల్లించేవారు. కానీ మారిన నిబంధనల ప్రకారం ఇప్పుడు రూ.2.5 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

## ఓటర్ల జాబితా, రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలా?

**టీపీసీసీ నేత నిరంజన్**

సాక్షి, హైదరాబాద్: వార్డుల వారీ ఓటర్ల జాబితా, రిజర్వేషన్లు తేలకుండానే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ఎలా ప్రకటిస్తారని టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి. నిరంజన్ ప్రశ్నించారు. సంక్రాంతి పండుగను విస్మరించి ఎన్నికల షెడ్యూలును ప్రకటించడం విస్మయం కలిగిస్తోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది పండుగ వాతావరణాన్ని కలుషితం చేస్తుందన్నారు.

## ప్రజలు ఆదరిస్తారన్న నమ్మకముంది

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఆదరిస్తారనే నమ్మకముందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ధీమా వ్యక్తంచేశారు. మున్సిపల్ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, టీఆర్‌ఎస్ పార్టీ అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలపై గత ఐదేళ్లలో చూపిన వివక్ష, మౌలిక సదుపాయాలు కల్పించకుండా అభివృద్ధికి దూరం చేసిన విషయాలను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలను నిరీర్యం చేసిందని, కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాయని తెలిపారు. ప్రధాని మోదీ తీసుకొచ్చిన ఉజ్వల పథకం ద్వారా పేద ప్రజల ఇంటింటికి వంట గ్యాస్ వచ్చిందన్నారు. పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలని స్వచ్ఛ భారత్ పథకం ద్వారా వీధులను శుభ్రంగా ఉంచడంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణాన్ని బీజేపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. అలాగే అందరికీ ఇల్లు ఉండాలనే సదుద్దేశంతో కేంద్రం ఆవాస్ యోజన తీసుకువస్తే ఆ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేరకుండా చేసిందని లక్ష్మణ్ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో అన్ని వార్డులకు బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని వెల్లడించారు.

## నాబార్డ్‌కు రూ. 132.89 కోట్లు

సాక్షి, హైదరాబాద్: నాబార్డ్ ద్వారా తీసుకున్న రుణాలకు వాయిదాలు, వడ్డీలు చెల్లించేందుకు రూ. 132.89 కోట్లు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో రుణాల వాయిదా చెల్లింపులకు రూ. 70.54 కోట్లు, వడ్డీల చెల్లింపు కోసం రూ. 62.35 కోట్లు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# ఒక ఆవరణలో ఒకటే బడి!

▶ మొదటి పేజీ తరువాయి

వస్తుందన్న కోణంలోనూ ఆలోచనలు చేస్తోంది. ఇది కనుక కార్యరూపం దాల్చితే దాదాపు 3 వేల ప్రభుత్వ పాఠశాలలు తగ్గి, 23 వేలకు పరిమితం అయ్యే అవకాశం ఉంది.

**ఒకే ఆవరణలో రెండు, మూడు..**

ప్రస్తుతం రాష్ట్రంలో 26,050 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో ఒకే ఆవరణలో రెండు మూడు స్కూళ్లు కొనసాగుతున్న పాఠశాలలు 7,077 ఉన్నాయి. వాటిల్లో కొన్ని ఆవరణల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, మరికొన్నింటిలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు వేర్వేరు స్కూళ్లు కొనసాగుతున్నాయి. దీంతో ఆయా స్కూళ్లలో ఇద్దరు ముగ్గురు ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు ముగ్గురు పీఈటీలు ఉండటంతో మానవ వనరులు వృథా అవుతున్నట్లు విద్యా శాఖ దృష్టికి వచ్చింది. అయితే ఒకే ఆవరణలో ఉన్న అలాంటి స్కూళ్లను ఒకే స్కూల్‌గా (1 నుంచి 10 వరకు) మార్చేస్తే ఒకరే హెడ్ మాస్టర్.. ఒకరే పీఈటీ/పీడీ ఉంటారు. తద్వారా మిగతా వారి సేవలను అవసరమైన వేరే స్కూళ్లలో సద్వినియోగపరచుకునే వీలు కలుగుతుందని అధికారులు యోచిస్తున్నారు.

**విధానం మార్పు కుదిరేనా?**

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రాథమిక (ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు), ప్రాథమికోన్నత (1 నుంచి 7వ తరగతి వరకు), ఉన్నత (6 తరగతి నుంచి 10వ తరగతి వరకు) మూడంచెల పాఠశాలల విధానం ఉంది. అయితే జాతీయ స్థాయిలో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ విధానం, 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సెకండరీ ఎడ్యుకేషన్ విధానం ఉంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఎలిమెంటరీ, సెకండరీ విద్యా విధానం ఉండాలని గతంలో చెప్పింది. ఈ నేపథ్యంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఒకే స్కూల్ విధానం సాధ్యం అవుతుందీ లేనిదీ పరిశీలించి ముందుకు వెళ్లాలని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఒకే ఆవరణలో ఒకటికి మించి ఎక్కువ పాఠశాలలు ఉన్నవి హైదరాబాద్ జిల్లాలోనే అత్యధికంగా ఉన్నాయి. ఆ తర్వాత సంగారెడ్డి, నిజామాబాద్‌లో ఎక్కువగా ఉన్నట్లు విద్యాశాఖ లెక్కలు తేల్చింది.

**జిల్లాల వారీగా స్కూళ్ల వివరాలు..**

| జిల్లా | మొత్తం స్కూళ్లు | ఒకే ఆవరణలో రెండు మూడున్నవి | జిల్లా | మొత్తం స్కూళ్లు | ఒకే ఆవరణలో రెండు మూడున్నవి |
|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 677 | 159 | నాగర్‌కర్నూల్ | 824 | 159 |
| భద్రాద్రి | 1,064 | 160 | నల్లగొండ | 1,483 | 282 |
| హైదరాబాద్ | 689 | 459 | నారాయణ్‌పేట | 499 | 152 |
| జగిత్యాల | 782 | 268 | నిర్మల్ | 735 | 198 |
| జనగాం | 508 | 131 | నిజామాబాద్ | 1154 | 433 |
| భూపాలపల్లి | 430 | 134 | పెద్దపల్లి | 547 | 167 |
| జోగుళాంబ | 461 | 115 | రాజన్న | 489 | 167 |
| కామారెడ్డి | 1,010 | 295 | రంగారెడ్డి | 1,307 | 378 |
| కరీంనగర్ | 650 | 228 | సంగారెడ్డి | 1,261 | 442 |
| ఖమ్మం | 1,214 | 265 | సిద్దిపేట | 975 | 277 |
| కుమ్రంభీం | 720 | 98 | సూర్యాపేట | 950 | 205 |
| మహబూబాబాద్ | 898 | 189 | వికారాబాద్ | 1,032 | 224 |
| మహబూబ్‌నగర్ | 859 | 191 | వనపర్తి | 518 | 142 |
| మంచిర్యాల | 711 | 133 | వరంగల్ రూరల్ | 664 | 212 |
| మెదక్ | 898 | 207 | వరంగల్‌అర్బన్ | 473 | 201 |
| మేడ్చల్ | 503 | 154 | యాదాద్రి | 712 | 176 |
| ములుగు | 353 | 76 | మొత్తం | 26,050 | 7,077 |

**ఇదం జగత్**




అబ్బే! అదేం లేదాసర్ బాగా ఇన్వాల్వ్ అయ్యాం!!

# దిగొస్తున్న ఉల్లి ధర

**హోల్‌సేల్‌లో రూ.80-90, రిటైల్‌లో ధర రూ.100-110**

- మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి పెరిగిన సరఫరా



**సాక్షి, హైదరాబాద్:** ఉల్లి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. పొరుగు రాష్ట్రాల నుంచి సరఫరా పెరగడంతో ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. నిన్న, మొన్నటివరకు కిలో రూ.130 వరకు ఉన్న ఉల్లి ధర రూ.20 వరకు తగ్గింది. గత కొద్ది రోజులుగా కర్ణాటక నుంచి ఉల్లి సరఫరా పూర్తిగా నిలిచిపోగా, మహారాష్ట్ర నుంచి 6 వేల నుంచి 7 వేల బస్తాల మేర మాత్రమే ఉల్లి సరఫరా జరిగింది. దీంతో హోల్‌సేల్ ధర రూ.110 నుంచి రూ.120 వరకు పలికింది. ఇది రిటైల్ మార్కెట్‌కు వచ్చే సరికి రూ.130–140 మధ్య పలికింది. అయితే సోమవారం మలక్‌పేట మార్కెట్‌కు కర్ణాటక, మహా రాష్ట్రల నుంచి ఏకంగా 16,650 బస్తాల ఉల్లి వచ్చింది. దీంతో కిలో ఉల్లి ధర రూ.80–90 మధ్య పలికింది. ఇది రిటైల్ మార్కెట్‌కు వచ్చే సరికి రూ.100–110 మధ్య పలికింది. వచ్చే పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రానికి ఉల్లి సరఫరా పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే జనవరి మొదటి వారానికి రిటైల్ మార్కెట్‌లో ధర రూ.70–80 వరకు తగ్గతాయని అంటున్నాయి. రాష్ట్రానికి ఈజిప్టు నుంచి రావాల్సిన ఉల్లి ఇంకా రాలేదు. దీనికి కారణాలేంటన్నది మార్కెట్ వర్గాలు చెప్పలేకపోతున్నాయి. విదేశాల నుంచి ఉల్లి దిగుమతి వ్యవహారాలను కేంద్రమే పర్యవేక్షిస్తున్నందున వారే దీనిపై సమాధానం చెప్పాలని అంటున్నాయి. అయితే మలక్‌పేట మార్కెట్‌లో మాత్రం ప్రతిరోజూ మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు ఈజిప్టు నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చిన ఉల్లిని విక్రయిస్తున్నారు. సోమవారం సైతం మార్కెట్‌లో లారీ ఈజిప్టు ఉల్లిని మహారాష్ట్ర వ్యాపారి ఒకరు కిలో రూ.70కి విక్రయించడం గమనార్హం.

# 9999 @ రూ.11.50 లక్షలు



**సాక్షి, హైదరాబాద్:** లక్కీ నంబర్లపై వాహనదారులు మరోసారి తమ క్రేజ్‌ను చాటుకున్నారు. సోమవారం ఖైరతాబాద్‌లో నిర్వహించిన ఫ్యాన్సీ నంబర్ల వేలంలో 'టీఎస్ 09 ఎఫ్‌జే 9999'నంబర్ కోసం హెటిరో డ్రగ్స్ సంస్థ ఏకంగా రూ.11,50,050 చెల్లించి సొంతం చేసుకుంది. ఈ సంస్థ తమ రూ.2.96 కోట్ల ఖరీదైన రేంజ్ రోవర్ 4.4 డీజిల్ ఎల్‌డబ్ల్యూబీ కోసం ఈ నంబర్‌ను దక్కించుకుంది. అలాగే 'టీఎస్ 09 ఎఫ్‌కే 0006'నంబర్ కోసం ఎం.విజయ్‌కృష్ణ అనే వాహనదారుడు రూ.1.53 లక్షలు చెల్లించారు. తమ హ్యూండాయ్ కారు కోసం ఈ నంబర్‌ను వేలంలో గెలుచుకున్నారు. 'టీఎస్ 09 ఎఫ్‌కే 0009'నంబర్ కోసం ఇంపార్టా ట్రైనింగ్ అకాడమీ రూ.1.26 లక్షలు చెల్లించి సొంతం చేసుకుంది. సోమవారం ఒక్క రోజు నిర్వహించిన ఫ్యాన్సీ నంబర్ల వేలంలో రూ.23,46,321 లభించినట్లు జేటీసీ పాండురంగ్‌నాయక్ తెలిపారు.

# 'స్థానిక' ఫలితం పునరావృతం..

## ఇదే టీఆర్‌ఎస్ వ్యూహం

- మున్సిపాలిటీ ఎన్నికలు లక్ష్యంగా పావులు
- ఇప్పటికే మున్సిపాలిటీల వారీగా వివరాల సేకరణ
- ఒకట్రెండు రోజుల్లో పార్టీ ఇన్‌చార్జులతో కేటీఆర్ సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని 120 మున్సిపాలిటీలు, 10 మున్సిపల్ కార్పొరేషన్ల పాలక మండళ్లకు జనవరి 22న ఎన్నిక నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ ప్రకటించింది. మున్సిపల్ ఎన్నికలకు మార్గం సుగమం కావడంతో మెజారిటీ మున్సిపాలిటీల్లో విజయం సాధించడం లక్ష్యంగా ప్రణాళికను టీఆర్‌ఎస్ ఇప్పటికే ప్రాథమికంగా రూపకల్పన చేసింది. సుమారు 6 నెలలుగా పావులు కదుపుతున్న టీఆర్‌ఎస్.. ఇప్పటికే మున్సిపాలిటీల వారీగా ప్రజా సమస్యలు, పార్టీ పరిస్థితిపై సమాచారాన్ని సేకరించింది. ఈ ఏడాది జూన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలుకుని పలు దశలుగా మున్సిపాలిటీలు, వార్డుల వారీగా సమాచారాన్ని సేకరించింది. 17 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని మున్సిపాలిటీల వారీగా సమాచారాన్ని సేకరించి క్రోడీకరించే బాధ్యతను 64 మంది పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు ఇన్‌చార్జులకు అప్పగించారు. మున్సిపాలిటీల్లో ప్రజా సమస్యలు, వార్డుల వారీగా పార్టీ పరిస్థితి, గత మున్సిపల్ ఎన్నికల్లో వార్డుల వారీగా వివిధ పార్టీలు సాధించిన ఓట్లు, 2018 అసెంబ్లీ, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మున్సిపాలిటీలు, బూత్‌ల వారీగా టీఆర్‌ఎస్ సాధించిన ఓట్లు తదితర వివరాలను పార్టీ ఇన్‌చార్జులు సేకరించి.. కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు నివేదికలు అందజేశారు.

**మూడు పర్యాయాలు కేటీఆర్ భేటీ**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ఓవైపు సందిగ్ధత కొనసాగుతున్నా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మూడు దశలుగా పార్టీ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. మున్సిపాలిటీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను అప్రమత్తం చేశారు. మరోవైపు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో మంత్రులు ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 32 జిల్లా పరిషత్ పీఠాలను కైవసం చేసుకున్న టీఆర్‌ఎస్, మున్సిపల్ ఎన్నికల్లో అదే రకమైన ఫలితాన్ని పునరావృతం చేయాలని భావిస్తోంది. వార్డులు, డివిజన్లు, మున్సిపాలిటీల వారీగా రిజర్వేషన్లు ప్రకటించిన వెంటనే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా గెలుపు గుర్రాలను పార్టీ అభ్యర్థులుగా ప్రకటించాలని భావిస్తోంది. ఇప్పటికే వార్డు స్థాయిలో ఇతర పార్టీలకు చెందిన బలాబలాలను కూడా అంచనా వేయడంతో పాటు, అవసరమైన చోట ఇతర పార్టీల నుంచి వలసలు ప్రోత్సహించాలని నిర్ణయించింది.

## ఒకటి రెండు రోజుల్లో కేటీఆర్ సమావేశం

పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రిగానూ కేటీఆర్ బాధ్యతలు నిర్వర్తిస్తుండటంతో పురపోరును టీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. మున్సిపల్ ఎన్నికలపై పార్టీ యంత్రాంగానికి దిశా నిర్దేశం చేసేందుకు ఒకట్రెండు రోజుల్లో పార్టీ ఇన్‌చార్జులు, ఇతర ముఖ్య నేతలతో కేటీఆర్ సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, సమన్వయం తదితర అంశాలపై పార్టీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లో బీజేపీ, ఎఐఎంఐఎం కొన్ని చోట్ల ప్ర భావం చూపే అవకాశం ఉండటంతో, ఆ రెండు పార్టీల విషయంలో అనుసరించాల్సిన వ్యూహంపైనా స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని పార్టీ ముఖ్య నేత ఒకరు తెలిపారు. వార్డు స్థాయిలో సోషల్ మీడియా కమిటీల ప్రచారానికి ప్రత్యేక వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది.

# 'కమలం' రెడీ

- ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా క్లస్టర్ కమిటీల ఏర్పాటు
- మున్సిపాలిటీల వారీగా ఇన్‌చార్జిల నియామకం

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ అన్ని ఏర్పాట్లు చేసుకుంటోంది. పట్టణాల్లో తమకు పట్టు ఉందని నిరూపించుకునేందుకు కమలం పార్టీ సిద్ధమవుతోంది. ఇప్పటికే వివిధ కమిటీల ద్వారా ముందుకెళ్తున్న బీజేపీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో మరింత వేగంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. అన్ని మున్సిపాలిటీల్లోని వార్డుల్లో పోటీ చేయాలని గతంలోనే నిర్ణయించింది. అలాగే హైదరాబాద్, సికింద్రాబాద్ మినహా మిగతా 15 పార్లమెంట్ నియోజకవర్గాలను ఒక్కో క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఆ పరిధిలోకి వచ్చే మున్సిపాలిటీల్లో ఎన్నికలకు సమాయత్తం చేసే బాధ్యతలను 2 నెలల కిందటే పార్టీ శ్రేణులకు అప్పగించింది. ప్రతి మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయి నేత ఒకరిని ఇన్‌చార్జిగా నియమించింది. మున్సిపాలిటీల పరిసర గ్రామాల్లోని ముఖ్య కార్యకర్తలకు మున్సిపల్ వార్డుల బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించింది. కొన్ని చోట్ల మున్సిపాలిటీల వారీగా కూడా పార్టీ సమావేశాలను పూర్తి చేసింది. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో 14వ ఆర్థిక సంఘం ద్వారా ఆయా మున్సిపాలిటీలకు ఎన్ని నిధులు వచ్చాయో ప్రచారం చేస్తుండటంతోపా టు కొన్ని ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను బీజేపీ నేతలు కలిశారు. ఇకపై పూర్తిస్థాయిలో లబ్ధిదారులను కలిసేందుకు కార్యాచరణను సిద్ధం చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వెల్లడించారు.

**అభ్యర్థుల ఎంపిక క్లస్టర్ కమిటీలదే..**

పోటీలో నిలిపే అభ్యర్థుల ఖరారు బాధ్యతలను క్లస్టర్ కమిటీలకు అప్పగించింది. పట్టణాల్లో బీజేపీకి బలమైన ఓటు బ్యాంకు ఉండటంతోపాటు ఉద్యోగ వర్గాలను తమవైపు తిప్పుకునేలా ప్రణాళికలు రచిస్తోంది. అలాగే ప్రతీ మున్సిపాలిటీకి ప్రత్యేకంగా మేనిఫెస్టోను ప్రకటించా లని నిర్ణయించింది. పంచాయతీ ఎన్నికల్లో తమకు సానుకూల ఫలితాలు రాకున్నా పురపాలక ఎన్నికల్లో ఆ పరిస్థితి ఉండకుండా చూసుకునేలా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. గతంతో పోల్చుకుంటే క్షేత్రస్థాయి నుంచి ఈసారి బీజేపీలోకి అధిక సంఖ్యలో నేతలు చేరారు. దీంతో చాలా మున్సిపాలిటీల్లో ఆ ప్రభావం ఉంటుందని బీజేపీ నేతలు అంటున్నారు.

# సింగిల్‌గానే కాంగ్రెస్!

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతున్న టీపీసీసీ

- మున్సిపాలిటీల వారీగా మేనిఫెస్టోలు.. తయారీకి కమిటీలు
- రాష్ట్రస్థాయిలో మున్సిపల్ విధానంపై మరో మేనిఫెస్టో
- స్థానిక నాయకత్వానికే అభ్యర్థుల ఎంపిక బాధ్యతలు
- నెల పాటు కీలక నేతలు మున్సిపాలిటీల్లోనే ఉండాలని నిర్ణయం
- టీఆర్‌ఎస్ అసంతృప్తులపై గురి.. నేడు ఎన్నికల కమిటీ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** కనీసం సగం పురపాలికల్లో పాగా వేయడమే లక్ష్యంగా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ముఖ్యంగా మున్సిపాలిటీల వారీ మేనిఫెస్టోలు, రాష్ట్రస్థాయిలో మరో మేనిఫెస్టో, యువతకు టికెట్ల కేటాయింపులో పెద్దపీట, టీఆర్‌ఎస్ అసంతృప్తులపై గురి, సామాజిక వర్గాల వారీగా తగిన ప్రాధాన్యం, స్థానిక సమస్యలపై స్పష్టమైన విధానం, పార్టీ నేతల మధ్య ఐక్యత అంశాలే ప్రాతిపదికగా ఆ పార్టీ మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఎన్నికల షెడ్యూల్ కూడా రావడంతో తన కసరత్తును టీపీసీసీ మరింత ముమ్మరం చేయనుంది.

**అవసరాన్ని బట్టి 'స్థానికం'గా..**

పొత్తుల విషయానికి వస్తే... ఈ మున్సిపల్ ఎన్నికలను ఒంటరిగానే ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇతర ప్రతిపక్షాలతో రాష్ట్రస్థాయిలో పొత్తులు పెట్టుకుని సీట్లు పంచుకునే దానికంటే అవసరాన్ని బట్టి స్థానికంగా తెలంగాణ జనసమితి (టీజేఎస్), కొన్నిచోట్ల వామపక్షాలను కలుపుకుని పోవాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరుణంలో దీనిపై త్వరలోనే టీపీసీసీ ఓ నిర్ణయం తీసుకుంటుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

**అసంతృప్తిని సొమ్ము చేసుకోవాల్సిందే..**

ఈసారి అధికార టీఆర్‌ఎస్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు రెండు రకాల అసంతృప్తులు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ నేతలు భావిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని ప్రజల్లో అధికార టీఆర్‌ఎస్‌పై ఉన్న అసంతృప్తిని ఓట్ల రూపంలో మలుచుకోవాలని, అదేవిధంగా అంతర్గతంగా టీఆర్‌ఎస్‌లో ఉన్న అసంతృప్తిని కూడా తమకు అనుకూలంగా మలచుకోవాలని యోచిస్తోంది. టీఆర్‌ఎస్‌లో టికెట్లు రాకుండా అసంతృప్తితో ఉండే నేతలకు గాలం వేసి వారికి అవకాశం ఇవ్వడం ద్వారా టీఆర్‌ఎస్ నుంచి కొంత కేడర్‌ను పార్టీలో ఇముడ్చుకోవడంతో పాటు ఆ నాయకుల చరిష్మా, పార్టీ ఇమేజ్ ఆధారంగా అధికార పార్టీపై పైచేయి సాధించాలనేది ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది.

**ఉమ్మడి బాధ్యతతోనే విజయం**

ఇక ఈ ఎన్నికల్లో విజయం కోసం సమష్టి కృషి చేయాలని, ఈ నెల రోజుల పాటు కీలక నేతలంతా మున్సిపాలిటీల్లో ఉండి పనిచేయాలని నిర్ణయించారు. అభ్యర్థుల ఖరారుతో పాటు ఎన్నికల్లో విజయం చేకూర్చే బాధ్యతలను డీసీసీ అధ్యక్షులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన వారికే అప్పగిస్తోంది. మున్సిపాలిటీల వారీగా ఇప్పటికే సమావేశాలు నిర్వహిస్తోన్న కాంగ్రెస్ స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న స్థానిక తటస్థులతో కమిటీ ఏర్పాటు చేసి మున్సిపాలిటీల వారీగా మేనిఫెస్టోలు తయారు చేయాలని యోచిస్తోంది. టికెట్ల ఎంపికలో సామాజిక న్యాయాన్ని పాటించాలని, బీసీలకు సగం సీట్లు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కూడా తగిన స్థాయిలో ప్రాతినిధ్యం ఇవ్వాలని భావిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరుణంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు సంపత్, వంశీచందర్‌రెడ్డిల ఆధ్వర్యంలోని టీపీసీసీ మున్సిపల్ ఎన్నికల కమిటీ మంగళవారం గాంధీభవన్‌లో భేటీ అయి కార్యాచరణ రూపొందించనుంది.

## హేమంత్ సోరెన్‌కు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

**సాక్షి, హైదరాబాద్:** జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న జేఎంఎం నేత హేమంత్ సోరెన్‌కు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి హేమంత్ తండ్రి శిబు సోరెన్ మద్దతుగా నిలిచారని, హేమంత్ కూడా అండగా ఉండేవారని గుర్తు చేశారు. జేఎంఎం జార్ఖండ్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేయడం, ముఖ్యమంత్రిగా హేమంత్ బాధ్యతలు స్వీకరించబోతుండటం తెలం గాణ ప్రజలకు సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.

## ఏడు దేవాలయాల్లో ట్రస్ట్‌బోర్డు నోటీసులు రద్దు

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఏడు దేవాలయాల్లోట్రస్ట్‌బోర్డుల ఏర్పాటుకు సంబంధించి ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతూ గత జూన్‌లో వెలువరించిన నోటీసులను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు సోమవారం దేవాదాయ కార్యదర్శి వి.అనిల్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. ఆ జాబితాలో సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డులోని గణేశ్ దేవాలయం, ఉజ్జయిని మహంకాళి, బ ల్కంపేట ఎల్లమ్మ, శ్రీనగర్ కాలనీలోని వెంకటేశ్వరస్వామి, సికింద్రాబాద్ ఎస్పీ రోడ్ వీర హనుమాన్, సికింద్రాబాద్ కోనేరు వీధిలోని వెం కటేశ్వర పెరుమాల్, అమీర్‌పేట్ కనకదుర్గ దేవాలయాలున్నాయి.

## ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ ఎన్నిక

**హైదరాబాద్:** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కొత్త కార్యవర్గంఎన్నిక ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌కు మార్, ప్రధాన కార్యదర్శి సదానంద్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షురాలిగా ఎస్.రాజమణి, ప్రధాన కార్యదర్శిగా పి.ప్రవీణ్‌కు మార్, ఆర్థిక కార్యదర్శిగా బాలనర్సింహు లు ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పురుషోత్తంరెడ్డి, ఖాజాపాషా, భాస్కర్, నరేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బాలకృష్ణలు ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ కార్యాలయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుడైన కేసీఆర్ సీఎంగా ఉండటం రాష్ట్రానికి గర్వ కారణమన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెటుకొని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ప్రశంసించారు.






# జేఎంఎం కూటమి జయకేతనం

- జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీ ఓటమి
- ఓడిపోయిన సీఎం రఘుబర్ దాస్, పలువురు మంత్రులు



రాంచీలో విజయోత్సవాలు జరుపుకుంటున్న కాంగ్రెస్, జేఎంఎం మద్దతుదారులు

**రాంచీ/న్యూఢిల్లీ:** జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం), కాంగ్రెస్, ఆర్జేడీల కూటమి మెజారిటీ సాధించింది. 81 స్థానాలున్న అసెంబ్లీలో 47 సీట్లను కూటమి అభ్యర్థులు గెలుచుకున్నారు. గత ఐదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ 25 స్థానాలకే పరిమితమైంది. కూటమిలో జేఎంఎం 30 స్థానాల్లో, కాంగ్రెస్ 16 సీట్లలో, ఆర్జేడీ ఒక స్థానంలో గెలుపొందాయి. ఫలితాల అనంతరం ముఖ్యమంత్రి, బీజేపీ నేత రఘుబర్ దాస్ రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్ ద్రౌపది ముర్ముకి అందించానని, కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని తనను కోరారని అనంతరం రఘుబర్ తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన జేఎంఎం కూటమికి, కూటమి సీఎం అభ్యర్థి హేమంత్ సోరెన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. జార్ఖండ్ ఎన్నికల్లో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి విజయం సాధించడం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరమని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పేర్కొన్నారు. జేఎంఎం చీఫ్ హేమంత్ సోరెన్‌కు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో ప్రతిష్టాత్మక జంషెడ్‌పూర్(ఈస్ట్) స్థానం నుంచి సీఎం రఘుబర్ దాస్ పోటీ చేశారు. ఆయనపై బీజేపీ రెబెల్ అభ్యర్థి సరయు రాయ్ గెలుపొందారు. జంషెడ్‌పూర్(వెస్ట్) నుంచి టికెట్ నిరాకరించడంతో సరయు రాయ్ ఇండిపెండెంట్‌గా జంషెడ్‌పూర్(ఈస్ట్) నుంచి బరిలో దిగారు. అసెంబ్లీ స్పీకర్ దినేశ్ ఓరాన్, పలువురు మంత్రులు ఓటమి పాలయ్యారు. విజయం అనంతరం జేఎంఎం చీఫ్ హేమంత్ సోరెన్ రాష్ట్ర ప్రజలకు, తన తండ్రి శిబూ సోరెన్‌కు, కూటమి పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్(ఏజేఎస్‌యూ) పార్టీ 2 సీట్లలో గెలుపొందింది. ఆ పార్టీ అధ్యక్షుడు సుదేశ్ మహతో 20 వేల మెజారిటీతో సిలీ స్థానం నుంచి గెలుపొందారు. జార్ఖండ్ వికాస్ మోర్చా- ప్రజా తాంత్రిక్(జేవీఎం-పీ) చీఫ్ బాబూలాల్ మరాండి ధన్వార్ స్థానం నుంచి గెలుపొందగా, ఆ పార్టీ మరో రెండు సీట్లనూ గెలుచుకుంది. రాంచి స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సీపీ సింగ్ గెలుపొందారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 33.53%, జేఎంఎంకు 19.29%, కాంగ్రెస్‌కు 13.78%, ఆర్జేడీకి 2.82%, ఏజేఎస్‌యూకి 8.15%, ఎంఐఎంకు 1.08% ఓట్లు లభించాయి. ముస్లింల జనాభా గణనీయంగా ఉన్న జార్ఖండ్‌లో సీఏఏ వ్యతిరేకత తీవ్ర ప్రభావం చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు. దాంతోపాటు రాష్ట్రంలో ముస్లింలపై జరిగిన పలు మూకదాడులపై కూడా వ్యతిరేకత వ్యక్తమైంది. ఏజేఎస్‌యూతో పొత్తు కుదుర్చుకోలేకపోవడం కూడా బీజేపీ ఓటమికి కారణంగా భావిస్తున్నారు.

**పీఎం మోదీ శుభాకాంక్షలు**

జార్ఖండ్ అసెంబ్లీ విజయం సాధించిన జార్ఖండ్ ముక్తి మోర్చా నేత హేమంత్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన హేమంత్, జేఎంఎం నేతృత్వంలోని కూటమికి అభినందనలు' అని ట్వీట్ చేశారు. ఇన్నాళ్లు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు జార్ఖండ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఓటమి బీజేపీది కాదని, వ్యక్తిగతంగా తనదని ముఖ్యమంత్రి రఘుబర్ వ్యాఖ్యానించారు.

## సీఏఏ, ఎన్నార్సీలపై ప్రజా తీర్పు

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంపై కాంగ్రెస్, జేఎంఎం, ఆర్జేడీ కార్యకర్తలకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఉపాధి, నీరు, అడవి, వ్యవసాయం, వాణిజ్యం.. తదితర అంశాల్లో ప్రభుత్వ సాయాన్ని కోరుకుంటోంటే బీజేపీ నేతృత్వంలోని కేంద్రం మాత్రం విభజన రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శించారు. అందుకే ప్రజలు ఈ తీర్పునిచ్చారని ఆమె ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల అహంకారాన్ని జార్ఖండ్ ప్రజలు నాశనం చేశారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది. హేమంత్ సోరెన్‌కు టీఎంసీ చీఫ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ శుభాకాంక్షలు తెలిపారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీలకు వ్యతిరేకంగా తాజాగా ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ @ 7

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో సొంతంగా కానీ, కూటమితో కలిసి కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 7కి చేరింది. పంజాబ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరిలో కాంగ్రెస్ సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీలతో పొత్తు పెట్టుకుని అధికారంలో భాగస్వామ్యం సాధించింది. తాజాగా జార్ఖండ్‌లో జేఎంఎం కూటమిలో చేరి విజయం సాధించింది.



సోమవారం రాంచీలో సైకిల్ తొక్కుతున్న హేమంత్ సోరెన్

## హేమంత్ నేపథ్యం

జార్ఖండ్ ఎన్నికల్లో విజయం సాధించిన జార్ఖండ్ ముక్తిమోర్చా(జేఎంఎం) అధ్యక్షుడు హేమంత్ సోరెన్ ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. గిరిజన పోరాటయోధుడు బిర్సా ముండాయే తనకు స్ఫూర్తి అని చెప్పుకునే హేమంత్.. కేంద్ర మాజీ మంత్రి, మూడుసార్లు జార్ఖండ్ సీఎంగా పనిచేసిన ఆదివాసీ నేత శిబూ సోరెన్ కుమారుడు.

- **తల్లిదండ్రులు:** రూపి, శిబూ సోరెన్
- **జననం:** 1975 ఆగస్టు 10.
- **స్వస్థలం:** రామ్‌గఢ్ జిల్లా నేమ్రా గ్రామం, జార్ఖండ్
- **విద్య:** ఇంటర్, ఇంజినీరింగ్ (డిస్‌కంటిన్యూ)
- **హాబీలు:** వంట చేయడం, క్రికెట్ ఆడటం
- **భార్య:** కల్పనా సోరెన్

**రాజకీయ ప్రవేశం**

- సోదరుడు దుర్గ హఠాన్మరణంతో హేమంత్ 2009లో జేఎంఎం పగ్గాలు చేపట్టారు.
- 2005లో తొలిసారి దుమ్కా స్థానం నుంచి ఎన్నికల బరిలోకి. జేఎంఎం తిరుగుబాటు నేత స్టీఫెన్ మరాండీ చేతిలో ఓటమి.
- 2009- 2010లో రాజ్యసభ సభ్యుడు.
- 2010లో జార్ఖండ్ డెప్యూటీ సీఎంగా బాధ్యతలు.
- 2013 జూలై 13న జార్ఖండ్ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన ఎత్తివేసిన తరువాత కాంగ్రెస్, ఆర్జేడీ మద్దతుతో 2013 జూలై 15న సుమారు 38 ఏళ్లకే రాష్ట్రానికి అత్యంత చిన్న వయస్కుడైన సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. 2014 డిసెంబర్ వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు.
- 2014 డిసెంబర్ 23న బార్‌హైత్ ఎమ్మెల్యేగా ఎన్నిక.. ప్రతిపక్ష నేతగా ఎంపిక.

## బీజేపీ ప్రాభవం తగ్గుతోంది!

బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల జాబితా నుంచి తాజాగా జార్ఖండ్ కూడా జారిపోయింది. 2017లో దేశ భూభాగంలోని 71%లో బీజేపీ ఆధికారంలో ఉంది. ఇప్పుడు 2019 డిసెంబర్ నాటికి అది 35 శాతానికి తగ్గిపోయింది. జనాభా విషయానికి వస్తే నాడు 69% జనాభా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉండగా, అదిప్పుడు 43 శాతానికి తగ్గింది. ఈ సంవత్సరం ఏప్రిల్- మే నెలల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన అనంతరం జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయింది. త్వరలో ఢిల్లీ, బిహార్‌లలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ పునరాలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రాల్లో బీజేపీ ఓటమి పరంపర 2018 నుంచి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌ల్లో ఓటమి నుంచి ప్రారంభమైంది. ఆయా రాష్ట్రాల్లో పట్టున్న సామాజిక వర్గాల నుంచి కాకుండా వేరే వర్గాల నేతలను ప్రోత్సహించే విధానాన్ని బీజేపీ వదలాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. హరియాణాలో జాట్, మహారాష్ట్రలో మరాఠా, జార్ఖండ్‌లో గిరిజనులు బీజేపీకి వ్యతిరేకంగా నిలిచిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. హరియాణా, మహారాష్ట్రల్లో అతి పెద్ద పార్టీగా నిలిచినప్పటికీ.. గత ఎన్నికల్లో గెలిచిన స్థానాలతో పోలిస్తే.. తక్కువ సీట్లనే గెలుచుకుంది. హరియాణాలో జననాయక్ జనతా పార్టీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ.. మహారాష్ట్రలో మిత్ర పక్షం శివసేనతో విభేదాల కారణంగా, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని కోల్పోయింది. తాజాగా, జార్ఖండ్‌లో అధికారాన్ని కోల్పోయింది. లోక్‌సభ ఎన్నికల తరువాత జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటు శాతం కూడా.. లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన ఓట్ల శాతంతో పోలిస్తే బాగా తగ్గింది. లోక్‌సభ ఎన్నికల్లో జార్ఖండ్‌లో బీజేపీ ఓటు శాతం 55 కాగా, తాజా అసెంబ్లీ ఎన్నికల్లో అది 33 శాతానికి తగ్గింది. హరియాణాలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటుశాతం 58 కాగా, అది శాసనసభ ఎన్నికల నాటికి 36 శాతానికి తగ్గింది. ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాఖ్, అయోధ్యలో రామ మందిరం.. తదితర సైద్ధాంతిక హామీలను నెరవేర్చినప్పటికీ.. ఆ ప్రభావం అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించకపోవడం గమనార్హం.




# సినిమాల్లో హింసకు తావివ్వొద్దు

**జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రదానంలో ఉపరాష్ట్రపతి**



ఉపరాష్ట్రపతి వెంకయ్య నుంచి అవార్డు అందుకుంటున్న నాగ్ అశ్విన్, అక్షయ్ కుమార్

**సాక్షి, న్యూఢిల్లీ:** సినిమాల్లో అశ్లీలత, అసభ్యత, హింసకు తావివ్వరాదని, ప్రజలపై సినిమా చూపే ప్రభావాన్ని దర్శక నిర్మాతలు తెలుసుకోవాలని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చిత్రరంగానికి పిలుపునిచ్చారు. 66వ జాతీయ చలన చిత్ర పురస్కారాలను ఉపరాష్ట్రపతి సోమవారం ఇక్కడ ప్రదానం చేసి ప్రసంగించారు. 'సినిమా శక్తిమంతమైన మాధ్యమం. సామాజిక మార్పునకు సాధనంగా వినియోగించాలి. ముఖ్యంగా యువత మనసుపై సినిమా ప్రభావం చూపుతుంది. అందువల్ల విలువలను పెంచేదిగా సినిమా ఉండాలి' అని పేర్కొన్నారు. 'మహిళలపై అత్యాచారం, హింస ప్రబలుతోంది. ఈ ధోరణిని ఎదుర్కోవడానికి సామాజిక సందేశం సినిమాల ద్వారా ప్రజలకు చేరాలి' అని పిలుపునిచ్చారు. మన సినిమాలు భారతీయతను ప్రపంచానికి చాటి చెప్పాలని సందేశం ఇస్తూ అవార్డు గ్రహీతలను అభినందించారు. ఇతర సామాజిక అంశాల కేటగిరీలో ఉత్తమ చిత్రంగా ఎంపికైన హిందీ చిత్రం 'ప్యాడ్‌మ్యాన్'కుగాను అక్షయ్‌కుమార్ అవార్డును స్వీకరించారు.

**అవార్డులు అందుకున్న తెలుగు సినీ ప్రముఖులు..**

మహానటి చిత్రంలో అత్యుత్తమ అభినయానికి కీర్తి సురేష్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు కింద ఆమె రజత కమలం, రూ. 50 వేల నగదు అందుకున్నారు. ఉత్తమ తెలుగు చిత్రంగా 'మహానటి' ఎంపికై నందుకు ఆ చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ పురస్కారాన్ని అందుకున్నారు. రూ. లక్ష నగదు పురస్కారాన్ని ఈ అవార్డుతోపాటు అందుకున్నారు. ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డుకు 'చి.ల.సౌ' చిత్రం ఎంపికై నందున చిత్ర దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రజత కమలం, రూ. 50 వేల పురస్కారం అందుకున్నారు. ఉత్తమ ఆడియోగ్రఫీ అవార్డు రంగస్థలం చిత్రానికిగాను ఎం.ఆర్.రాజాకృష్ణన్ అందుకున్నారు. ఈ అవార్డుతోపాటు ఆయన రజత కమలం, రూ. 50 వేల నగదు పురస్కారం అందుకున్నారు. ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ అవార్డును మహానటి చిత్రానికిగాను ఇంద్రాణీ పట్నాయక్, గౌరవ్‌షా, అర్చనా రావ్ అందుకున్నారు. ఈ పురస్కారంతోపాటు రజత కమలం, రూ. 50 వేల నగదు అందుకున్నారు. 'అ' చిత్ర మేకప్ ఆర్టిస్ట్ రంజిత్ ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు స్వీకరించారు. రజత కమలం, రూ. 50 వేల నగదు అందుకున్నారు. 'అ' చిత్రానికిగాను సృష్టి క్రియేటివ్ స్టూడియో, యునిఫై మీడియా స్పెషల్ ఎఫెక్ట్స్ అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారం కింద రజత కమలం, రూ. 50 వేల నగదు అందుకున్నారు.

# క్యూఆర్‌సామ్ క్షిపణి పరీక్ష సక్సెస్

**బాలాసోర్:** భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన క్విక్ రెస్పాన్స్ సర్ఫేస్ టు ఎయిర్(క్యూఆర్‌సామ్) క్షిపణిని సోమవారం ఒడిశాలోని బాలాసోర్‌లో విజయవంతంగా పరీక్షించారు. 2021 నాటికి రక్షణ దళాలకు అందుబాటులోకి రానున్న ఈ క్షిపణిని చాందీపూర్‌లోని క్షిపణి పరీక్ష కేంద్రంలో పరీక్షించారు. భూతలం నుంచి గాల్లోని లక్ష్యాన్ని ఛేదించే ఈ క్షిపణి ప్రయోగం అన్ని రకాలుగా సత్ఫలితాలిచ్చిందని చెప్పారు. క్యూఆర్‌సామ్ క్షిపణిని కదిలే వాహనం నుంచి ప్రయోగించవచ్చునని, పూర్తిగా ఆటోమేట్ అయిన కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, నిఘా రాడార్, మల్టీఫంక్షన్ రాడార్‌తోపాటు లాంచర్‌లతో కూడి ఉంటుందని వివరించింది. రెండు రాడార్లూ అన్నివైపులా చూడగలవని, వాహనం కదులుతూండగానే ఈ పనులు చేయగలగడం మరో ప్రత్యేకతని ఆ ప్రకటనలో తెలిపారు. క్షిపణి పరీక్షను డీఆర్‌డీవోలోని మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ ఎమ్మెస్సార్ ప్రసాద్ పర్యవేక్షించారు.

# ఖషోగ్గీ కేసులో ఐదుగురికి మరణశిక్ష



**రియాద్:** వాషింగ్టన్ పోస్ట్ జర్నలిస్టు జమాల్ ఖషోగ్గీ హత్య కేసులో ఐదుగురికి మరణ శిక్ష విధిస్తూ సౌదీ అరేబియా కోర్టు తీర్పునిచ్చింది. విచారణను ఎదుర్కొన్న ఇద్దరు ఉన్నతస్థాయి వ్యక్తులను నిర్దోషులుగా ప్రకటించింది. సౌదీ అరేబియా పబ్లిక్ ప్రాసిక్యూటర్ షలాన్ అల్ షలాన్ సోమవారం ఈ విషయాలు తెలిపారు. నేరాన్ని కప్పి ఉంచేందుకు యత్నించారన్న ఆరోపణలపై ఈ కేసులో మరో ముగ్గురికి 24 ఏళ్ల జైలు శిక్ష విధించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. ఈ కేసులో 11 మంది విచారణను ఎదుర్కోగా ఐదుగురికి మరణశిక్ష, ముగ్గురికి జైలు విధించగా మిగిలిన వారు నిర్దోషులుగా విడుదలయ్యారు. యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ బద్ధ వ్యతిరేకి అయిన ఖషోగ్గీ గత ఏడాది అక్టోబర్ 2న ఇస్తాంబుల్ (టర్కీ)లోని సౌదీ ఎంబసీలో హత్యకు గురయ్యారు. దౌత్య కార్యాలయ అధికారులు ముందు హత్యను నిరాకరించినా.. ఘర్షణలో అతడు మరణించినట్లు తర్వాత ఒప్పుకున్నారు.

## లక్ష ఎన్‌సీసీ సీట్ల పెంపు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఎన్‌సీసీ విభాగంలో అదనంగా లక్ష సీట్లను కేటాయిస్తూ రక్షణ శాఖ అనుమతులు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతిలో ఈ సీట్లను కేటాయించినట్లు తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా ఎన్‌సీసీ బలం 15 లక్షలకు చేరుకుంటుందని రక్షణ శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ సోమవారం ట్వీట్ చేశారు. అదనపు సీట్ల ద్వారా దాదాపు 100 నుంచి 150 కాలేజీలు/ స్కూళ్లు లబ్ధి పొందుతాయని పేర్కొన్నారు. ఎన్‌సీసీలో చేరాలనుకునే కాలేజీలో 500 మంది విద్యార్థులు ఉండాలని తెలిపారు. ఎన్‌సీసీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న కాలేజీలకు ఒక పూర్తి కంపెనీ బలాన్ని (150 క్యాడెట్లు) కేటాయిస్తామని చెప్పారు.

## స్విస్ ఖాతాల వివరాలివ్వలేం

**న్యూఢిల్లీ:** స్విస్ బ్యాంకుల్లో నల్లధనం దాచుకున్న భారతీయుల ఖాతాల వివరాలు వెల్లడించలేమని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. భారత్, స్విట్జర్లాండ్ మధ్య పన్ను ఒప్పందం కారణంగానే వివరాలు వెల్లడించలేమంది. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ ఈ మేరకు సమాధానమిచ్చింది. విదేశాల నుంచి వచ్చిన నల్లధనం వివరాలనూ చెప్పలేమంది. స్విస్ బ్యాంకుల్లోని భారతీయుల ఖాతాల సమాచార వివరాలను అందించాలని ఆర్థిక శాఖను ఓ పీటీఐ జర్నలిస్టు కోరారు. సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ పై విధంగా స్పందించింది.

## ఢిల్లీలో అగ్నిప్రమాదం; 9మంది మృతి

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఢిల్లీలోని కిరారీ ప్రాంతంలోని మూడంతస్తుల భవనంలో సోమవారం తెల్లవారుజాము సమయంలో మంటలు చెలరేగడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మృతిచెందారు. మృతుల్లో తొమ్మిది నెలల చిన్నారి సహా ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఏడుగురిలో ఒకరికి మానసిక సమస్య

**న్యూఢిల్లీ:** 2017వ ఏడాదిలో ప్రతి ఏడుగురు భారతీయుల్లో ఒకరు మానసిక సమస్యలు ఎదుర్కొన్నారని, మనో వ్యాకులత (డిప్రెషన్), ఆందోళనలు (యాంగ్జైటీ) సాధారణ సమస్యలు కాగా.. తీవ్రతలో తేడాలున్నాయని ఒక అధ్యయనం తేల్చింది. ఈ అధ్యయనం వివరాలు లాన్సెట్ సైకియాట్రీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

# పోటాపోటీ ప్రదర్శనలు

- 'పౌర' చట్టంపై అనుకూల, వ్యతిరేక ర్యాలీలు
- ఢిల్లీలో కాంగ్రెస్ సత్యాగ్రహం
- కోల్‌కతాలో బీజేపీ ర్యాలీ

**న్యూఢిల్లీ/కోల్‌కతా/తిరువనంతపురం/ముంబై:** పౌరసత్వ సవరణ చట్టానికి అనుకూలంగా, వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రశాంతంగా ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. చట్టాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో ర్యాలీలు నిర్వహించారు.

**పౌర చట్టంపై కాంగ్రెస్ సత్యాగ్రహం!**

పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ సోమవారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో సత్యాగ్రహం చేపట్టింది. 'ఐకమత్యం కోసం సత్యాగ్రహం'పేరుతో నిర్వహించిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్, రాహుల్, ముఖ్య నేతలు పాల్గొన్నారు. విద్వేషాలను పెంచుతూ దేశాన్ని ముక్కలు చేసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. భరత మాత గొంతు అణచివేసేందుకు, రాజ్యాంగంపై దాడికి చేస్తున్న యత్నాలను ప్రజలు కొనసాగనివ్వబోరని హెచ్చరించారు.

**చెన్నైలో డీఎంకే ర్యాలీ**

తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షం డీఎంకే సోమవారం చెన్నైలో భారీ ర్యాలీ చేపట్టింది. ఈ ర్యాలీలో డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ పక్కన కాంగ్రెస్ నేత పి.చిదంబరం 'పౌర'చట్టానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నడిచారు.

**పెళ్లిళ్లు, వేడుకల్లోనూ 'పౌర' నిరసనలు**

కేరళలో పెళ్లిళ్లు, వేడుకలు, క్రిస్మస్ సంబరాలే నిరసన వేదికలుగా మారాయి. ఈ ఒరవడి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వరుడు, వధువు పెళ్లి విందు సందర్భంగా ఎన్నార్సీకి, పౌర చట్టానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని ముందు నడుస్తుండగా వారి బంధువులు నినాదాలు చేసుకుంటూ వస్తున్న వీడియో ఒకటి వైరల్ అవుతోంది.

**రాజకీయ లబ్ధికే బెంగాల్ సీఎం మొగ్గు..**

పౌరసత్వ సవరణ చట్టంపై సాధారణ ప్రజానీకాన్ని తప్పుదోవ పట్టిస్తున్న పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీకి జాతీయ ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చారని బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా అన్నారు. 'పౌర'చట్టానికి అనుకూలంగా కోల్‌కతాలో సోమవారం బీజేపీ చేపట్టిన ర్యాలీలో ఆయన మాట్లాడారు.

**ఆశ్చర్యం కలిగించాయి: పవార్**

దేశవ్యాప్తంగా జాతీయ పౌర రిజిస్టర్(ఎన్నార్సీ)అమలు చేసే విషయమై పార్లమెంట్‌లో చర్చే జరగలేదన్న మోదీ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పేర్కొన్నారు. ఎన్నార్సీ అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందంటూ పార్లమెంట్ సంయుక్త సమావేశం సందర్భంగా రాష్ట్రపతి వెల్లడించారని గుర్తు చేశారు.

**మమతా బెనర్జీ లేఖ**

బీజేపీ ప్రభుత్వం కారణంగా దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, కలిసికట్టుగా ఉండి దేశాన్ని రక్షించుకుందామన్న బెంగాల్ సీఎం మమత.. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల సీనియర్ నేతలకు లేఖలు రాశారు.



సత్యాగ్రహం కార్యక్రమంలో తన తల్లి సోనియాకు శాలువా కప్పుతున్న రాహుల్

## అందుకే ఎన్నార్సీపై వెనక్కు!

జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ)పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాము అధికారంలోకి వచ్చాక ఎన్నార్సీపై కేబినెట్లోగానీ, పార్లమెంట్లోగానీ చర్చించలేదని ఆదివారం ఢిల్లీలో జరిగిన బహిరంగ సభలో మోదీ చెప్పడం తెల్సిందే. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్నార్సీలపై నిరసనలు, హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో కొన్నాళ్లు ఎన్ఆర్‌సీని పక్కనపెట్టాలన్న వ్యూహాత్మక ఆలోచనలో భాగంగానే ప్రధాని ఆ వ్యాఖ్య చేశారని భావిస్తున్నారు. అందుకే ఎన్నార్సీ, సీఏఏ వేరు వేరు అని వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారని విశ్లేషకులు భావిస్తున్నారు. సీఏఏ, ఎన్నార్సీ వ్యతిరేక ఆందోళనలు ఇంత తీవ్ర స్థాయిలో జరుగుతాయని ఊహించలేదని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ఎన్నార్సీపై ముస్లింల ఆందోళన కూడా ఈ స్థాయిలో నిరసనలు జరగడానికి కారణమని పేర్కొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

ఉద్యోగావకాశాలు
A professionally managed, well established Real Estate Organisation in Dilsukhnagar Requires:
- Tele Callers (Male/Female) ( Hindi, English & Telugu and Good Communication Skills.)
- Public Relation Officers (PRO's)
- Record Assistant (Knowledge in Land Docs)
- Liaisoning Officer
- Site Co-Ordinators
- Jr. advocates
- Accounts Assistant (Excel &Tally)
- Web Designer
- Drivers
- Office Boys

Urgently required

The most trusted name in the real estate industry
JSR Group Sun City
An ISO 9001 : 2015 Certified Company

Interested candidates contact below mentioned address or Walk-in Interview with resume & 2 photos between 2 pm to 6 pm on Wednesday (25-12-2019) Friday (27-12-2019) & Saturday (28-12-2019)
H.No.4-130, Near Dilsukhnagar Public School, Durganagar, Dilsukhnagar, Hyderabad-60.
Cell: 99631 58899, 75699 42315
Email : info@jsrgroupsuncity.com

సాక్షి
మంగళవారం, డిసెంబర్, 24

# చేజారిన మరో రాష్ట్రం!

మావోయిస్టు ప్రభావిత రాష్ట్రమైన జార్ఖండ్‌లో బీజేపీ పాలనకు జనం చరమగీతం పాడారు. వేర్వేరు మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను నిజం చేస్తూ సోమవారం అక్కడి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. మహారాష్ట్ర భంగపాటు జరిగి రెణ్నెల్లు తిరక్కుండానే జార్ఖండ్‌లో బీజేపీకి తగిలిన రెండో గాయమిది. ఓట్ల లెక్కింపు మొదలైనప్పటినుంచీ కొంచెం హెచ్చుతగ్గులతో అన్ని స్థానాల్లోనూ ఈ ధోరణి కనబడింది. చెప్పాలంటే మొదట్లో బీజేపీ ఎంతో కొంత మెరుగైన స్థితి కనబరిచింది. కానీ లెక్కింపు కొనసాగుతున్నకొద్దీ అది క్రమేపీ క్షీణించింది. ఆఖరికి ముఖ్యమంత్రి రఘువర్ దాస్ సైతం తన నియోజకవర్గంలో ఆదినుంచీ వెనకబడివున్నారంటే జనాగ్రహం ఎలా వుందో అర్థం చేసుకోవచ్చు. ఇది నూరు శాతం బీజేపీ స్వయంకృతమనే చెప్పాలి. రఘువర్ దాస్ ఓడింది చెప్పుకోదగ్గ నాయకుడిపై కాదు. నిన్న మొన్నటివరకూ తమ పార్టీలో, తన అనుచరుడిగావున్న వ్యక్తి చేతుల్లోనే ఆయనకు ఓటమి తప్పలేదు. వాస్తవానికి జార్ఖండ్‌లో కాంగ్రెస్‌కి చెప్పుకోదగ్గ బలమంటూ లేదు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల మాదిరే ఇక్కడ కూడా ఆ పార్టీ నిస్తేజంగా ఉంది. రాహుల్‌గాంధీ అయిదు ప్రచారసభల్లో, ఆయన సోదరి ప్రియాంక ఒక సభలో మాత్రమే మాట్లాడారు. ఇందుకు భిన్నంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెరో తొమ్మిది సభల్లో ప్రసంగించారు. బీజేపీకి చెందిన ఇతర నేతలు సరేసరి. అటు కాంగ్రెస్‌కు పార్టీ శ్రేణుల్ని సమరానికి సమాయత్తం చేయగల సత్తాగానీ, ప్రజల్ని ఒప్పించగల నేర్పరితనంగానీ ఉన్న నాయకుడు లేరు. మహారాష్ట్ర మాదిరి గెలుపు గుర్రంతో చెలిమి చేయడం ఆ పార్టీకి కలిసొచ్చిన ఏకైక ఎత్తుగడ. జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) బీజేపీకి గట్టి సవాలు ఇవ్వగల పార్టీయే అయినా ఆ పార్టీ నాయకుడు హేమంత్ సోరెన్ శరద్ పవార్ స్థాయి నాయకుడు కాదు. ఆయనలా కాంగ్రెస్ నాయకత్వ లేమిని పూడ్చగలిగినవాడు కాదు. రాష్ట్రానికి మూడు దఫాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన జేఎంఎం అధినేత శిబూ సోరెన్‌పై జనంలోవున్న అనుకూలత హేమంత్‌కు కలిసొచ్చింది. అయితే తమ పార్టీకి మొదట్నించీ పునాదిగావున్న ఆదివాసీలనూ, కుర్మీలనూ కూడగట్టుకోవడంలోనే ఆయన అధిక సమయాన్ని వెచ్చించాల్సివచ్చింది. ఎందుకంటే బీజేపీతో కలిసి పోటీ చేస్తున్న నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ)కి కూడా కుర్మీలలో చెప్పుకోదగ్గ పలుకుబడివుంది. జార్ఖండ్ జనాభాలో ఆదివాసీ, కుర్మీలు దాదాపు సగభాగం ఉంటారు.

మొదటినుంచీ అంచనాలకు భిన్నమైన ఫలితాలు అందించడం జార్ఖండ్ ప్రత్యేకత. అక్కడ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చాలాసార్లు తప్పని రుజువయ్యాయి. మొన్న లోక్‌సభ ఎన్నికల్లో అక్కడున్న 14 స్థానాల్లో బీజేపీ మెజారిటీ స్థానాలు జారవిడుచుకోక తప్పదని ఎన్నికల ముందు సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్ తెలిపాయి. కానీ బీజేపీ మాత్రం అంతకుముందు మాదిరే 12 స్థానాలు సాధించగా, ఆ పార్టీ మిత్రపక్షం ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ పార్టీ(ఏజేఎస్‌యూపీ) ఒక స్థానాన్ని గెల్చుకుంది. బీజేపీ ఓటుబ్యాంకు 40 శాతం యథాతథంగావుంది. కానీ ఆర్నెల్లు గడిచేసరికల్లా ఆ ఓటు బ్యాంకు గల్లంతయింది. సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు తొలిసారి వాస్తవానికి దగ్గరగా వచ్చాయి. 81మంది సభ్యులుగల ఆ రాష్ట్ర అసెంబ్లీలో 2014 ఎన్నికల్లో బీజేపీకి 37 రాగా, ఆ పార్టీ మిత్ర పక్షం ఏజేఎస్‌యూపీకి 5 లభించాయి. మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీ నేతృత్వంలోని జార్ఖండ్ వికాస్ మోర్చా(జేవీఎం) 8 స్థానాలు సాధించినా అందులో ఆరుగురు 2015లో బీజేపీ శిబిరంలో చేరారు. అప్పట్లో జేఎంఎంకు 19, కాంగ్రెస్‌కు 6 వచ్చాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన కనీస మెజారిటీ 41 కనుక బీజేపీ సుస్థిర ప్రభుత్వాన్ని ఇవ్వగలిగింది. ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమిస్తూ 1973లో ఆవిర్భవించిన జేఎంఎం పోరాటం ఫలితంగా 2000 సంవత్సరంలో జార్ఖండ్ ఏర్పడింది. గత ఎన్నికల్లో బీజేపీతో చెలిమి చేసి 8 చోట్ల పోటీచేసి అయిదుచోట్ల గెలుపొందిన ఏజేఎస్‌యూ, ఈసారి తమకు 17 నుంచి 19 కేటాయించాలని డిమాండ్‌చేసింది. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల ఫలితాలు రావడం, ఆ రెండుచోట్లా బీజేపీకి ఆదరణ గతంతో పోలిస్తే క్షీణించడం చూశాక ఏజేఎస్‌యూ తన డిమాండ్‌పై మరింత పట్టుబట్టడం మొదలెట్టింది. చివరికది దూరం కావడంతో బీజేపీ ఒంటరిగా బరిలో దిగింది. 24 జిల్లాలున్న జార్ఖండ్‌లో 19చోట్ల మావోయిస్టుల ప్రాబల్యంవుంది. కనుకనే నవంబర్ 30 నుంచి డిసెంబర్ 20 వరకూ అయిదు దశల్లో పోలింగ్ నిర్వహించారు.

ఆదివాసీ జనాభా అధికంగావున్న జార్ఖండ్‌లో 2014లో తొలిసారి ఆదివాసీయేతరుడైన రఘువర్ దాస్‌ను ముఖ్యమంత్రిగా చేయడం బీజేపీ సాహసమే. ఇది చాలదన్నట్టు కౌలు చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణల్ని, భూసేకరణ విధానాల్ని ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకించారు. తమ భూములపై తమకుండే హక్కును ఇవి దెబ్బతీస్తాయని వారు ఆందోళనపడ్డారు. బ్రిటిష్‌వారిపై పోరాడి ప్రాణాలర్పించిన ముండా తెగ ఆదివాసీల స్మృతికి నివాళులర్పించేందుకు లోక్‌సభ ఎన్నికల సమయంలో రఘుబర్‌దాస్ కుంతి ప్రాంతానికెళ్లినప్పుడు ఆదివాసీలు ఆయనపై చెప్పులు విసిరి నిరసన ప్రకటించారు. అయినా అప్పట్లో బీజేపీ అభ్యర్థే గెలిచారు. బీజేపీ విధానాలు తీవ్రంగా దెబ్బతీస్తాయని ప్రచారం చేయడంలో విపక్షాలు ఈసారి విజయం సాధించాయి. తాము అధికారంలోకొస్తే ఆదివాసీల భూములకు రక్షణ కల్పిస్తామని వాగ్దానం చేశాయి. అలాగే సీఏఏ, ఎన్నార్సీలు జార్ఖండ్ ముస్లింలపై కూడా ప్రభావం చూపాయి. బీజేపీ తన ప్రచారాన్ని ప్రధానంగా అభివృద్ధిపై కేంద్రీకరించింది. సీఏఏ, ఎన్నార్సీలపై విపక్షాలది దుష్ప్రచారమని కొట్టిపారేసింది. ఎన్నికల ఫలితాలు పార్టీలు స్వీయ సమీక్ష చేసుకోవడానికి తోడ్పడతాయి. ముఖ్యంగా మరో రాష్ట్రాన్ని చేజార్చుకున్న పార్టీగా బీజేపీ రాష్ట్రంతోపాటు కేంద్రంలో అనుసరిస్తున్న విధానాల్లోని తప్పొప్పులపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. జనం నాడి తెలిశాక అయినా వాటిని సవరించుకోవాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి బ.త్రయోదశి ప.12.14 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం అనూరాధ సా.5.30 వరకు, తదుపరి జ్యేష్ఠ వర్జ్యం రా.11.00 నుంచి 12.35 వరకు, దుర్ముహూర్తం ఉ.8.41 నుంచి 9.25 వరకు, తదుపరి రా.10.40 నుంచి 11.32 వరకు అమృతఘడియలు... ఉ.7.24 నుంచి 9.01 వరకు.

**సూర్యోదయం :** 6.30
**సూర్యాస్తమయం:** 5.27
**రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు

# మైనారిటీలు మారారు.. గుర్తించారా?

**కల్లోలం పుట్టుకొచ్చిన ప్రతిసారీ దేశం తగులబడుతూనే ఉంది. ఢిల్లీలోని ధార్యాగంజ్‌లో కారు తగులబడుతోంది. ఉత్తరప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో హింసాత్మక శక్తులను చూస్తున్నాం. పశ్చిమబెంగాల్‌లో ఒక నిప్పురవ్వ దావానలమై మంటలు రేపుతోంది. కానీ వీటిలో ఏ ఒక్కటీ ఢిల్లీలో లాగా భారతీయ ముస్లింలలో కలుగుతున్న గణనీయ మార్పును ప్రతిబింబించలేకపోయాయి. ఢిల్లీలో ఒక నూతన భారతీయ ముస్లింలు పెరుగుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ముస్లింను చూసి ఇక భయపడనవసరం లేదు. వారి జాతీయతను ప్రశంసించడానికి ఇక సిగ్గుపడాల్సిన అవసరం లేదు. రాజ్యాంగాన్ని, జాతీయ పతాకను, జాతీయ గీతాన్ని ఎత్తిపడుతూ.. అంబేడ్కర్, గాంధీలను గౌరవిస్తూ, హిందుస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ పోరాటం చేయడానికి ప్రయత్నిస్తున్న నూతన తరహా ముస్లింలు వీరు.**


శేఖర్ గుప్తా

ఢిల్లీలోని జామా మసీదులో గుమికూడిన ముస్లింలు తాము మొదట భారతీయులం అని ప్రకటించడం ద్వారా, మెజారిటీ వర్గంలో ఉన్నందున మన రిపబ్లిక్ పునాదిని మార్చివేయగలమని అనుకుంటున్న వారి భావనను పూర్తిగా తోసిపుచ్చేశారు. అదేసమయంలో భారత రిపబ్లిక్ తన సెలబ్రిటీ రచయిత–కార్యకర్త అయిన అరుంధతీరాయ్‌కు ఎంతగానో రుణపడి ఉంది. ఆమె ఒంటిచేత్తోనే భారతదేశాన్ని మావోయిస్టు సాయుధ తిరుగుబాటుదారుల నుంచి కాపాడారు. మన మావోయిస్టులు 'తుపాకులు ధరించిన గాంధేయవాదులు' ('గాంధియన్స్ విత్ గన్స్') అని వర్ణించడం ద్వారా ఆమె ఈ ఘనత సాధించారు. ఆమె చేసింది సర్వకాలాల్లోనూ అతి గొప్పగా కోట్ చేయదగిన ఉల్లేఖన. అణిచివేతకు గురవుతున్నవారిగా మావోయిస్టుల మీద అంతవరకు ఉన్న కాస్తంత సానుభూతిని కూడా రాయ్ వ్యాఖ్య సమాధి చేసేసింది. ఏకకాలంలో మీరు గాంధేయవాదిగా, మావోయిస్టుగా ఉండలేరు.

బహదూర్ షా జాఫర్ మార్గ్ వద్ద కూర్చుని నేను ఈ వ్యాసం రాస్తూ, జామా మసీదుకు చెందిన 17వ శతాబ్ది నాటి మెట్లమీదుగా వేలాది ముస్లింలు నడుచుకుంటూ పోయిన ఘటనను ఆమె ఎలా వర్ణించి ఉంటారు అని నేను ఆశ్చర్యపోయాను. వీళ్లు ముస్లింలు. ముస్లింలలాగా దుస్తులు ధరించినవారు. ప్రజలు ధరించే దుస్తులు వారి ఉద్దేశాలను తెలుపుతాయని ప్రధానమంత్రి ఇప్పుడే సూచించినందున దీన్ని మనం నొక్కి చెబుతున్నాం. ఈ ముస్లింలు మువ్వన్నెల జెండా, రాజ్యాంగం, బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్తరువులను ధరించి వచ్చారు. కొంతమంది గాంధీ బొమ్మలను పట్టుకున్నారు. వీటితోపాటు జనగణమన, హిందూస్తాన్ జిందాబాద్‌లను వల్లిస్తూ పోయారు. భారత రిపబ్లిక్‌కి చెందిన అతి పెద్ద మైనారిటీ (ప్రతి ఏడు మంది భారతీయులలో ఒకరు) తమ పవిత్ర మసీదు మెట్లు దిగుతూ తాము ముందుగా భారతీయులమని, భారత రాజ్యాంగంపై, జెండాపై, జాతీయ గీతంపై తమకు విశ్వాసముందని, జనాభా పరమైన మెజారిటీ కారణంగా రిపబ్లిక్ పునాదినే మార్చివేయవచ్చనే భావనను వ్యతిరేకిస్తున్నామని ప్రకటిస్తే ఏం జరుగుతుంది?

భారతీయ దేశభక్తికి తామే వారసులమంటూ దేశంలోని మెజారిటీ జనాభా ఇన్నాళ్లుగా చేస్తూ వచ్చిన ప్రకటనను ముస్లింలు తొలిసారిగా ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. దేశంలో నివసించడానికే ఇక్కడున్నాం అంటూ వారు నినదించారు. వీళ్లతో ఇక ఎవరూ పోరాడలేరు. ఎలాంటి సమర్థనా లేకుండా వీరిపై ఎవరూ ఇక తుపాకులు గురిపెట్టి కాల్చలేరు. మన దేశం మారింది. లేక 'మన దేశం ఇప్పుడు మారిపోతోంది మిత్రులారా' అనే వాక్యాలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. అలాగే పౌరసత్వ సవరణ చట్టానికి, జాతీయ పౌర పట్టికకు మధ్య పౌరులకు శరణార్థులకు మధ్య ఉన్న సూక్ష్మభేదాన్ని వివరించడం ద్వారా మీరు వారికి ఇక నచ్చచెప్పలేరు. ఇప్పటికే 2021లో పశ్చిమ బెంగాల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మీరు ఇప్పటికే చాలా ఎక్కువగా మాట్లాడేశారు. రెండు లక్ష్యాలను సాధించడానికి మీరు ఇప్పటికే ప్రయత్నాలు చేసి ఉన్నారు. ఒకటి, జాతీయ పౌర పట్టికలో దొరికిపోయే బెంగాలీ హిందువులను పునస్సమీక్షించి కాపాడటం, అదే సమయంలో బెంగాలీ ముస్లింలను బహిష్కరించడం. రెండు, రాష్ట్రంలోనూ దీన్నే పునరావృతం చేస్తామని హామీ ఇచ్చి పశ్చిమబెంగాల్ లోని బెంగాలీ హిందువులను ఆకట్టుకోవడం. అస్సాంలో మంటలు రేకెత్తించడానికి, పశ్చిమబెంగాల్లో మంటలు చల్లార్చడానికి చేసిన ప్రయత్నంలో మీరు ఇప్పుడు ఢిల్లీలో మంటలు రేపారు.

**జాతిహితం**



టోపీలు, బుర్ఖాలు, హిజబ్, ఆకుపచ్చ రంగు అనేవి ముస్లింలను గుర్తు చేసే అత్యంత స్పష్టమైన మూస గుర్తులు. అలాగే వారి మతపరమైన ప్రార్థనలు కూడా. ఒక స్నేహితుడికి పోలీసు లాఠీలకు మధ్యలో దూరి అతగాడిని కాపాడి దేశవ్యాప్తంగా నెటిజన్ల దృష్టి నాకర్షించిన ఇద్దరు యువతుల ఫోటోను ఫేస్ బుక్‌లో చూసినప్పుడు, ఆ యువతులు జాతీయవాదం లేక లౌకికవాదం పట్ల ఎలాంటి నిబద్ధత లేని, సంప్రదాయ ఇస్లాం మతంతో మాత్రమే ప్రభావితమయ్యారని చెప్పవచ్చు. ఇకపోతే ఏకే 47లు, ఆర్డీఎక్స్‌లు ధరించిన ముజాహిదీన్, లష్కర్, అల్ ఖాయిదా, ఐసిస్ వంటి సంస్థలకు ప్రాతినిధ్యం వహించిన అనేకమంది ఆగ్రహోదగ్రులైన ముస్లింలకు చెందిన బలమైన సంకేతాలను కూడా మనం చూడవచ్చు. ఈ తరహా ముస్లింలతో సులభంగా పోరాడి ఓడించవచ్చు. కానీ భారతీయ ముస్లింలు నిజంగా నిరాశా నిస్పృహలకు గురై ఉగ్రవాదాన్ని చేపట్టి ఉంటే ఏమయ్యేది? సిమీ నుంచి ఇండియన్ ముజాహిదీన్‌ల వరకు అతి చిన్న ఉగ్ర బృందాలు దీన్ని నిర్ధారించాయి కూడా. అత్యంత ఉదారవాదిగా పేరొందిన నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సైతం 2009 ఎన్నికల్లో భాగంగా ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టులతో నిండిన సభలో మాట్లాడుతూ, ఇదేవిషయాన్ని నొక్కి చెప్పారు. ముస్లింలకు ప్రత్యేక రాయితీలు, సౌకర్యాలు కల్పిస్తున్నారని ఆరోపించే వారెవరైనా సరే, భారతీయ ముస్లింలలో ఒక శాతం (ఇప్పుడు వారి సంఖ్య 20 కోట్లు) మందైనా భారత్‌లో తమకు ఇక భవిష్యత్తు లేదని నిర్ణయించుకుని ఉంటే దేశాన్ని పాలించడం ఎవరికైనా కష్టమయ్యేదని సింగ్ ఆ సభలో చెప్పారు. యూపీఏ ప్రభుత్వం ఏలిన దశాబ్దంలో ఇదీ పరిస్థితి. భారతీయ ముస్లింలు అపమార్గం పట్టకుండా దేశం వారిపట్ల ఔదార్యాన్ని ప్రదర్శించింది. కొంతమంది యువ ముస్లింలు ఉగ్రవాద బాట పట్టారు. కానీ నేడు ఎన్డీఏ ప్రభుత్వం లాగే నాడు యూపీఏ ప్రభుత్వం కూడా వారిపట్ల కఠినంగానే వ్యవహరించింది. ఈ వాస్తవాలపై అనేక భాష్యాలు ఉండవచ్చు. కానీ అంతిమ నిర్ధారణ మాత్రం ఒకటే. ఒక పక్షం మాత్రం ముస్లింలకు క్షమాపణ చెబుతూనే వారు జాతి వ్యతిరేకులుగా మారకుండా వారికి ఎంతో కొంత సహాయం చేయాలని కోరుకునేది. మరో పక్షం మాత్రం ఇప్పుడు కంటికి కన్ను సమాధానం అంటూ రెచ్చిపోతోంది. అలాగే మెజారిటీ వర్గం ఉగ్రవాద వ్యతిరేక చర్యలు తీవ్రతరం చేయాలని కోరుకుంటోంది. అటు రాజకీయపక్షం ఇటు మెజారిటీ వర్గం ఇద్దరూ ముస్లింలను అనుమాన దృష్టితో చూడటంపై ఏకాభిప్రాయంతో ఉన్నారు. ఇక భారతీయ ముస్లింల గురించిన ప్రతికూల దృక్పథం ఏదంటే వారి మతాధిపతులే. జామా మసీదు బుఖారీలు, మదానీలు, కమాండో కామిక్ చానల్స్‌లో కనబడుతూ ఫత్వాలు జారీ చేస్తూ బవిరిగడ్డాలతో కనిపించే ముస్లిం మతగురువులను మెజారిటీ వర్గ ప్రజలు ప్రతికూల భావంతో చూస్తున్నారు.

ముస్లింల పట్ల ఈ ప్రతికూల భావనలలో చాలావాటిని నేడు సవాలు చేస్తున్నారు. జనగణమన, జాతీయ జెండా, అంబేడ్కర్, గాంధీ బొమ్మలు, హిందూస్తాన్ జిందాబాద్ నినాదాలు.. ఇలా ముస్లింలను పట్టిచ్చే సంప్రదాయ సంకేతాలు మారుతున్నాయి కానీ దుస్తులు మాత్రమే మారలేదు. నాగరికతల మధ్య ఘర్షణ సూత్రం వెలుగులో భారతీయ ముస్లింలను అంచనా వేసేవారు ఘోరతప్పిదం చేస్తున్నట్లే లెక్క. 1947లో భారత్‌లోని మెజారిటీ ముస్లింలు జిన్నాతోపాటు నడిచి తమ కొత్త దేశం పాక్ వెళ్లిపోయారు. కానీ జిన్నా తర్వాత గత 72 ఏళ్లలో వారు తమ దేశాధినేతగా ముస్లింను ఎన్నటికీ విశ్వసించలేదు. వారు ఎల్లవేళలా ముస్లిమేతర నేతనే విశ్వసిస్తూ వచ్చారు. దీనర్థమేమిటి?

కల్లోలం పుట్టుకొచ్చిన ప్రతిసారీ దేశం తగులబడుతూనే ఉంది. ఉత్తరప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో హింసాత్మక శక్తులను చూస్తున్నాం. పశ్చిమబెంగాల్‌లో ఒక నిప్పురవ్వ దావానలమై మంటలు రేపుతోంది. కానీ వీటిలో ఏ ఒక్కటీ ఢిల్లీలో సంకేతాలు వెలువరించినట్లుగా భారతీయ ముస్లిం లలో గణనీయ మార్పును ప్రతిబింబించలేకపోయాయి. ఢిల్లీలో ఒక నూతన భారతీయ ముస్లిం పెరుగుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ముస్లింను చూసి ఇక భయపడనవసరం లేదు. వారి జాతీయతను ప్రశంసించడానికి ఇక సిగ్గుపడాల్సిన అవసరం లేదు. రాజ్యాంగాన్ని, జాతీయ పతాకను, జాతీయ గీతాన్ని ఎత్తిపడుతూ.. అంబేడ్కర్, గాంధీలను గౌరవిస్తూ, హిందూస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ పోరాటం చేయడానికి ప్రయత్నిస్తున్న నూతన తరహా ముస్లింలు వీరు. ఇప్పుడు మనం సుప్రసిద్ధ ఉర్దూ కవి రహత్ ఇందోరి రాసిన అమర వాక్యాలను ఈ భయానకమైన కాలంలో తరచుగా ఉల్లేఖిస్తున్నాం. ఆ కవితా పాదాల అర్థం ఏమిటి? ''ఈ నేలపై ప్రతి ఒక్కరూ తమవంతు రక్తం ధారపోశారు. భారత్‌పై ఓ ఒక్కరూ తమ ప్రత్యేక హక్కును ప్రకటించలేరు''. జాతిలో కలుగుతున్న ఈ మార్పును చూసి రహత్ ఇందూరి తప్పకుండా చిరునవ్వులు చిందిస్తుంటారు మరి.

వ్యాసకర్త ద ప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

---

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



**సోషల్ మీడియా**

### సంకేతాలు



"జార్ఖండ్ నుంచి స్పష్టమైన సంకేతాలు అందుతున్నాయి. తమ భూమినీ, సంస్కృతినీ పరిరక్షించేవారికి గిరిజనులు ఓటు వేశారు. తమ అస్తిత్వాన్ని గుర్తించే వారికి ముస్లింలు ఓటు వేశారు. మత మార్పిడుల పేరిట వేధింపులు నిలిపివేయాలని క్రైస్తవులు ఓటు వేశారు. ఆహార భద్రత కోసం పేదలు, మతప్రాతిపదికన వివక్షను పాటించడాన్ని వ్యతిరేకిస్తూ ఇతరులు ఓటు వేశారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు, ద్వేషాన్ని కాదు. ఈ అంశాన్ని అధికారం కోసం అర్రులు చాచేవారు గుర్తించాలి"

– చేతన్ చౌహాన్, జర్నలిస్ట్

### ఆపండి



"దేశాన్ని కశ్మీర్‌లా మార్చే ప్రయత్నాన్ని విరమించుకోండి అది నిర్దయకు చిహ్నం"

– మిర్జా వాహెద్, రచయిత

### నింద



"ఆయన చేసినవాటికి ప్రధాని మోదీని మనలో ప్రతి ఒక్కరం ద్వేషించడమో, ప్రేమించడమో చేస్తాం. కానీ, నిరాసక్తంగా ఉండిపోయాడని నిందించలేం" – యశ్వంత్ దేశ్‌ముఖ్, జర్నలిస్ట్

### ఛానెల్స్



"డియర్ న్యూస్ ఛానెల్స్ మీలో చాలామంది పతనమయ్యారు. నాకు తెలుసు, వ్యాపారం సంగతీ తెలుసు. పెద్ద సంఖ్యలో ప్రజలు మిమ్మల్ని చూడటం మానేశారు. మీరు విశ్వసనీయత కోల్పోయారు. అటువంటి సందర్భాల్లో ఎవరైనా తప్పులు సరిదిద్దుకుంటారు. కానీ, మీరు మరింత విభిన్నంగా చేస్తున్నారు"

– అనుభవ్ సిన్హా, దర్శకుడు

### విఫలం



"సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు నాయకత్వం వహించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం కావడం అసంతృప్తిగా ఉంది. ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోవాలని ఒత్తిడి తేవడానికి వేలాదిమంది వీధుల్లోకి వస్తే ఆ పార్టీ నాయకులు ఇంకా బయటకు రాలేదు. రాజకీయనేతలెవరూ లేకుండానే దేశం నిటారుగా నిలబడుతోంది"

– మాలినీ పార్థసారథి, మాజీ సంపాదకురాలు

### వాళ్లేరి?



"దేశ విభజన జరిగినప్పుడు కాబూల్‌లో 50వేలమంది సిక్కులు ఉండాలి. ఇప్పుడు 2వేలమంది ఉన్నారు. మిగిలిన వారంతా ఎక్కడికి పోయినట్టు? వీళ్లందరినీ ఎవరు కాపాడాలి? కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి అంశంపైనా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిరసనలు తెలుపుతున్నారు. అటువంటివారికి దేశంకంటే రాజకీయాలే ఎక్కువ. అది తప్పు"

– జేపీ నడ్డా, బీజేపీ నేత

### నాకు తెలియాలి



"నన్ను ఎందుకు నిర్బంధించారో నేను తెలుసుకోవచ్చా? సెక్షన్ 144 ప్రకారం నలుగురు లేదా అంతకంటే ఎక్కువమంది గుమిగూడకూడదు. ఇక్కడ నేనొక్కత్తినే ఉన్నా. నిరసనతో నాకెటువంటి సంబంధం లేదు"

– పల్లవి రెబ్బాప్రగడ, రచయిత్రి

---

**ఇన్‌బాక్స్**

## వినియోగదారుల్లో చైతన్యం రావాలి

పుట్టింది మొదలు పోయే వరకు ప్రతి వ్యక్తి వినియోగదారుడే! డబ్బు వెచ్చించి కొనుక్కునే వస్తువులు, పొందే సేవలు ఏవైనా వినియోగదారుల చట్ట పరిధిలోకే వస్తాయి. మన దేశ వినియోగదారుల్లో చాలామంది నిరక్షరాస్యులు, అమాయకులు, పేద వాళ్లు కావడంతో తెలిసో తెలియకో వారు నిత్యం తూనికలు, కొలతలు, సేవలు పొందడంలో మోసపోతునే ఉన్నారు. వ్యాపారుల్లో లాభాపేక్ష, వల్ల తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాల్సిన పరిస్థితి వినియోగదారులకు ఏర్పడింది. రాజ్యాంగం దేశ పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించినట్లే వినియోగదారుల చట్టం ద్వారా వినియోగదారులకు ఎనిమిది హక్కులు కల్పించబడ్డాయి. అయితే అవి ఉన్నట్టు కూడా 60 శాతం సగటు వినియోగదారులకి తెలియని దౌర్భాగ్య పరిస్థితి. భద్రత హక్కు, సమాచారం పొందే హక్కు, వస్తువును ఎంపిక చేసుకునే హక్కు, విజ్ఞప్తి చేసుకునే హక్కు, పరిహారాన్ని కోరే హక్కు, వినియోగదారుల విద్య పొందే హక్కు, ప్రాథమిక అవసరాలు తీర్చుకునే హక్కు, ఆరోగ్యవంతమైన పరిసరాలను కలిగి ఉండే హక్కులు వినియోగదారుల చట్టంలో పొందుపరచబడ్డాయి. సరసమైన ధరలకు సరైన పరిమాణంలో నాణ్యమైన సేవలు పొందడం వినియోగదారుల ప్రథమ హక్కు. చట్టాలు రూపొందించారు. హక్కులైతే కల్పించారు గాని వాటిని నడిపించే నాథుడే కరువౌతున్నాడు. ఈ క్రమంలో ఆధునిక వినియోగ ప్రపంచంలో సగటు వినియోగదారుడు అనేక విధాలుగా మోసాలకు, ప్రలోభాలకు గురవుతున్నాడు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం మనదేశంలో ఎన్ని చట్టాలు చేస్తున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. ఫలితాలు రాకపోవడానికి యంత్రాంగానిది ఎంత బాధ్యత ఉందో, వినియోగదారుడిది కూడా అంతే బాధ్యత ఉంది. సరైనచోట, సరైన వస్తువును ఎంచుకునే జ్ఞానం, నైపుణ్యం ప్రతి వినియోగదారునికి అవసరం.

(నేడు వినియోగదారుల దినోత్సవం)

– నంబూరు రంగారావు, వినియోగదారుల ఉద్యమ కార్యకర్త

# అత్యాచారాల నిరోధానికి 'దిశా' నిర్దేశం

**సందర్భం**


అచ్యుతరావు

యావత్ భారతదేశాన్ని నిర్భయ ఘటన తర్వాత మళ్లీ ఉలిక్కిపడేలా చేసిన ఘటన తెలంగాణలో చోటు చేసుకున్న దిశ ఘటన. అమ్మాయిని పథకం ప్రకారం కదలనివ్వకుండా చేసి సామూహిక అత్యాచారం, ఆపై తగలబెట్టి హత్య చేసిన ఘటన ప్రజలందరికీ గల్లీ నుండి ఢిల్లీ దాకా వణుకు పుట్టించింది. అలాగే బాధితురాలికి న్యాయం చేయాలంటే నిందితులను చంపెయ్యాల్సిందే అని ప్రతి ఒక్కరూ ముక్త కంఠంతో అన్నారు, చివరకు అదే జరిగింది. కానీ నిందితులను చంపడం ద్వారా నేరాలు అరికట్టలేమన్నది విజ్ఞతతో ఆలోచించినప్పుడే తెలుస్తుంది.

చాలామంది అరబ్ దేశాల్లో నేరం చేసిన వాళ్లను అక్కడికక్కడే చంపేస్తారని చెబుతుంటారు కానీ అలా చంపేసినా నేరాలు ఆగడం లేదన్న నిజాన్ని గమనించాలి. అంతేకాకుండా ఆ దేశాలు ఇంకా రాజరికపు ఫ్యూడల్ వ్యవస్థల్లోనే ఉన్నాయి. భారతదేశం అలా కాదు, ప్రజాస్వామ్య పద్ధతిలో నడుస్తున్న ఫెడరల్ యూనిటరీ వ్యవస్థగా కొనసాగుతున్న దేశం అలాంటప్పుడు ఓ ప్రజాస్వామ్య దేశాన్ని రాచరికపు దేశాలతో పోల్చలేము. కానీ విజ్ఞతతో ఆలోచించి నేరాలకు పాల్ప డిన వారిని విచారణ లేకుండా అనాగరికంగా చంపడం సరైన పద్ధతి కాదని గ్రహించి చట్టాలను మార్చాలి.

పౌరులను విద్యావంతులను చేసే దిశగా అడుగులు వేస్తే నేరాలను నిరోధించవచ్చు. సరిగ్గా ఇదే సూత్రాన్ని పాటించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తితో తమ రాష్ట్రానికంటూ ఇలాంటి నేరాలు తగ్గించాలనే స్ఫూర్తితో 'దిశ' చట్టాన్ని



తీసుకువచ్చింది. ఘటన తెలంగాణలో జరిగినా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తమ రాష్ట్రంలో జరగకుండా కట్టడి చేయడానికి దిశ చట్టాన్ని తెచ్చిన జగన్ సర్కారుకు జేజేలు.

గణాంకాల ప్రకారం ఆడపిల్లలపై 2014లో 13,549 నేరాలు జరుగగా, వరుసగా 2015లో 13,088, 2016లో 13,948, 2017లో 14,696 ఘటనలు.. 2018లో 14,048 ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇంకా ఈ నేరాల సంఖ్యను తగ్గించి సమస్యను పరిష్కరించే దిశగా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 173, 309ని సవరించి, నేరం జరిగిన ఏడు రోజుల్లో విచారణ పూర్తి చేయడం పద్నాలుగు రోజుల్లో చార్జిషీట్, సాక్షుల విచారణ చేసి కేవలం మూడు వారాల్లో నిందితులకు శిక్ష ఖరారు చేసే దిశగా చట్ట సవరణ చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో వేధిస్తే రేండేళ్ల శిక్షపడేలా, అత్యాచారాలకు మరణదండన పడేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, వెనువెంటనే శాసనసభ ఆమోదం హర్షించదగ్గది.

ఈ చట్టాన్ని ఇతర రాష్ట్రాలలో సహితం అమలుచేస్తే మంచి ఫలితాలు ఇస్తుందన్న దాంట్లో అనుమానం లేదు. కేవలం శిక్షలు వేస్తామనడమే కాకుండా చిన్ననాటి నుండి ఉపయోగమైన ఇంగ్లిష్ మీడియం విద్యను పేద పిల్లలకు సహితం అందుబాటులోకి తేవడం, ప్రతి నేరం వెనుక మద్యం ఉత్ప్రేరకంగా ఉంటున్నందున దశలవారీ మద్య నిషేధం బాలికలకూ, మహిళలకూ శ్రీరామరక్షగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

వ్యాసకర్త గౌరవ అధ్యక్షుడు, బాలల హక్కుల సంఘం
మొబైల్ : 93910 24242

# తీరని చింత




వర్తమాన రాజకీయాలు ప్రత్యర్థులనే కాదు, సమర్థకులను కూడా లోలోన భయపెడుతున్న సందర్భం. ఎల్లడెలా ఒక భయం నీడ పరుచుకున్న సందర్భంలో నర్మగర్భంగానైనా నోరు విప్పడానికి చాలా ధైర్యం కావాలి. అటువంటి ధైర్యమే చేస్తున్నాడు ప్రముఖ కవి యాకూబ్. ఎటు చూసినా ఆశలు ఏమాత్రం కానరాని వేళ, అక్షరాన్ని నమ్ముకుని తన సామూహిక ఆక్రందనను పంచుకునేవారి కోసం అర్రులు చాస్తున్నాడు. 'మనిషిగా గుర్తించని సమాజం/మతం మారి ముందు మనిషిగా స్థిరపడాలనే తెగింపు/మారిన మతంలోంచి మనిషిగా మొదలయ్యాక/ఆధిపత్యాల రూపం మారింది/ఆధిపత్య సమాజపు ఆంక్షల ముళ్లతాకిడి మాత్రం తప్పలేదు' అని విస్పష్టంగా ఆవేదనల చరిత్రలను ఆవిష్కరిస్తాడు. కానీ, ఇలాంటి ఎందరి కోసమో కొందరు నిలుస్తారు. అలాంటి వారికి దక్కేవి బుల్లెట్లే. అందుకే 'బుల్లెట్/తన అదృష్టానికి ఆనందించిందా?/నిర్భీతి, నిజాయితీ, నిర్మోహమాటం, నిస్సంకోచాలతో నిండిన గుండెల్లో/తనకు చోటు లభించినందుకు' అని ప్రశ్నిస్తాడు. అక్షరం ఇపుడొక వీలునామా అని ప్రకటిస్తాడు. అటువంటి వీలునామాలు రాయగలిగే మనుషుల కోసం కలవరిస్తాడు. 'దేశాల దేహమ్మీద కనపడని రాచపుండు, వణికిస్తున్న చలిలాంటి/విద్వేషం, మనిషి తప్ప అన్నీ ప్రాధాన్యత సంతరించుకున్న వ్యూహాలు/కులాన్ని, మతాన్ని తప్ప ఇంకే కొలమానంతో చూడని కాలం' పోవాలని, మనుషులు ఓట్లుగా, వీసాలుగా మారిపోకూడదని ప్రగాఢంగా కాంక్షిస్తాడు.



యాకూబ్ నోట్లో గోల్డెన్ కాదు గదా, కనీసం ప్లాస్టిక్ స్పూన్ అయినా లేకుండా పుట్టినవాడు. జీవితం గురించీ, జీవన పోరాటం గురించీ అనుభవపూర్వకంగా తెలిసినవాడు. రొట్టమాకు రేవు అనే మారుమూల పల్లెటూరి నుంచి నేతిలోపడని, పడే అవకాశంలేని ఏ రొట్టె ముక్కనో వెతుక్కుంటూ నగరానికి చేరినవాడు. ఇప్పుడు 'జీవితాన్ని ఊరి నుంచి నగరం దాకా/మడులు మడులుగా నాటువేసి పులకపెట్టి/కలుపు తీసి పంట కోసం ఎదురుచూస్తు'న్నాడు. తన పంటను కాపాడుకోవడమే కాదు, పలువురు యువ కవుల పంటను కూడా కాపాడే బాధ్యతను భుజాన వేసుకున్నాడు. దొంగ గొడ్లు తొక్కేయకుండా, కోతుల గుంపు పీకిపాతర వేయకుండా తల్లి కోడిలా అందరినీ తన రెక్కలకింద పొదవుకుంటున్నాడు. 'ఎక్కడో పిడుగు పడుతుంది, కంపించాలి/పక్కనే చెట్టు కూలుతుంది, ఒడుపుగా/తప్పించుకోవాలి'అని జాగ్రత్తలు చెబుతూనే 'వినబడని మాటల్లోంచి గొంతునెలా వినడం/దారుల్లో అడుగులనెలా గుర్తుపట్టడం' అంటున్న అతని తీరని చింతని పంచుకుందాం.

– దేశరాజు

(వెల: రూ.100/–, ప్రతులకు: స్టాల్ నెం.219, హైదరాబాద్ బుక్ ఫెయిర్)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 24-12-2019

## తిరుప్పావై 9వ పాశురం

**తూమణి మాడత్తు చ్చుత్తుం విళక్కిరియ**
**దూపం కమళత్తుయిల్ అణైమేల్ కణ్ వళరుం**
**మామన్ మగళే ! మణి క్కదవం తాళ్ తిఱవాయ్**
**మామీర్ ! అవళై ఏఱుప్పీరో ఉన్ మగళ్ తాన్**
**ఊమైయో అన్ఱి చ్చెవిడో ఆనందలో**
**ఏమ ప్పెరుందుయిల్ మందిర ప్పట్టాళో**
**మామయన్ మాదవన్ వైకుందన్ ఎన్ఱెన్ఱు**
**నామం పలవుం నవిన్ఱే లోర్ ఎమ్బావాయ్**


బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్

ఆండాళ్ తన చెలులతో ఒక మణిమండిత భవనం బయట నిల్చుని లోపల నిద్రిస్తున్న సఖిని మేల్కొల్పుతున్నది. ఆ సఖి కృష్ణభక్తురాలు. 'మెత్తని శయ్య మీద సుఖనిద్రలో మునిగి ఉన్న ఓ మామకూతురా, లేవమ్మా, సౌఖ్యంగా నిదురించటమే ఒక కళగా భావిస్తున్నావా! నీ రతనాల మేడ దీపకాంతులతో మెరిసిపోతున్నది. అగరు సుగంధం అంతటా అలుముకుంది. విలువైన మణిమాణిక్యాలు ఎల్లెడలా మిరుమిట్లు గొల్పుతున్నాయి. కాస్త మెలకువ తెచ్చుకుని నీ శయనమందిరం తలుపు తియ్యవమ్మా, కాస్త నీ గారాలపట్టిని నిదురలేపవమ్మా ఓ అత్తమ్మా. ఎంత పిలిచినా పలకదు, చెవుడేమైనా వచ్చిందా లేక నోటమాట రావటం లేదా అదీ కాక అలసి సొమ్మసిల్లిందా? లేక కుంభకర్ణుడేమైనా ఆవహించాడా? మంత్రముగ్ధురాలై దీర్ఘనిద్రపోతున్నదా, చెప్పు. ఎందుకు మా పిలుపులకు స్పందించటం లేదు ? ఈ మొండినిద్రకు ఒక్కటే మందు– మేము చేస్తున్న హరి నామ సంకీర్తన ఆమెకు వినబడాలి. మాధవా, వైకుంఠనాథా అని ఎలుగెత్తి మేము భగవానుని పిలిచే పిలుపులు ఆమె చెవినబడాలి.'

భౌతికమైన ప్రాపంచిక సుఖాలు ఆత్మను నిద్రమత్తులో ముంచి స్వస్వరూపజ్ఞానం నుండి దూరంగా ఉంచుతాయి. ఎంతో సుఖప్రదమైన పరిసరాలలో నిద్రపోతున్న 'మామకూతురి'ని చనువుగా మేల్కొల్పుతున్నది ఆండాళ్. ఆమె స్పందించకపోయినా విడువక అక్కడే నిలబడి ఆమెను వెంటతీసుకుపోవాలని కోరుకుంటున్నది. విష్ణు సహస్రనామ స్మరణ అన్ని అరిష్టాలను నివారించి శుభాలను కలుగజేస్తుందని ప్రతీతి. నామస్మరణ వల్ల అజ్ఞానం మత్తులో మూసుకుపోయిన హృదయకవాటాలు (మణిమందిరం తలుపులు) తెరుచుకుని ఆత్మ (నిద్రిస్తున్న గోపిక) మేలుకుంటుంది.

– శ్రీదేవి మురళీధర్

## ముగ్గు-ముచ్చట




బొడ్డు ఝాన్సీ,
చౌటుప్పల్,
యాదాద్రి భువనగిరి జిల్లా

18 చుక్కలు
18 వరుసలు


కట్టమూరి సుభాషిణి
బ్రాడీపేట,
గుంటూరు

19 చుక్కల నుంచి
11 చుక్కల వరకు
(మధ్య సరిచుక్క)





**ముగ్గులు పంపవలసిన చిరునామా:**
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్–34. muggulu.sakshi@gmail.com

# షెర్లాక్‌హోమ్స్



**ఢిల్లీ**

**ఒక రోజు సాయంకాలం.**

ఇండియా గేట్ దగ్గరి గార్డెన్‌లో బెంచ్ మీద కూర్చొని ఏదో సీరియస్‌గా డిస్కస్ చేసుకుంటోంది ఓ యువ జంట. కాసేటికి సన్నగా పొడుగ్గా... నూనుగు మీసాలు, తల మీద క్యాప్, ఒక చేతి వేళ్ల మధ్య వేడి వేడి వేరుశనక్కాయల పొట్లాలు, ఇంకో చేతిలో చాయ్ ఫ్లాస్క్‌తో 'చాయ్.. మూంగ్‌ఫలీ.. ఆ చాయ్.. ఎ మూంగ్‌ఫల్లే..' అంటూ ఆ జంట ముందుకు వచ్చింది ఆ ఆకారం.

పట్టించుకోనంత తీవ్రమైన చర్చలో ఉన్నారు ఆ ఇద్దరూ. కాసేపు ఆ బెంచి వెనకాలే తచ్చాడి మళ్లీ 'ఆ చాయ్ భాయ్.. చాయ్.. దీదీ.. మూంగ్‌ఫలీ..' అంటూ వాళ్ల ముందు మళ్లీ ప్రత్యక్షమైంది ఆ చాయ్‌వాలా ఆకారం.

'అరే.. వద్దు భాయ్.. మమ్మల్ని కాస్త ప్రశాంతంగా ఉండనీ..' అంటూ చిరాకు పడ్డాడు జంటలోని అతను.

'క్యా పరేషానీ హై భాయ్ ఆప్‌కో.. ' అడిగింది ఆ ఆకారం కాస్త వంగి అతని ముఖంలోకి ముఖం పెడుతూ.

'ఛల్ హట్..' అని కోపగించుకుంటూ విసురుగా బెంచీ మీద నుంచి లేచి... ఆ అమ్మాయి చెయ్యి అందుకొని అక్కడి నుంచి విసావిసా వెళ్లిపోయాడు అతను ఆ అమ్మాయితో.

వాళ్లు వెళ్తున్నవైపు చూస్తూ చిన్నగా నవ్వుకొని బెంచి మీద ఫ్లాస్క్‌ను పెట్టి, పైజామా జేబులోంచి ఫోన్ తీసి ఎవరికో ఫోన్ చేసి... 'ఆప్ సహీ హై మామ్'అని చెప్పి పెట్టేసింది ఆ ఆకారం.

**ఆ చాయ్‌వాలా.. సారీ.. చాయ్‌వాలీ.. ఓ ప్రైవేట్ డిటెక్టివ్. పేరు ఆకృతి ఖత్రి. వయసు ముప్పైఐదు లోపే. అందుకే దేశంలోనే అతిపిన్న వయస్కురాలైన మహిళా డిటెక్టివ్ అనే పేరు తెచ్చుకుంది. అయిదేళ్ల కిందట ఢిల్లీలో 'వీనస్ డిటెక్టివ్ ఏజెన్సీ'ని ప్రారంభించింది. అపరాధ పరిశోధనలో అగ్రగణ్యుడు షెర్లాక్‌హోమ్స్ బాటను ఎంచుకున్న ఈ ఇండియన్ షెర్లాక్‌హోమ్స్ దేశరాజధానిలోనే పుట్టిపెరిగింది. బీఎస్సీ (సైన్స్) గ్రాడ్యుయేట్, ఢిల్లీ యూనివర్శిటీ నుంచి ఎంబీఏ పోస్ట్‌గ్రాడ్యుయేట్ అయిన ఆకృతి ఈ ఫీల్డ్‌లోకి రావడం చాలా ఆసక్తికరం.**

**ఎలాగంటే...**

ఎంబీఏలో ఉన్నప్పుడు పేపర్లో డిటెక్టివ్ ఉద్యోగ ప్రకటన చూసి సరదాగా దరఖాస్తు చేసింది ఆకృతి. సీరియస్‌గానే ఇంటర్వ్యూకి పిలుపొచ్చింది. ఇంటర్వ్యూ అయిపోయాక తర్వాత కాల్ చేస్తామని చెప్పి పంపించేశారు ఆమెను. ఎప్పుడో చూసిన ఒకట్రెండు డిటెక్టివ్ సినిమాలు తప్ప... అసలా వృత్తి ఎలా ఉంటుందో తెలియదు.


ఆకృతి ఖత్రి

అలాంటిది ఇంటర్వ్యూ బాగానే అటెండ్ చేశానని మనసులో తనకు తానే కితాబు ఇచ్చుకున్నంత సేపు పట్టలేదు వాళ్ల జవాబుతో నిరాశపడ్డానికి. ఇక అప్పటినుంచి వరసబెట్టి వార్తా పత్రికల్లో వాంటెడ్ కాలమ్ చూడ్డం మొదలుపెట్టింది. ఇంకొన్ని డిటెక్టివ్ ఏజన్సీలకూ అప్లయ్ చేసుకుంది. రెండో ఇంటర్వ్యూలో 'రేపు వచ్చి కలవండి'అని చెప్పి పంపేశారు. కాళ్లీడ్చుకుంటూ ఇంటికొచ్చిందో లేదో మొదటి ఇంటర్వ్యూ తాలూకు ఏజెన్సీ నుంచి ఫోన్ కాల్... ఉన్నపళంగా ఆఫీస్‌కొచ్చి కలవమని.

అంతే పెంచిన టూ వీలర్ యాక్సలేటర్‌ను ఢిల్లీ ఆ మూలన ఉన్న ఆ ఆఫీస్ దగ్గరే ఆపేసింది. అంత ఉత్సాహం ఆమెలో. 'తను పెళ్లిచేసుకోబోయే వరుడి ప్రవర్తన గురించి ఆరా తీయమని ఓ అమ్మాయి ఒక అసైన్‌మెంట్ ఇచ్చింది. నువ్వు ఎలా ఇన్వెస్టిగేట్ చేస్తావో చెక్ లిస్ట్ రాసివ్వు' అడిగాడు బాస్ ఆమె రావడంతోనే. అయిదు నిమిషాల్లో రాసిచ్చింది. మొహంలో మెరిసిన చిరునవ్వును ఆమెకు కనిపించనివ్వకుండా 'ఓకే... ఈ రోజు నుంచి నీ ఇంటర్న్‌షిప్ మొదలు' అని చెప్పి తన క్యాబిన్‌లోకి వెళ్లిపోయాడు బాస్. పిడికిలి బిగించి 'యెస్' అంది ఆమె సంతోషం.

**మొదట్లో ఖాళీగానే...**

అయితే నెల రోజులు ఖాళీగానే కూర్చోబెట్టారు. విసుగుపుట్టిన ఆమె ఒకరోజు కోపంగా బాస్ క్యాబిన్‌లోకి వెళ్లి.. 'ఏ పనీ లేకుండా ఇలా రికామీగా కూర్చోనే ఉద్యోగం నేను చేయలేను. ఇంత ఖాళీగా మా ఇంట్లో కూర్చున్నా దోమలనైనా చంపుకునేదాన్ని' అంది. 'నువ్వు ఖాళీగా ఏం లేవు. పరీక్షలో ఉన్నావ్. నీ సహనాన్ని టెస్ట్ చేస్తున్నాం' చెప్పాడు బాస్ కూల్‌గా. ఆకృతి ఇంకోమాట మాట్లాడకుండానే వెంటనే అసైన్‌మెంట్ ఇచ్చాడు బాస్. జుట్టును క్యాప్‌లో దాచి.. మాసిపోయిన పైజామా.. వెలిసిపోయిన టీషర్ట్ వేసుకొని.. నూనుగు మీసాలు అతికించుకొని ఇండియా గేట్ దగ్గర చాయ్‌వాలా వేషం వేసి ఓ జంట డీప్ డిస్కషన్‌ను డిస్టర్బ్ చేసిందే... అదే తన తొలి అసైన్‌మెంట్. అప్పగించిన రెండు రోజుల్లోనే వరుడు మోసగాడు అని తేల్చి వివరాల కవరును అమ్మాయి చేతిలో పెట్టేసింది.

**వీనస్ డిటెక్టివ్ ఏజెన్సీ**

మొదటి కేస్‌లోనే విజయం సాధించిన ఆకృతి... ఒకవైపు ఏంబీఏ చేస్తూనే ఇంకో వైపు ఈ ఉద్యోగంలో బిజీ అయిపోయింది. చదువు అయిపోయేనాటికి ఇన్వెస్టిగేషన్ ఫీల్డ్‌లో ఓ మోస్తరు పేరూ సంపాదించుకుంది. కేవలం పెళ్లి సంబంధాలు, వివాహ బంధాల అంశాల్లోనే కాక కార్పొరేట్ ఇష్యూస్ అయిన బ్రాండ్ కాపీరైట్స్, ట్రేడ్ మార్క్స్ నుంచి హనీ ట్రాప్, లేబర్ కోర్ట్‌కేసులు, మోసం, భూ తగాదాలు వంటి విషయాల్లో కూడా పరిశోధన చేసి విజయవంతం అయింది. ఈ క్రమంలోనే తన బాస్‌తో కొంచెం మాటపట్టింపు వచ్చి ఆ ఏజెన్సీ నుంచి బయటకు వచ్చేసింది. 2014లో వీనస్ డిటెక్టివ్ ఏజెన్సీ పేరుతో సొంతంగా ఏజెన్సీని స్థాపించింది. మొదట్లో తన టాస్క్‌ను ఢిల్లీ వరకే పరిమితం చేసుకున్నా తర్వాతర్వాత ముంబై, పుణె, చండీగఢ్, జైపూర్‌లతోపాటు హైదరాబాద్‌లోనూ తన పరిశోధనా సేవలను అందిస్తోంది... కొందరు ఫ్రీలాన్సర్స్‌ను నియమించి. తన ఏజెన్సీలో 75 మంది వరకు ఉద్యోగులున్నారు. వీళ్లలో మహిళలే ఎక్కువ.

**ఇదీ ఓ పనేనా?**

'మన దగ్గర లేడీ డిటెక్టివ్‌లు ఎక్కువగా లేరు. మామూలుగానే స్కూళ్లకు, కాలేజ్‌లకు, ఆఫీస్‌లకు వెళ్లిన అమ్మాయిలు సురక్షితంగా ఇళ్లకు తిరిగొచ్చే పరిస్థితి లేదు. అలాంటిది చాలా రిస్క్, ఎంతో ప్రమాదంతో కూడిన ఇలాంటి ఫీల్డ్‌లోకి అమ్మాయిలను పంపేందుకు ఏ తల్లిదండ్రులు ఇష్టపడ్తారు? అయినా నాలాంటి వాళ్లు ఉత్సాహపడ్తూనే ఉంటారు జీవితంలో ఏదో సాహసం చేయాలని (నవ్వుతూ). అలాంటి వాళ్లకు ఒకటే సలహా... ముందు మీ చదువు పూర్తి చేసుకోండి. తర్వాతే ఈ ఫీల్డ్‌లోకి రండి. దీనికి కావల్సిన అర్హత... సూక్ష్మాన్ని గ్రహించడం, ఆత్మవిశ్వాసం. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండడం. ఇదీ ఒక పనేనా అని వెక్కిరించేవాళ్లూ ఉంటారు. నవ్వుతూ మన పని మనం చేసుకుపోవడమే' అంటుంది ఆకృతి ఖత్రి.

## స్ఫూర్తి

# విశ్వాసమే గెలిపించింది

**వివాహం స్త్రీని ఏమీ సాధించనివ్వదని ఒక అపోహ.**
**వివాహం జరిగి, పిల్లలు పుట్టి, 40 ఏళ్లు వచ్చేశాక స్త్రీలు ఎంతకూ సాధించే అవకాశం లేదనేది తిరుగులేని అపోహ.**
**కాని- ఈ అపోహలన్నీ తప్పు అని నిరూపించారు దివ్యా బొల్లారెడ్డి.**
**42 ఏళ్ల వయసులో ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో వింటిని వొదిలిన బాణంలా దూసుకువెళ్లి ఆమె స్వర్ణపతకాన్ని సాధించారు.**
**అంతేకాదు ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఎంట్రీ పొందారు.**
**దైవం మీద తనకున్న విశ్వాసమే ఈ గెలుపును ఇచ్చిందని,**
**ఈ గెలుపు దైవానిదేనని ఆమె వినమ్రంతో సాక్ష్యం చెబుతున్నారు.**

ఈ నెల మొదటివారంలో మలేసియాలోని కుచింగ్‌లో 'ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్' జరిగాయి. 35 ఏళ్లు పైబడినవారు ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులు. ఆసియా ఖండంలోని 29 దేశాల నుంచి 2,500 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. అంతపోటీని ఎదుర్కొని కూడా 40 ఏళ్ల విభాగంలో మన దేశానికి 800 మీటర్ల పరుగుపోటీలో బంగారు పతకం, 400 మీటర్ల పరుగుపోటీలో రజతపతకం సాధించారు నలభై రెండేళ్ల దివ్యారెడ్డి. ఆమె కేవలం అథ్లెట్ మాత్రమే కాదు. మీడియా రంగంలో ఉన్నతోద్యోగి కూడా. తెలుగు ప్రాంతాల స్త్రీలనే కాదు, దేశంలో ఉన్న స్త్రీలకు కూడా స్ఫూర్తినిచ్చే ఆసక్తికరమైన కథను ఆమె సాక్షితో పంచుకున్నారు.

**ఆటలు తెలియవు**

మాది రాయలసీమే అయినా హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాను. ఇక్కడ బిఎస్సీ చేసి అమెరికాలో కంప్యూటర్స్‌లో ఎం.ఎస్ చేశాను. చదువులో చురుగ్గా ఉన్నాను కాని ఆటలు పెద్దగా ఇంట్రస్ట్ ఉండేది కాదు. మా కుటుంబాలలో మగవారు కొందరు ఫిట్‌నెస్ మీద శ్రద్ధ పెట్టి కృషి చేయడం తెలుసు. స్త్రీలకు ఆ విషయంపై ప్రత్యేక శ్రద్ధ ఉండేది కాదు. అందరూ ఆడుకునే చిన్న చిన్న ఆటలు ఆడుకోవడం, నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఒలింపిక్స్ పోటీలను టీవీలో చూడటం తప్ప నేను ఈ రంగానికి వస్తానని ఎప్పుడూ అనుకోలేదు. వివాహం జరిగి, పిల్లలు పుట్టాక అనుకోకుండా ఈ రంగంలో అడుగుపెట్టాను.

**బాబు పుట్టాక...**

నాకు ఒక పాప. ఒక బాబు. బాబు పుట్టాక సంవత్సరం తర్వాత ఫిట్‌నెస్ మీద శ్రద్ధ పెట్టాలనిపించింది. ఇంట్లోనే ట్రెడ్‌మిల్ మీద రన్నింగ్ చేయడం మొదలెట్టాను. నేను సన్నగా ఉండటం, ట్రెడ్‌మిల్ మీద ఉత్సాహంగా పరిగెత్తడం చూసిన ఒక స్నేహితురాలు 'బాగా పరిగెడుతున్నావ్... రోడ్‌రేస్‌లో పాల్గొనచ్చు కదా' అని సలహా చెప్పింది. 2013లో అనుకుంటాను సిటీలో 'బిట్స్ పిలాని యానివర్సరీ 10కె రన్' జరిగింది. అందులో పాల్గొనమని అందరూ ప్రోత్సహించారు. నాకు అంతవరకూ ఆ దృష్టి లేదు. సరే.. స్నేహితులతో సరదాగా ఉంటుందని పాల్గొన్నాను. 10కె రన్ అంటే సామర్థ్యాన్ని కొనసాగించే శక్తి ఉండాలి. ఆ దేవుడి కృప వల్ల అది నాకున్నట్టుంది. పోటీలో మూడో స్థానంలో వచ్చాను. అందరూ మెచ్చుకున్నారు. ఇక మీదట పరుగు మీద దృష్టి పెట్టాలని సూచించారు. అలా పరుగు మీద ఆసక్తి కలిగింది.



'ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్'లో పతకాలు సాధించిన తర్వాత భారత జాతీయ పతాకంతో దివ్యా బొల్లారెడ్డి

**పిల్లల స్ఫూర్తితో**

మా పిల్లలు స్విమ్మర్లు. పాపకు 15, బాబుకి 12 సంవత్సరాలు. ప్రాక్టీసు కోసం రోజూ వెంటబెట్టుకుని వెళ్తుంటాను. నేను రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తుంటే బాబు ఆశ్రయ్ సైకిలింగ్ చేస్తూ నాకు తోడుగా ఉంటాడు.

పిల్లలిద్దరూ రెండు మూడు గంటలు ప్రాక్టీస్ చేస్తారు. ఈతే కాదు, ఏ క్రీడ అయినా శరీరాన్ని గొప్ప క్రమశిక్షణతో ఉంచుతుందని ఆ ప్రాక్టీస్ చూస్తే నాకు అనిపించేది. గృహిణిగా, ఉద్యోగిగా నాకు ఎన్ని బాధ్యతలు ఉన్నా నేను పరుగు మీద దృష్టి పెట్టడానికి ఈ స్ఫూర్తి ఒక కారణం. ట్రెడ్‌మిల్ మీద 10 కిలోమీటర్ల దూరాన్ని గంటా మూడు నిమిషాల్లో పూర్తి చేయడం నాకు నేనే ప్రాక్టీసు చేశాను. దానిని ఒక్కో నిమిషం తగ్గించుకుంటూ ఇప్పుడు 49 నిమిషాలలో పూర్తయ్యేలా సాధన చేశాను.


కోచ్ రాజశేఖర్ కాలివెంకటతో దివ్య

**హాఫ్ మారథాన్, ఫుల్ మారథాన్...**

సరదాగా మొదలైన నా పరుగు ఇప్పుడు హాఫ్ మారథాన్ (21 కి.మీ)కు చేరింది. హైదరాబాద్‌లో జరిగిన ఎయిర్‌టెల్ హాఫ్‌మారథాన్‌లో పాల్గొని అన్ని కిలోమీటర్లు పరిగెత్తగలనని నిరూపించాను. ఆ తర్వాత 2016లో ముంబైలో జరిగిన 'టాటా ముంబై మారథాన్'లో ఫుల్ మారథాన్ (42 కి.మీ) పరిగెత్తాను. అయితే ఏ సాధనకైనా ట్రైనర్ అవసరమని అర్థమయ్యాక రాజశేఖర్ కాలివెంకట దగ్గర ట్రైనింగ్ తీసుకోవడం మొదలుపెట్టాను. యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ విభాగానికి డైరెక్టర్ అయిన మా కోచ్ నేను స్ప్రింట్‌లో (తక్కువ దూరపు పరుగు) పాల్గొంటే బాగుంటుందని సూచించారు. అంతేకాదు... స్పోర్ట్ సైన్స్, న్యూట్రిషన్‌లో పీహెచ్‌డీ చేసి ఉండడంతో నా డైట్‌లో కూడా మార్పులు చెప్పారు. ఇక స్ప్రింట్‌లో అంటే పూర్తిస్థాయి అథ్లెటిక్‌గా మారాలి. గాయాల ప్రమాదం ఉంటుంది. చాలా శారీరక శ్రమ చేయాలి. డైట్ పాటించాలి. చాలా మంది వద్దు అని వారించారు. కాని నేను అవన్నీ చేశాను. జూలై 2019లో గోవాలో జరిగిన 'నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో' 800 మీటర్ల పరుగులో, 400 మీటర్ల పరుగులో కూడా గోల్డ్ సాధించే సరికి ఆసియా అథ్లెటిక్స్‌కు క్వాలిఫై అయ్యాను.

**ఆసియా గోల్డ్**

మలేసియాలో జరిగిన 800 మీటర్ల పరుగును నేను మర్చిపోలేను. నాతోపాటు ఫీల్డ్‌లో 13 మంది ఉన్నారు. కాని దైవాన్ని తలుచుకుని, దేశాన్ని తలుచుకుని ఒక్కసారిగా పరుగు తీశాను. లక్ష్యం పూర్తి చేసేసరికి కరతాళధ్వనులు మిన్నంటాయి. ఇండియాకు గోల్డ్ అని ప్రకటించారు. చాలా ఉద్వేగం కలిగింది. 400 మీటర్ల పరుగులో రజతం సాధించడం కూడా చాలా సంతోషం కలిగించింది. ఇప్పుడు నా దృష్టి అంతా వచ్చే సంవత్సరం టొరెంటో (కెనడా)లో జరిగే 'వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్'పైనే. దైవం తోడుగా అక్కడ కూడా విజయం సాధిస్తానని ఆశిస్తాను.

– సాక్షి ఫీచర్స్ డెస్క్


'ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్'లో సాధించిన బంగారు, రజత పతకాలతో దివ్యా బొల్లారెడ్డి

### దైవం ఇచ్చిన విజయం

నేను ఇలా ఈ స్థాయికి వచ్చానంటే అదంతా దేవుడు నాయందు చూపిన కరుణ వల్లే అని అనుకుంటాను. తాత ముత్తాతల నుంచి దైవ విశ్వాసులుగా ఉన్న మా కుటుంబం ఆశీస్సులు ముఖ్యంగా మా అమ్మ ప్రార్థనలు నాకు మానసికంగా, శారీరకంగా ఎంతో బలాన్నిచ్చాయి. గృహిణిగా, ఉద్యోగిగా ఉన్న నేను అథ్లెట్‌గా మారడం కేవలం ఆ దేవుడి గొప్పతనం వల్లే అనిపిస్తుంది. నా కోసం ఆయన రచించిన ప్రణాళిక వల్లే నేను అథ్లెట్ కాగలిగాను. ఆయన గొప్పతనం చాటడానికే నాకు విజయం చేకూరింది అని కూడా నా విశ్వాసం. పిల్లలతో, ఉద్యోగంతో అలిసిన ప్రతిసారి నాకు బైబిల్ ఒక ఉత్సాహాన్ని ఇచ్చేది. నేను ఇక నా వల్ల కాదు, వెనక్కు మరలుదాం అనుకున్నప్పుడల్లా 'డెయిలీ బ్రెడ్' నాకు ఎంతో ప్రేరణనిచ్చేది. అన్నిటినీ మించి క్రిస్టమస్ వేడుకలు జరిగే డిసెంబర్ మాసంలో నేను ఆసియా పోటీలలో విజయం సాధించడాన్ని కూడా నేను దైవ విజయంగానే భావిస్తాను.

– దివ్యారెడ్డి



# నాన్నకు తెలియకుండా సినిమా చేశా

''రంగస్థలం' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశా. ఆ సమయంలోనే నేను నటుడిగా రాణించ గలనని, నాతో సినిమా చేయొచ్చనే నమ్మకం నిర్మాతలు నవీన్, రవిశంకర్‌గార్లకు కలిగింది. 'మత్తు వదలరా' సినిమా అంగీకరించాక మూడు నెలలు నటనలో శిక్షణ తీసుకున్నా'' అన్నారు శ్రీసింహా. సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు శ్రీసింహా హీరోగా పరిచయమవుతోన్న చిత్రం 'మత్తు వదలరా'. రితేష్ దర్శకుడిగా పరిచయ మవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల వుతోంది.. ఈ సందర్భంగా శ్రీసింహా చెప్పిన విశేషాలు.


శ్రీసింహా

- నాన్నపై (కీరవాణి) ఆధారపడకుండా ఏదైనా సాధిస్తే నాకు సంతృప్తిగా ఉంటుంది. అందుకే నాన్నకు తెలియకుండానే సుకుమార్‌గారి దగ్గర 'రంగస్థలం'కి సహాయ దర్శకుడిగా, 'మత్తు వదలరా'తో హీరోగా కెరీర్‌ను మొదలు పెట్టాను. బాలనటుడిగా సినిమాలు చేశాను. అప్పుడే నటన పట్ల నాకున్న ఆసక్తి ఇంట్లో వారికి అర్థమైంది. డిగ్రీ తర్వాత 'రంగస్థలం'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాను. అప్పుడే 'మత్తు వదలరా' సినిమాలో నటించే అవకాశం రావడంతో హీరోగా మారాను.
- 'యమదొంగ'లో చిన్ననాటి ఎన్టీఆర్ పాత్రలో కనిపించాను. చిన్నతనం నుంచి నేను ఎన్టీఆర్ (జూనియర్) అభిమానిని. ఆయన నా సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేయడం మా నమ్మకానికి ప్రోత్సాహాన్నిచ్చింది. 'రంగస్థలం' నుంచి రామ్‌చరణ్‌గారితో పరిచయం ఉంది. రానా గారు మా ట్రైలర్‌ను రిలీజ్ చేయడం హ్యాపీ.
- నటన పరంగా నాన్న, రాజమౌళిగారు ఎలాంటి సలహాలు ఇవ్వలేదు. వారు పని చేసే విధానం నుంచే మేం ఎక్కువగా నేర్చుకున్నాం. హీరోగా చేస్తున్నానని తెలియగానే రాజమౌళిగారు భయపడ్డారు. అయితే నటన వద్దని చెప్పలేదు. కష్టపడి సినిమా చేయమని ప్రోత్సహించారు.
- తొలి సినిమాగా ప్రేమకథ లేదా మాస్ సినిమా ఎంచుకుంటేనో లేదా సినిమాలో ప్రేమ, పాటలు, ఫైట్స్ ఉంటేనో మంచి ఆరంభం అవుతుందనుకోవడం సరికాదు. కథ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారు. నేను హీరోగా, అన్నయ్య సంగీత దర్శకుడిగా ఒకే సినిమాతో పరిచయం అవుతామని ఊహించలేదు.

> ప్రస్తుతానికి దర్శకత్వం ఆలోచన లేదు. హీరోగానే కాదు.. కథ నచ్చితే ప్రాధాన్యం ఉన్న పాత్రలూ చేస్తాను. రాజమౌళిగారి సినిమాలో ఒక్క ఫ్రేములోనైనా కనిపించాలన్నది నా కల. మా అన్నయ్యను సంగీత దర్శకుడిగా, నన్ను హీరోగా పెట్టి రాజమౌళిగారి అబ్బాయి కార్తికేయ ఓ సినిమా ప్లాన్ చేస్తున్నాడు.

- ఈ సినిమాలో నిద్రమత్తులో ఉండే డెలివరీ బాయ్ పాత్ర నాది. చాలీచాలని జీతంతో పని చేసే అతడు ఓ సమస్యలో చిక్కుకుని, ఎలా బయటపడ్డాడన్నది ఆసక్తిని రేకెత్తిస్తుంది. మూడు రోజుల్లో జరిగే కథ ఇది.
- కీరవాణి, రాజమౌళిగార్ల కుటుంబం నుంచి వస్తున్నాను కాబట్టి కొత్తగా కనిపించాలని ఆలోచిస్తే నటనలో సహజత్వం లోపిస్తుంది. అందుకే నిజజీవితంలో ఎలా ఉంటానో అలాగే నటించాను. అలా చేస్తేనే పాత్రకు న్యాయం జరుగుతుందని నా ఫీలింగ్.

# శశి కథేంటి?


ఆది సాయికుమార్

డిసెంబర్ 23 ఆది పుట్టినరోజు. ఈ సందర్భంగా తన తాజా చిత్రం 'శశి' ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు చిత్రబృందం. శ్రీనివాస్ నాయుడు నడికట్ల దర్శకత్వంలో ఆది హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సురభి, రాశీ సింగ్ హీరోయిన్లు. ఆర్.పి.వర్మ, రామాంజనేయులు, చింతలపూడి శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. గుబురు గడ్డంతో కోపంతో అరుస్తున్న పోజులో ఉన్న ఫొటోను ఫస్ట్ లుక్‌గా విడుదల చేశారు. ''లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది వేసవిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఈ సినిమాలో ఆది డిఫరెంట్‌గా కనిపిస్తారు'' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: అమర్‌నాథ్ బొమ్మిరెడ్డి.

# మరో థ్రిల్లర్


అనుష్క

'బాహుబలి' తర్వాత కేవలం లేడీ ఓరియంటెడ్ సినిమాలే చేస్తున్నారు అనుష్క. గత ఏడాది 'భాగమతి'గా థ్రిల్ చేశారామె. ఆమె నటించిన తాజా చిత్రం 'నిశ్శబ్దం' వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. ఇది కూడా థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన సినిమానే. ఇప్పుడు మరో లేడీ ఓరియంటెడ్ సినిమాను (యాక్షన్ థ్రిల్లర్) సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నారు. గౌతమ్ మీనన్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా జనవరిలో ప్రారంభం కానుందని తాజా సమాచారం. మిలటరీ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇది అని భోగట్టా. ఇందులో ఫుల్ యాక్షన్ ఉండబోతోందని టాక్. ఫైట్స్ అన్నీ అనుష్కే స్వయంగా చేయబోతున్నారట. వేల్స్ ఇంటర్నేషనల్ ఈ సినిమాను నిర్మించనుంది. వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమా రిలీజ్ కావచ్చు.

# నన్ను సైకో సత్య అంటారు


సత్యప్రకాశ్

''ఇరవై ఐదేళ్ల క్రితం దర్శకుడిని అవ్వాలని ఇండస్ట్రీకి వచ్చాను. కానీ, దేవుడు నన్ను నట్టుణ్ణి చేశారు. ఇన్నేళ్లకు దర్శకత్వం చేసే అవకాశం వచ్చింది. ఈ సినిమా తర్వాత దర్శకుడిగా వరుస ఆఫర్స్ వస్తాయనుకుంటున్నాను'' అన్నారు నటుడు, దర్శకుడు సత్యప్రకాశ్. ఆయన తనయుడు నటరాజ్ హీరోగా సత్యప్రకాశ్ తెరకెక్కించిన చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. నూరిన్, అంకిత కథానాయికలు. సుఖీభవ మూవీస్ పతాకంపై గురురాజ్ నిర్మించిన ఈ సినిమా జనవరి 1న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సత్యప్రకాశ్ చెప్పిన విశేషాలు.

- డైరెక్టర్ రవిరాజా పినిశెట్టి దగ్గర పని చేద్దాం అని వెళ్తే విలన్ పాత్ర చేయించారు. ఆ తర్వాత మలయాళ దర్శకుడు ప్రియదర్శన్ కూడా నటించమని చెప్పారు. నా ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే. అందుకే విటమిన్ యం (మనీ) బాగా అవసరం కావడంతో నటుడిగా కొనసాగాను. దాదాపు భారతీయ భాషలన్నింట్లో సుమారు 530 సినిమాలు చేశాను.
- నా పేరు సత్యప్రకాశ్ అయినా నేను చేసిన పాత్రల ద్వారా నన్ను 'సైకో సత్య, శాడిస్ట్ సత్య' అని పిలుస్తుంటారు. అచ్చ తెలుగువాణ్ని అయినా నన్ను కన్నడ ప్రాంతానికి చెందినవాడు అనుకుంటుంటారు.
- గురురాజ్, నేనూ ఈ సినిమా తీయాలనుకున్నప్పుడు మా కథకు కొత్త కుర్రాడు కావాల్సి వచ్చింది. అలా మా అబ్బాయిని తీసుకున్నాం. వాడు ఆల్రెడీ కన్నడంలో ఓ సినిమా చేశాడు. మా అబ్బాయి నటరాజ్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఫైట్స్, డ్యాన్స్‌లో రెండేళ్లు శిక్షణ తీసుకున్నాడు. బయట తండ్రీకొడుకులం అయినా సెట్లో డైరెక్టర్, యాక్టర్స్‌లానే ఉంటాం.
- హారర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే లవ్‌స్టోరీ ఇది. మనుషులు దెయ్యాలుగా.. దెయ్యాలు మనుషులుగా మారే కాన్సెప్ట్‌తో తెరకెక్కించాం. ఈ సినిమాలో భయం ఉండదు. నెక్ట్స్ ఏమవుతుంది? అనే సస్పెన్స్ ఉంటుంది. తరువాత ఏం జరగబోతోందని ప్రేక్షకులు ఊహించలేరు. అనుకున్నదాని కంటే సినిమా బాగా వచ్చింది. నిర్మాత గురురాజ్ మంచి సహకారం అందించారు. ఈ సినిమాకు సగం దర్శకుడిలా ఉన్నారు. ఆయన ఓ మంచి పాత్రలో నటించారు.
- ప్రస్తుతం నా దగ్గర 14 కథలు ఉన్నాయి. అందులో 10 థ్రిల్లర్ జానర్‌కి సంబంధించినవే. ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో లేడీ ఓరియంటెడ్ సినిమా ప్లాన్ చేస్తున్నాను.

# అక్షర సందేశం


లోహిత్, జయలక్ష్మి

శివాజీ రాజా, జాకీ, గుండు సుదర్శన్, సీవీఎల్ నరసింహారావు, భావన ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'అక్షరం'. జాకీ తోట దర్శకత్వంలో నటుడు లోహిత్ కుమార్ నిర్మించిన ఈ సినిమా భీమినేని ఫిలిమ్స్ ఎల్.ఎల్.పి పతాకంపై ఈ నెల 26న విడుదలవుతోంది. లోహిత్ కుమార్ మాట్లాడుతూ– ''అందరికీ అన్నీ ఉచితంగా ఇవ్వాలనుకుంటున్న ప్రభుత్వాలు విద్యను మాత్రం అందరికీ ఒకేలా ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాలను, మోయలేని బరువులు పిల్లల మీద రుద్దుతున్న తల్లిదండ్రులను ప్రశ్నించే చిత్రమిది. తల్లిదండ్రుల శ్రమను అర్థం చేసుకోవాలని పిల్లలకి తెలియజెప్పే చిత్రం కూడా. నేడు మనం చదువుకోవడం లేదు.. చదువు కొంటున్నాం. దాని వల్ల సహజమైన జ్ఞానం అనేది నశించింది'' అన్నారు.


అనుపమ పరమేశ్వరన్

# ఖోఖో నేపథ్యంలో...


సిద్ధేశ్వర్

పూల సిద్ధేశ్వర్ రావ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'రథేరా'. జాకెట్ రమేష్ దర్శకత్వం వహించారు. పూల సిద్ధేశ్వర్ రావ్, నరేష్ యాదవ్, వై.ఎస్.కృష్ణమూర్తి నిర్మించిన ఈ సినిమా జనవరిలో విడుదల కానుంది. సిద్ధేశ్వర్ రావ్ మాట్లాడుతూ– ''ఖోఖో నేపథ్యంలో వస్తోన్న చిత్రమిది. క్రీడా నేపథ్యంలో గతంలో వచ్చిన సినిమాలకు భిన్నంగా ఉంటుంది. మా సినిమా టీజర్‌ను విడుదల చేసిన వీవీ వినాయక్ గారికి ధన్యవాదాలు'' అన్నారు. ''రథేరా' సినిమాను చూసిన కొందరు సినీ ప్రముఖులు బాగుందన్నారు. రిలీజ్ తర్వాత ప్రేక్షకుల నుంచి అదే స్పందన వస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు జాకెట్ రాకేష్.

# సీక్వెల్‌లో

నిఖిల్, దర్శకుడు చందు మొండేటి కాంబినేషన్‌లో 2014లో వచ్చిన థ్రిల్లర్ చిత్రం 'కార్తికేయ'. లేటెస్ట్‌గా ఈ సూపర్ హిట్ చిత్రానికి సీక్వెల్ రెడీ కాబోతోంది. మొదటి భాగంలో స్వాతి, నిఖిల్ జంటగా నటించారు. తాజా సీక్వెల్‌లో అనుపమా పమేశ్వరన్ కూడా నటిస్తారని తెలిసింది. 'కార్తికేయ 2' టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మించనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. మొదటి భాగంలో కనిపించిన స్వాతి ఈ సీక్వెల్‌లోనూ కనిపిస్తారట. అనుపమ పాత్ర కొత్త జాయిన్ అవుతుందని తెలిసింది. మొదటి భాగం ఎక్కడ ముగిసిందో, సీక్వెల్ అక్కడి నుంచి ప్రారంభం కానుంది. గతంలో చందు మొండేటి 'ప్రేమమ్'లో అనుపమ ఓ హీరోయిన్‌గా నటించారు.










epaper.sakshi.com

సాక్షి
సాగుబడి
నల్లగొండ
మంగళవారం 24-12-2019



మనిషి(హ్యూమన్), వినయం(హ్యుమిలిటీ), జీవద్రవ్యం (హ్యూమస్).. ఇవన్నీ ఒకే కుదురు నుంచి పుట్టిన మాటలు. మనుషులు నేల తల్లితో సంబంధం కోల్పోతే, మానవులుగా మిగలరు!
– సతీశ్‌కుమార్, ఎడిటర్, రిసర్జెన్స్ అండ్ ఎకాలజీ పత్రిక

మూల కార్తె : డిసెంబర్ 28 వరకు

# ఆదర్శ సేద్యం ఆనం మార్గం

ఏభయ్యేళ్లు గృహిణిగా జీవితాన్ని గడిపిన అన్నే పద్మావతి నడి వయసులో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. 12 ఎకరాల్లో ఒకటికి పది ఉద్యాన పంటలను సునాయాసంగా పండిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ వంటి అరుదైన పంటలు సాగు చేయడంతోపాటు సహకార సంఘం ద్వారా మార్కెటింగ్ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆరోగ్యదాయకంగా తాను పండించిన పండ్లు, కూరగాయలతోపాటు నూజివీడు ప్రాంతంలో ఇతర రైతుల నుంచి కూడా ప్రకృతి వ్యవసాయోత్పత్తులను సేకరించి విజయవాడ తీసుకెళ్లి.. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సహకార సంఘం ద్వారా.. వినియోగదారులకు అందిస్తూ ఆదర్శ మహిళా రైతుగా నిలుస్తున్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా పద్మావతి ఈ నెల 23న హైదరాబాద్‌లో కర్షక సాధికార సంఘటన్ నుంచి 'జీవన సాఫల్య పురస్కారం' అందుకున్న సందర్భంగా ప్రత్యేక కథనం..



● రమణక్కపేటలో పద్మావతి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోట

● డ్రాగన్ ఫ్రూట్ తోటలో మహిళా రైతు పద్మావతి

**జీ**వితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సానుకూల దృక్పథంతో ఎదుర్కొని జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దుకోవడంతోపాటు అమృతాహారాన్ని సమాజానికిందించే ఆదర్శ ప్రకృతి వ్యవసాయదారుగా మారారు అన్నే పద్మావతి. డిగ్రీ చదువుకున్న పద్మావతి భర్త అకాల మరణం తర్వాత మొక్కవోని దీక్షతో పిల్లలు ఇద్దరినీ పెంచి పెద్దచేశారు. వారు స్థిరపడిన తర్వాత రెండేళ్ల క్రితం నడి వయసులో తనకు బొత్తిగా అనుభవం లేని వ్యవసాయంలోకి అడుగుపెట్టారు. ఇజ్రాయిల్ దేశానికి విహారయాత్రకు వెళ్లినప్పుడు అక్కడ డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ తదితర పండ్ల తోటలను ఆమె శ్రద్ధగా గమనించారు. అప్పుడే పండ్లతోటల సాగుపై ఆమెకు ఆసక్తి కలిగింది. ఆవిధంగా ఆమె వ్యవసాయంలోకి వచ్చారు. కృష్ణా జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం రమణక్కపేటలోని తమ 8 ఎకరాల భూమిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో డ్రాగన్ ఫ్రూట్ తోట ఏడాదిగా సాగు చేస్తున్నారు. అంతర పంటలుగా సీతాఫలం, జామ, బొప్పాయి, టమాట, పచ్చిమిర్చి, వంగ తదితర పంటలు సాగు చేస్తున్నారు. తోటపల్లి వద్ద మరో 4 ఎకరాల్లో కాకర, పొట్ల వంటి పందిరి కూరగాయలతోపాటు టమాటా, ఆకుకూరలు, పూలు, బీట్‌రూట్, క్యారట్, దోస తదితర కూరగాయలు సాగు చేస్తున్నారు.

**అనుభవం లేకపోయినా ప్రకృతి సేద్యం..**

ప్రకృతి వ్యవసాయ మూలసూత్రాలను అర్థం చేసుకోగలిగితే వ్యవసాయంలో పూర్వానుభవం లేని వారు, ముఖ్యంగా మహిళలు కూడా సులభంగానే ప్రకృతి వ్యవసాయం చేపట్టవచ్చని పద్మావతి అనుభవపూర్వకంగా చెబుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ శాఖలోని జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది ద్వారా ప్రకృతి వ్యవసాయం కాన్సెప్ట్ గురించి తెలుసుకొని.. రసాయనిక ఎరువులు, పురుగుమందులు లేకుండా కూడా పంటలు పండించవచ్చు అని తెలుసుకొని ఆశ్చర్యపోయానని, ఈ కాన్సెప్ట్ నచ్చటంతో అనుసరిస్తున్నానన్నారు. మెట్ట భూముల్లో పెద్దగా కష్టపడకుండానే సాగు చేయడానికి వీలైన పంట కావడం, అత్యంత ఎక్కువ పోషక విలువలతోపాటు మార్కెట్ డిమాండ్ ఉన్నందు వల్లే డ్రాగన్ ఫ్రూట్ తోట సాగుకు శ్రీకారం చుట్టానంటారామె. పది నెలల క్రితం వియాత్నం నుంచి అమెరికన్ బ్యూటీ (పింక్ కలర్) రకం డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలను ఒక్కొక్క మొక్క రూ.100కు 10 వేల మొక్కలు తెప్పించి 8 ఎకరాల్లో నాటారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కల నడుమ బొప్పాయి మొక్కలు 4 వేలు, సీతాఫలం మొక్కలు 4 వేలు, 10 వేల జామ మొక్కలు, 3 వేల శ్రీగంధం మొక్కలు నాటారు. అలాగే తోట చుట్టూ కొబ్బరి మొక్కలు నాటించారు.

**మొక్కల చుట్టూ సజీవ ఆచ్ఛాదన**

మొక్కలను బీజామృతంతో శుద్ధి చేసి గుంతల్లో ఘనజీవామృతం వేసి నాటామన్నారు. మొక్కల చుట్టూ నవధాన్యాలను చల్లి సజీవ ఆచ్ఛాదన కల్పిస్తున్నామని, కోసిన గడ్డిని, మినప పొట్టును ఆచ్ఛాదనగా వేస్తున్నామని పద్మావతి తెలిపారు. వారానికి ఒకటి, రెండు సార్లు నీటితో పాటు జీవామృతం ఇస్తున్నారు. అప్పుడప్పుడూ పంచగవ్యను నీటితో డ్రిప్ ద్వారా ఇవ్వడంతో పాటు పిచికారీ కూడా చేస్తున్నారు. అవసరం మేరకు సప్త ధాన్యాంకుర, దశపత్ర కషాయాలను పిచికారీ చేస్తున్నామని ఆమె వివరించారు.

**పాతికేళ్లు దిగుల్లేని దిగుబడి**

నాటిన 8 నెలలకే డ్రాగన్ ఫ్రూట్ తొలి కాపు వచ్చింది. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేయడం వల్ల రుచి, తియ్యదనం, నిల్వ సామర్థ్యం బాగా ఉన్నాయన్నారు. వివిధ దేశాల డ్రాగన్ ఫ్రూట్స్ తిన్న వారికి తమ పండ్లు తినిపించి చూశానని, రుచి, తీపి చాలా బాగుందన్నారని తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్క నాటిన ఐదేళ్లకు కనీసం 10 టన్నుల దిగుబడిని ఇస్తుందన్నారు. వ్యవసాయానుభవం లేని తమ పిల్లలు పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేకుండా పాతికేళ్ల పాటు నిశ్చింతగా దిగుబడి ఇచ్చే పంట కావడంతోనే డ్రాగన్ ఫ్రూట్‌ను ప్రధాన పంటగా వేశానని ఆమె తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్‌కు పెద్దగా నీరు అవసరం లేదని, అయితే అధిక వర్షాలను కూడా తట్టుకునే మొండి మొక్కన్నారు. ఎండ 40 సెల్షియస్‌కు మించితే కొంచెం ఇబ్బంది ఉంటుందని, అందుకనే అంతర పంటలుగా సీతాఫలం, శ్రీగంధం, మునగ నాటించామని పద్మావతి వివరించారు.

ఇప్పటికే బొప్పాయి దిగుబడి ఒక పంట వచ్చిందని చెబుతూ, అధిక వర్షాలకు తమ ప్రాంతంలో చాలా బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయని, పంచగవ్య పిచికారీ వల్ల తమ తోట తిప్పుకొని ఇప్పుడు మళ్లీ పూతకు వచ్చిందన్నారు.

**సంఘటితమైతేనే అమ్ముకోగలం**

ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నప్పటికీ ప్రకృతి వ్యవసాయదారులు సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుంటేనే మార్కెటింగ్ సమస్యను అధిగమించగలుగుతారన్నది పద్మావతి విశ్వాసం. అందుకే విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల పరస్పర సహకార సంఘంలో ఆమె సభ్యురాలిగా చేరారు. తన 12 ఎకరాల్లో పండించిన పండ్లు, కూరగాయలతోపాటు తమ పరిసర ప్రాంతాల్లో శ్రద్ధగా, నిబద్ధతగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న చిన్న రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు పండించే నాణ్యమైన ఉత్పత్తులను కూడా సేకరించి, తన సొంతవాహనంలో ప్రతి రోజూ విజయవాడ తీసుకెళ్లి, సహకార సంఘం ద్వారా వినియోగదారులకు నమ్మకంగా విక్రయిస్తుండడం విశేషం.

కూరగాయలను కిలో రూ. 30 రూపాయలకు సంఘానికి తాము ఇస్తున్నామని, మరో పది రూపాయలు వేసుకొని సంఘం వినియోగదారులకు విక్రయిస్తున్నదన్నారు. సంఘం తీసుకోగా మిగిలిన కూరగాయలను తమ పొలాల దగ్గరే కిలో రూ. 40కి అమ్ముతున్నామని పద్మావతి తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలలో సహకార సంఘం ద్వారా ప్రచార కార్యక్రమాలు, సభలు నిర్వహించడం ద్వారా తాము రసాయనాలు వాడకుండా నిబద్ధతతో పండిస్తున్న పంటల గురించి ప్రచారం చేస్తున్నారు. తమ తోటలను సందర్శించి తాము అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను స్వయంగా తెలుసుకొని మరీ ధైర్యంగా కొనుగోలు చేయవలసిందిగా ప్రజలను ఆహ్వానిస్తున్నామన్నారు పద్మావతి. నడి వయసులో వ్యవసాయం చేపట్టడమే కాకుండా ప్రకృతి వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌లో కూడా క్రియాశీల పాత్ర పోషిస్తున్న పద్మావతి అభినందనీయురాలు.

– ఉమ్మా రవీంద్రకుమార్ రెడ్డి,
సాక్షి, నూజివీడు, కృష్ణా జిల్లా



● సేంద్రియ ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌లో ఆం.ప్ర. గవర్నర్ హరిచందన్, మంత్రి కన్నబాబుతో పద్మావతి (ఫైల్)



● పద్మావతి తోటలో పండిన బొప్పాయిలు

### ప్రకృతి సేద్యంతో ఎంతో సంతృప్తి



ప్రకృతి సేద్యం కాన్సెప్ట్ నాకు బాగా నచ్చింది. వ్యవసాయ అనుభవం లేని వారు కూడా మొదలు పెట్టి ఒక సంవత్సరంలో నేర్చుకోవచ్చు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా ఆరోగ్యదాయకమైన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను పండించి మేం తింటున్నాం. సహకార సంఘం ద్వారా అంతే నమ్మకంగా ప్రజలకూ అందిస్తున్నాం. మా తోటలకు వచ్చి చూసి నమ్మకం కలిగితేనే కొనమని సంఘం తరఫున కాలనీలకు వెళ్లి వినియోగదారులను ఆహ్వానిస్తున్నాం. చిన్న రైతులు పండించే ఆరోగ్యదాయకమైన కూరగాయలను కూడా నా వాహనంలో విజయవాడ తీసుకెళ్లి ప్రజలకు అందిస్తున్నందుకు ఎంతో సంతృప్తిగా ఉంది.

– అన్నే పద్మావతి (89778 77477),
రమణక్కపేట, కృష్ణా జిల్లా

## గ్రామీణ యువతకు 'గ్రీన్ స్కిల్స్'పై ఉచిత శిక్షణ

**డి**గ్రీ చదివిన, ఇంటర్ (పాసైన లేదా మధ్యలో మానేసిన) గ్రామీణప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు పర్యావరణ సంబంధమైన ఉపాధి నైపుణ్యాలను అందించేందుకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్విరానమెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఇ.పి.టి.ఆర్.ఐ.) ఉచితంగా రెసిడెన్షియల్ శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ, భూతాపోన్నతి శాఖకు అనుబంధ సంస్థ ఇది. 2 నుంచి 4 వారాల కాల పరిమితి గల ఈ కోర్సుల్లో శిక్షణకు ఎంపికయ్యే అభ్యర్థులకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని సంస్థ ఆవరణలోనే ఉచితంగా భోజనం, వసతి కల్పించి, ఉచిత శిక్షణ ఇస్తామని శాస్త్రవేత్త, సమన్వయకర్త డాక్టర్ ఎం.సునీల ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ ఇవ్వనున్న కోర్సుల వివరాలు..

**వాటర్ బడ్జెటింగ్ అండ్ ఆడిటింగ్ :**
అర్హత – ఏదైనా డిగ్రీ, కోర్సు కాలం– 2020 ఫిబ్రవరి 3 నుంచి 24 వరకు. 2020 జనవరి 18 లోగా దరఖాస్తు పెట్టుకోవాలి.

**పర్యావరణ సేవలు, గ్రీన్ జీడీపీ గణన:**
అర్హత – ఏదైనా డిగ్రీ, కోర్సు కాలం– 2020 ఫిబ్రవరి 10 నుంచి మార్చి 24 వరకు. 2020 జనవరి 25 లోగా దరఖాస్తు పెట్టుకోవాలి.

**సౌర విద్యుత్తు వ్యవస్థల్లో సాంకేతిక నైపుణ్యం:**
ఇంటర్ మధ్యలో మానేసిన వారు లేదా పాసైన వారు అర్హులు. కోర్సు కాలం– 2020 ఫిబ్రవరి 20 నుంచి మార్చి 24 వరకు. 2020 జనవరి 30 లోగా దరఖాస్తు పెట్టుకోవాలి.

**వేస్ట్ మేనేజ్‌మెంట్(అన్నిరకాల వ్యర్థాల నిర్వహణ) :**
అర్హత – సైన్స్ డిగ్రీ. కోర్సు కాలం– 2020 జనవరి 29 నుంచి మార్చి 13 వరకు. 2020 జనవరి 13 లోగా దరఖాస్తు పెట్టుకోవాలి.

**ఇ.టి.పి/ ఎస్.టి.పి. / సి.ఇ.టి.పి. ఆపరేషన్, మెయింట్‌నెన్స్:**
అర్హత – సైన్స్ డిగ్రీ. కోర్సు కాలం– 2020 ఫిబ్రవరి 3 నుంచి మార్చి 17 వరకు. 2020 జనవరి 18 లోగా దరఖాస్తు పెట్టుకోవాలి.

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు. ఈ క్రింది వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు:
<http://www.gsdpenvis.gov.in/Default3.aspx>
**లేదంటే మీ దరఖాస్తును ఈ కింది అడ్రస్‌కు మెయిల్ పంపవచ్చు:**
eptri.gsdp@gmail.com
వివరాలకు.. 040–67567511, 67567553, 67567521 www.eptri.com

● డెయిరీ డైరీ-21

## జీవాల వలస సమయంలో జాగ్రత్తలు



**ప**చ్చిమేత సంవత్సరం పొడవునా దొరకదు. అదీగాక వాతావరణ ప్రతికూల పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులు, నీటిఎద్దడి మొదలగు కారణాల దృష్ట్యా గొర్రెల పోషణ నిమిత్తం దూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. సంవత్సరంలో సుమారు ఆరు నెలలు గొర్రెలు వలసలోనే ఉంటాయి. సాధారణంగా సంక్రాంతి సీజన్‌లోనే వలస ప్రారంభమవుతుంటుంది. ఈ సందర్భంగా జీవాల వలస కాలంలో సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

**జీవాల వలస సమస్యలు**

- కొత్తప్రాంతాలకు వలస వెళ్లిన గొర్రెలను అంటువ్యాధులకు భయపడి అక్కడి గొర్రెల పెంపకం దారులు అనుమతించరు.
- దూరప్రయాణం చేసి వలస రావడం వలన జీవాలు నీరసించిపోయి, రోగనిరోధకశక్తి తగ్గి, ఆవారా వ్యాధి బారిన పడతాయి.
- వలస సమయంలో నీటికోసం అక్కడక్కడా కుంటల్లో నీరు తాగుతాయి. ఆ నీరు ఒకవేళ కలుషితమైనప్పుడు పరాన్నజీవుల బెడద ఎక్కువ అవుతుంది.
- వలస సమయంలో పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోయి,పిల్లలు బలహీనంగా ఉంటాయి.
- వలస వెళుతున్న గొర్రెల్లో చిన్న పిల్లలు, ఆడ గొర్రెలు, పోతులు అన్నీ ఉంటాయి. పోషణ విషయంలో తేడా వస్తుంది. పోషణ సరిగ్గా లేకుంటే పెరుగుదల దెబ్బతింటుంది. గొర్రె పిల్ల మరణాలు ఎక్కువ సంభవిస్తాయి.
- దొంగల భయం, తోడేళ్ల బెడద లాంటివి ఉంటాయి. పెంపకందారులు వారి కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- వలస వెళ్లేముందు తప్పనిసరిగా జీవాలకు నట్టలమందు తాగించాలి. అలాగే పి.పి.ఆర్. లాంటి వ్యాధులకు ముందస్తు టీకా వేయించాలి.
- వలస సమయంలో సంపర్కానికి మంచి జాతి పొట్టేలుని ఉపయోగించాలి. కేవలం ఎదను గుర్తించే జీవంగా వాడుకోవాలి.
- చూడిగొర్రెలను ఎక్కువ దూరం నడిపించరాదు, ఏదైనా వాహనంలో తరలించాలి.
- వలస సమయంలో పోషణ లోపం ఉంటుంది. కాబట్టి, జొన్న / మొక్కజొన్న, వరి తవుడుతో కలిపి రైతు దగ్గర ఉంచి, అవసరం మేరకు మేపాలి.
- వేసవితాపం మొదలు కాక ముందే ఉన్నిని కత్తిరించాలి. శీతాకాలం, వర్షాకాలంలో ఉన్నిని కత్తిరించకూడదు.
- వలస సమయంలో జీవాలకు తప్పనిసరిగా బీమా చేయించాలి.
- జీవాలను ఎక్కువగా నడిపించకుండా ప్రతి 3–4 గంటలకొకసారి విశ్రాంతినివ్వాలి.
- పెరిగిన గిట్టలను ఎప్పటికప్పుడు పదునైన కత్తితో కత్తిరించాలి.
- ముందుండి మందను నడిపించేందుకు ఒక మేకను నాయకుడిగా ఉంచుతారు.
- వలస ఏ ప్రాంతానికి వేళతామో, అక్కడ పశువైద్యసౌకర్యం, మేత వనరుల అందుబాటు సమాచారాన్ని గురించి ముందే తెలుసుకోవాలి.
- ఎక్కువ దూరాలకు వలస పోకూడదు.

– డా. ఎం.వి.ఎ.ఎన్. సూర్యనారాయణ
(99485 90506), ప్రొఫెసర్ – అధిపతి,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఫామ్ కాంప్లెక్స్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, తిరుపతి

# ఇంటిపంటల చుట్టూ ప్రదక్షిణలు!

ఇంటి పంట



● మూసాపేట భవానినగర్‌లోని తమ టెర్రస్‌పై ఇంటిపంటల పనుల్లో నిమగ్నమైన శ్రీనివాస్, లావణ్య

**ఆ**రోగ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం 11 నెలలుగా సేంద్రియ ఇంటిపంటలు పెంచుకుంటూ, వాటి చుట్టూ వాకింగ్ (ప్రదక్షిణలు) చేస్తున్నారు హైదరాబాద్‌లోని మూసాపేట భవాని నగర్‌కు చెందిన అంబటి శ్రీనివాస్, లావణ్య దంపతులు. ఇంటిపైనే గ్రోబాగ్స్, సిల్పాలిన్ బెడ్స్‌లో సేంద్రియ ఇంటిపంటలు పండించుకుంటూ.. రోజూ ఉదయం గంట సేపు వాటి చుట్టూ వాకింగ్ చేస్తున్నారు. ఆకుకూరలు ఇబ్బడి ముబ్బడిగా పండిస్తూ నలుగురున్న తమ కుటుంబం తింటూ ఇరుగు పొరుగు వారికీ పంచిపెడుతున్నారు.

వ్యాపార వ్యవహారాల్లో బిజీగా ఉండే ఆయన 'సాక్షి' దినపత్రికలో ఇంటిపంట కథనాలను చదివి స్ఫూర్తి పొంది, తమ ఖాళీగా ఉన్న టెర్రస్‌పై సేంద్రియ కూరగాయల సాగుకు ఉపక్రమించారు. ఉద్యాన శాఖ సూచనలతో 1200 చదరపు అడుగుల టెర్రస్‌పై రూ. 70 వేల ఖర్చుతో ఇంటిపంటల సాగు ప్రారంభించారు. వంద చిన్న గ్రోబ్యాగ్‌లు, 10 పెద్ద గుండ్రటి సిల్పాలిన్ బెడ్స్‌ను ఏర్పాటు చేసి మట్టి, కొబ్బరిపొట్టు, సేంద్రియ ఎరువు మిశ్రమాన్ని నింపి రకరకాల పంటలు పండిస్తున్నారు. పిట్టగోడ నుంచి 3 అడుగులు వాకింగ్‌కోసమని ఖాళీగా వదిలేసి, మధ్యలో గ్రోబాగ్స్, బెడ్స్‌లో ఇంటిపంటలు సాగు చేస్తున్నారు.

రోజూ ఉదయం ఇంటిపంటల చుట్టూ గంట సేపు వాకింగ్ చేసి, తర్వాత ఇంటిపంటల పనులు చేసుకుంటున్నామని శ్రీనివాస్, లావణ్య లిపారు. ఆ తర్వాత మొక్కలకు నీరు పెట్టడం, కలుపు మొక్కలను, ఎండిన ఆకులను ఏరివేయడం వంటి పనులు చేస్తున్నామన్నారు. ఇంటిపంటల పనులు పూర్తికావడంతోపాటు తమకు తగిన వ్యాయామం కూడా దొరుకుతోందని వారు పేర్కొన్నారు. నిత్యం పచ్చని ఆకుకూరల ను, కూరగాయ మొక్కలను చూస్తూ ఉదయం వాటితో గడపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

పాలకూర, చుక్కకూర, మెంతి, సోయా, గోంగూర, కొతిమీర, కరివేపాకు, పుదీనా, తోటకూరలతో పాటు టమాట, మునగ, బీర, చిక్కుడు, ముల్లంగి, గోకరకాయ(గోరుచిక్కుడు), దోసకాయ, కాకర, క్యారెట్, సొరకాయ, క్యాలిఫ్లవర్, బీట్‌రూట్, క్యాబేజి, పచ్చిమిర్చి వంటి కూరగాయలను సాగు చేస్తున్నారు. జామ, మామిడి, సపోట, బొప్పాయి, నిమ్మ, దానిమ్మ వంటి పండ్లమొక్కలతో పాటు గులాబి, చామంతి, బంతి, మందార, మల్లె వంటి పూలు కూడా శ్రీనివాస్, లావణ్య కిచెన్‌గార్డెన్‌లో ఉన్నాయి. కలబంద, తమలపాకు, రణపాల, వాము వంటి ఔషధ మొక్కలను కూడా పెంచుతుండటం విశేషం.

– గుంటి వెంకటేశ్,
సాక్షి, మూసాపేట, హైదరాబాద్
ఫొటోలు: నోముల రాజేష్‌రెడ్డి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



● క్యాలిఫ్లవర్



● టెర్రస్‌పై గ్రోబాగ్స్‌లో ఇంటిపంటలు



● గ్రోబాగ్‌లో టమాట మొక్క



● పాలకూర

### 'సాక్షి' స్ఫూర్తితోనే ఇంటిపంటల సాగు



'సాక్షి' దినపత్రికలో ప్రచురితమవుతున్న ఇంటి పంట కథనాలను చదివి స్ఫూర్తి పొందాం. ఖాళీగా ఉన్న టెర్రస్‌పైన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు పండించుకొని తినాలని అనుకున్నాం. 11 నెలల క్రితం ఉద్యాన శాఖ నిపుణుడి సహాయంతో ఇంటిపంటల సాగుకు శ్రీకారం చుట్టాం. టెర్రస్ గార్డెనింగ్ ఎంతో ఆనందానిస్తున్నది. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు, ఆకుకూరలు తెచ్చుకొని తిని రోగాలపాలయ్యే బదులు ఇంటిపైనే సేంద్రియంగా పండించుకున్న తాజా ఆకుకూరలు, కూరగాయలు తింటున్నాం. సేంద్రియ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, బెండ, తెల్లవంగ తదితర కూరగాయాలు ఎంతో రుచిగా ఉన్నాయి. ఆకుకూరలను ఇరుగు పొరుగుకు కూడా ఆనందంగా పంచిపెడుతున్నాం.

– అంబటి లావణ్య, శ్రీనివాస్ (94403 87868),
భవానీనగర్, మూసాపేట, హైదరాబాద్



epaper.sakshi.com

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

» జనవరిలో టీచర్ పోస్టుల భర్తీకి ఏపీ సర్కారు కసరత్తు
» ఎస్‌జీటీ, ఎస్‌ఏ విభాగాల్లో భారీ సంఖ్యలో పోస్టులు!
» బీఈడీ, డీఈడీ అభ్యర్థులకు కొత్త సంవత్సరంలో తీపి కబురు

# గురిపెడితే... గురువే!

డీఎస్సీ.. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్‌పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష. దీని కోసం లక్షల మంది బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుంటారు! ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టు కోసం ఎన్నో కలలు కంటుంటారు. ఇలాంటి వారికి.. ఏపీ ప్రభుత్వం కొత్త సంవత్సరంలో తీపి కబురు అందించనుంది. వచ్చే ఏడాది(2020) జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్‌కు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా భారీ సంఖ్యలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) తదితర పోస్టులను భర్తీ చేసే అవకాశముంది. అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రిపరేషన్‌పై దృష్టిపెడితే టీచర్ పోస్టును సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. డీఎస్సీకి అర్హతలు, ఎంపిక ప్రక్రియ, విజయానికి అనుసరించాల్సిన వ్యూహాల గురించి తెలుసుకుందాం...




### వేల ఉద్యోగాలు

వచ్చే ఏడాది జనవరిలో విడుదలయ్యే ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, మ్యూజిక్ టీచర్, క్రాఫ్ట్ టీచర్, ఆర్ట్ అండ్ డ్రాయింగ్ టీచర్, తదితర పోస్టుల భర్తీ జరిగే అవకాశం ఉంది. 12వేల నుంచి 15వేల వరకూ టీచర్ పోస్టుల ఖాళీలు ఉన్నట్లు అంచనా.

### పరీక్ష స్వరూపం!

ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి డీఎస్సీ నియామకాలకు రంగం సిద్ధమవుతోంది. దాంతో అభ్యర్థుల్లో పరీక్ష స్వరూపం ఎలా ఉంటుంది? అనే సందేహం ప్రధానంగా కనిపిస్తోంది. గతేడాది నిర్వహించిన డీఎస్సీని పరిగణనలోకి తీసుకుంటే.. ఎస్‌జీటీ పోస్టులకు టెట్ కమ్ టీఆర్‌టీ పేరుతో పరీక్ష జరిగింది. అదే విధంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులతోపాటు లాంగ్వేజ్ పండిట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, మ్యూజిక్ టీచర్స్, క్రాఫ్ట్ టీచర్స్, ఆర్ట్ అండ్ డ్రాయింగ్ టీచర్స్ పోస్టుల భర్తీకి టీఆర్‌టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) నిర్వహించారు. ఇందులో ఏపీ టెట్‌కు వెయిటేజీ ఇచ్చారు. ఈ పరీక్షలు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారితంగా జరిగాయి. రాబోయే డీఎస్సీ నోటిఫికేషన్‌లో పరీక్షల విధానం పరంగా స్వల్ప మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉందని.. అయితే సబ్జెక్టులు, సిలబస్‌ల పరంగా మార్పులు పెద్దగా ఉండకపోవచ్చని సబ్జెక్ట్ నిపుణులు అంటున్నారు. ఈ విషయంలో అధికార వర్గాల నుంచి మరికొద్ది రోజుల్లో స్పష్టత రానుంది.

### అర్హతలివే

- **ఎస్‌జీటీ:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత తర్వాత రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఎడ్)/డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) (లేదా) కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీతో పాటు బీఈడీ ఉత్తీర్ణత.
- **స్కూల్ అసిస్టెంట్:** ఆయా సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీతోపాటు, బీఈడీ/తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.(ఉదా: స్కూల్ అసిస్టెంట్ సోషల్ అభ్యర్థులు బీఈడీ సోషల్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అలాగే ఎస్‌ఏ-లాంగ్వేజెస్, ఎల్‌పీ, పీఈటీ, ప్రిన్సిపల్, పీజీటీ, టీజీటీ తదితర ఉద్యోగాలకు సదరు పోస్టులను బట్టి అకడమిక్, టీచింగ్ ఎడ్యుకేషన్, అనుభవం ఉండాలి.

### పోస్టులు-పరీక్ష విధానం

- రిక్రూట్‌మెంట్ విధానంపై త్వరలో స్పష్టత వస్తుంది. గత డీఎస్సీ పరీక్షల విధానం.. మార్కులు వెయిటేజీని పరిశీలిస్తే...
- **స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, టీజీటీ:** ఈ కేటగిరీల్లో మొత్తం 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఇందులో ఏపీ టెట్‌కు 20 మార్కులు, టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు 80 మార్కులు కేటాయించారు.
- **స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ ఎడ్యుకేషన్), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్:** వీటికి సంబంధించి మొత్తం 100 మార్కుల(టీఆర్‌టీ-50 మార్కులు, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్-30 మార్కులు, ఏపీ టెట్ వెయిటేజ్-20 మార్కులు)కు పరీక్ష నిర్వహించారు.
- **మ్యూజిక్ టీచర్:** మొత్తం 100 మార్కుల (టీఆర్‌టీ-70 మార్కులు, స్కిల్ టెస్ట్-30 మార్కులు)కు పరీక్ష జరిగింది.
- **ప్రిన్సిపల్, పీజీటీ, క్రాఫ్ట్; ఆర్ట్ అండ్ డ్రాయింగ్ టీచర్:** మొత్తం 100 మార్కుల(టీఆర్‌టీ)కు పరీక్ష నిర్వహించారు.

- **ఎస్‌జీటీ:** మొత్తం 100 మార్కులు
- **ఎస్‌జీటీ-టెట్ కమ్ టీఆర్‌టీ పరీక్ష విధానం:**

మొత్తం వంద మార్కులకు టెట్ కమ్ టీఆర్‌టీ విధానంలో నిర్వహించిన పరీక్షలో ఆయా సబ్జెక్టులు, ప్రశ్నలు, మార్కుల వివరాలు..

| సబ్జెక్టు | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| జీకే అండ్ కరెంట్ అఫైర్స్ | 20 | 10 |
| విద్యా దృక్పథాలు | 10 | 5 |
| విద్యా మనో విజ్ఞానశాస్త్రం | 20 | 10 |
| లాంగ్వేజ్-1(ఆప్షనల్) | | |
| కంటెంట్ | 20 | 10 |
| మెథడాలజీ | 10 | 5 |
| లాంగ్వేజ్-2 (ఇంగ్లిష్) | | |
| కంటెంట్ | 20 | 10 |
| మెథడాలజీ | 10 | 5 |
| మ్యాథమెటిక్స్ | | |
| కంటెంట్ | 20 | 10 |
| మెథడాలజీ | 10 | 5 |
| సైన్స్ | | |
| కంటెంట్ | 20 | 10 |
| మెథడాలజీ | 10 | 5 |
| సోషల్ స్టడీస్ | | |
| కంటెంట్ | 20 | 10 |
| మెథడాలజీ | 10 | 5 |
| **మొత్తం** | 200 | 100 |

» పరీక్ష కాల వ్యవధి మూడు గంటలు.

**స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్ తదితర) టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పరీక్ష విధానం:**

| సబ్జెక్టు | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| జీకే అండ్ కరెంట్ అఫైర్స్ | 20 | 10 |
| విద్యా దృక్పథాలు | 10 | 5 |
| విద్యా మనోవిజ్ఞానశాస్త్ర తరగతి గది అన్వయం | 10 | 5 |
| సంబంధిత సబ్జెక్టు | | |
| కంటెంట్ | 80 | 40 |
| మెథడాలజీ | 40 | 20 |
| **మొత్తం** | 160 | 80 |

- పరీక్ష కాల వ్యవధి రెండున్నర గంటలు.
- సంబంధిత సబ్జెక్ట్ అంటే.. అభ్యర్థులు తాము బీఈడీలో ఉత్తీర్ణత సాధించిన సబ్జెక్ట్ ఆధారంగా ఎంచుకోవాల్సి ఉంటుంది.

## ప్రిపరేషన్ ఇలా

పరీక్ష స్వరూపం ఎలా ఉన్నా.. టెట్ కమ్ టీఆర్‌టీ పేరిట నిర్వహించినా.. లేదా టెట్ లేదా టీఆర్‌టీ వేర్వేరుగా జరిగినా.. డీఎస్సీలో ఆయా కేటగిరీలకు సంబంధించి సబ్జెక్టులు ఒకే విధంగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచే తమ కసరత్తును ప్రారంభించాలి. కేటగిరీల వారీగా, సబ్జెక్టుల వారీగా పటిష్ట ప్రణాళిక రూపొందించుకొని ప్రిపరేషన్ సాగించాలి.

### ఎస్‌జీటీ

- **జీకే, కరెంట్ అఫైర్స్:** ఎస్‌జీటీలో కీలకంగా భావించే జీకే, కరెంట్ అఫైర్స్ విభాగానికి సంబంధించి ముందుగా సిలబస్‌పై పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి. ఆ తర్వాత సబ్జెక్టుల వారీ ప్రణాళికను అనుసరిస్తూ.. అధ్యయనం సాగించాలి. స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్‌పై ప్రత్యేక దృష్టిసారించాలి. భౌగోళిక నామాలు, నదీతీర నగరాలు, దేశాలు-రాజధానులు, ప్రపంచంలో మొట్టమొదట చోటుచేసుకున్న సంఘటనలు, అవార్డులు, సదస్సులు, వార్తల్లో వ్యక్తులు, బడ్జెట్, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, శాస్త్ర సాంకేతిక అంశాలు వంటి వాటి గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి. అదే విధంగా పరీక్షకు ముందు ఏడాది కాలంలో జరిగిన పరిణామాలు, ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు వాటి లక్ష్యాలు, ఫలితాలు తదితర అంశాల గురించి తెలుసుకోవాలి.
- రానున్న డీఎస్సీ కోసం ఏపీ ప్రభుత్వ నవరత్నాల గురించి అధ్యయనం చేయడం ఎంతో ఉపకరిస్తుంది. ఇందుకోసం దినపత్రికలను నిరంతరం అనుసరించడం మేలు.




### విద్యా దృక్పథాలు

దేశంలో విద్యా చరిత్ర,కమిటీలు; వర్తమాన భారతదేశంలో విద్య సంబంధిత అంశాలు; ఉపాధ్యాయ సాధికారత; చట్టాలు-హక్కులు; జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం (ఎన్‌సీఎఫ్-2005); విద్యాహక్కు చట్టం, నూతన విద్యా విధానం తదితర అంశాలపై పట్టు సాధించాలి. ప్రిపరేషన్ సమయంలో డీఎడ్ స్థాయి తెలుగు అకాడమీ పుస్తకాన్ని ఉపయోగించుకోవాలి.

### విద్యా మనోవిజ్ఞానశాస్త్రం

- శిశు వికాసం అభివృద్ధి, వైయక్తిక భేదాలు, అభ్యసనం, మూర్తిమత్వం అంశాలు చాలా ముఖ్యమైనవి. శిశు వికాసం, పెరుగుదల, పరిపక్వత భావన-స్వభావం, వికాస నియమాలు, వికాసంపై ప్రభావం చూపే కారకాలు, వికాస దశలు తదితర అంశాలపై దృష్టి సారించాలి.
- ముఖ్య భావనలకు సంబంధించిన అనువర్తనాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ప్రశ్న ఏ విధంగా వచ్చినా, సరైన సమాధానం గుర్తించేలా కాన్సెప్టులపై పట్టుసాధించాలి. గత ప్రశ్నపత్రాల ఆధారంగా ప్రశ్నల క్లిష్టతపై అవగాహన ఏర్పరచుకోవచ్చు. ప్రిపరేషన్‌కు డీఎడ్ స్థాయి తెలుగు అకాడమీ పుస్తకాన్ని ఉపయోగించుకోవాలి.

### కంటెంట్

- తెలుగు(ఆప్షనల్), ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్‌స్టడీస్ సబ్జెక్టుల కంటెంట్‌లో సన్నద్ధతకు ప్రిపరేషన్ పరంగా పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. తెలుగులో కవులు-కావ్యాలు, అర్థాలు, పర్యాయపదాలు, జాతీయాలతోపాటు భాషాంశాలను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, టైప్స్ ఆఫ్ సెంటెన్సెస్, ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి.
- గణితం(మ్యాథమెటిక్స్)లో అర్థమెటిక్, సంఖ్యా వ్యవస్థ, క్షేత్ర గణితం,రేఖా గణితం, బీజ గణితం, సాంఖ్యక శాస్త్రం అంశాలపై అవగాహన పెంచుకోవాలి. పదో తరగతి స్థాయి మ్యాథమెటిక్స్‌ను అధ్యయనం చేయడం లాభిస్తుంది. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ప్రాక్టీస్ చాలా ముఖ్యమని గుర్తించాలి. ప్రాక్టీస్ ఓరియెంటెడ్ ప్రిపరేషన్‌తో అత్యధిక మార్కుల సాధనకు ఆస్కారం లభిస్తుంది.
- సైన్స్‌లో జీవ ప్రపంచం, మొక్కలు, జంతువులు, ఆహారం, సైన్స్‌లో విభాగాలు, పోషణ, ఆహార పిరమిడ్, మానవ శరీరం, పదార్థాలు, కొలతలు, ప్రమాణాలు, ఆమ్లాలు-క్షారాలు, శక్తి రూపాలు, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర అంశాలపై దృష్టి సారించాలి.
- ధ్వని, విద్యుత్, కాంతి, ఉష్ణం చాప్టర్లలోని ముఖ్య భావనలు, శాస్త్రవేత్తలు, ఆవిష్కరణలపై పట్టుసాధించాలి. అదే విధంగా పర్యావరణానికి సంబంధించి జీవవైవిధ్యం, ఆవరణ వ్యవస్థలు, పర్యావరణ సమస్యలు, భూతాపం తదితర అంశాలు ముఖ్యమైనవి. వీటికి సంబంధించి సమకాలీన సదస్సులు, ప్రభుత్వ విధానాల గురించి అధ్యయనం చేయాలి.
- సోషల్‌స్టడీస్‌లో స్థానిక భౌగోళిక అంశాలు, ఖండాలు, పారిశ్రామిక విప్లవం, మనీ-బ్యాంకింగ్, ప్రభుత్వం; రాజకీయ వ్యవస్థలు, జాతీయ ఉద్యమం, భారత రాజ్యాంగం, పరిపాలన, సాంఘిక సంస్థలు, అసమానతలు, మతం-సమాజం, సంస్కృతి, కమ్యూనికేషన్ తదితర అంశాలపై అవగాహన అవసరం. భౌగోళిక, చారిత్రక, ఆర్థిక, పౌరశాస్త్ర అంశాలను అనుసంధానించుకుంటూ.. అధ్యయనం చేయడం ద్వారా సబ్జెక్టుపై పట్టుసాధించొచ్చు.

### మెథడాలజీ

ఆయా సబ్జెక్టులకు సంబంధించి బోధనా లక్ష్యాలు, బోధనా ప్రణాళిక, బోధనోపకరణాలు, మూల్యాంకనం తదితర అంశాలపై పరిపూర్ణ అవగాహన సాధించాలి. వీటిని కంటెంట్‌లోని అంశాలకు అన్వయించుకుంటూ చదవడం లాభిస్తుంది. ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు అందులోని ముఖ్యాంశాలతో సొంత నోట్స్ రూపొందించుకుంటే.. రివిజన్‌కు ఎంతో సమయం ఆదా అవుతుంది. ప్రిపరేషన్‌కు డీఎడ్ పాఠ్యపుస్తకాలను ప్రామాణికంగా తీసుకోవాలి.

## స్కూల్ అసిస్టెంట్

- ఆయా సబ్జెక్టుల కంటెంట్ ప్రిపరేషన్‌కు సంబంధించి ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు.. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను ఉపయోగించుకోవాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ప్రధానంగా బీజగణితం, సదిశా బీజగణితం, వైశ్లేషిక రేఖాగణితం, కలన గణితం, త్రికోణమితి అంశాలపై పట్టు సాధించడం అవసరం.
- బయాలజీలో జీవ ప్రపంచం, సూక్ష్మజీవుల ప్రపంచం, జీవశాస్త్రం-ఆధునిక పోకడలు, జంతు ప్రపంచం తదితర పాఠ్యాంశాలు ఎంతో ముఖ్యమైనవి.
- సోషల్‌స్టడీస్‌లో భారత స్వాతంత్ర్య ఉద్యమం, ప్రపంచ యుద్ధాలు-అనంతర పరిస్థితులు; రాజ్యాంగం, యూఎన్‌వో, సమకాలీన ప్రపంచ అంశాలు; జాతీయ ఆదాయం, భారత ఆర్థిక వ్యవస్థ లక్షణాలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. వరల్డ్ జాగ్రఫీ, ఇండియన్ జాగ్రఫీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

### ఎస్‌ఏ - మెథడాలజీ



ఆయా సబ్జెక్టులకు సంబంధించి బోధన ఉద్దేశాలు, విద్యా ప్రణాళిక, బోధనోపకరణాలు, మూల్యాంకనం తదితర పాఠ్యాంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. ఇందుకోసం బీఈడీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. గత డీఎస్సీలో గణితంలో బోధనా పద్ధతులు; సోషల్‌స్టడీస్‌లో బోధనోపకరణాలకు అధిక ప్రాధాన్యం లభించగా బయాలజీలో అన్ని అంశాలకు సమాన ప్రాధాన్యమిస్తూ ప్రశ్నలు వచ్చాయి.

### మాక్‌టెస్ట్‌లతో మేలు

కంటెంట్ పరంగా ముందు పాఠ్యపుస్తకాలను ఔపోసన పట్టిన తర్వాతే ఇతర మెటీరియల్‌వైపు దృష్టిసారించాలి. మెథడాలజీలో బోధనా లక్ష్యాలు -స్పష్టీకరణలు; బోధనా పద్ధతులపై పూర్తిస్థాయి అవగాహన అవసరం. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ప్రాక్టీస్ ముఖ్యం. మాక్ టెస్ట్‌లు రాయడం వల్ల ప్రిపరేషన్‌లో లోటుపాట్లను గుర్తించి సరిదిద్దుకునేందుకు వీలుంటుంది. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో, అదే విధంగా ఇతర మార్గాల ద్వారా అందుబాటులో ఉండే 'ఆన్‌లైన్ మాక్‌టెస్ట్‌లు' రాయడం లాభిస్తుంది. ఎస్‌జీటీ ఔత్సాహికులు గతేడాది నిర్వహించిన ఆన్‌లైన్ టెస్ట్ పేపర్లను ప్రాక్టీస్ చేయడం మేలు. దీని ద్వారా ఏఏ అంశాలను ఎలా చదవాలి? ప్రశ్న స్వరూపం? స్థాయి వంటి అంశాలపై అవగాహన ఏర్పరచుకోవచ్చు.

– **జె.సుధాకర్**, డైరెక్టర్,
ప్రతిభ కోచింగ్ సెంటర్,
విజయవాడ.

## ఉద్యోగ సమాచారం

### కేవీఐసీ-108

**ముంబై**లోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 108 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సీనియర్ ఎగ్జిక్యూటివ్-2, ఎగ్జిక్యూటివ్-62, జూనియర్ ఎగ్జిక్యూటివ్-18, అసిస్టెంట్-26.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్/ టెక్నాలజీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, షార్ట్ లిస్టింగ్ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
- **సీబీటీ పరీక్ష తేదీ:** ఫిబ్రవరి, 2020.
- **దరఖాస్తులు ప్రారంభం:**డిసెంబర్ 20, 2019
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 19, 2020.
- **వెబ్‌సైట్:** www.kvic.org.in

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...




తెలుగు

# పదితోనే.. పరిశోధన సంస్థలో..!

**1817 మల్టీటాస్కింగ్ పోస్టుల భర్తీకి డీఆర్‌డీవో నోటిఫికేషన్**

**ప్రారంభంలోనే రూ.18000 మూలవేతనం**

**దరఖాస్తులకు చివరి తేదీ: 23.01.2020**

భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధన కేంద్రాల్లో 1817 మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్)పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. పదోతరగతి విద్యార్హతగా ఈ నియామకాలను చేపట్టనుంది. ఈ పోస్టులకు ఎంపికైతే ప్రారంభంలోనే మూల వేతనం రూ.18000 అందుతుంది. దీనికి డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులు అదనం. ఈ నేపథ్యంలో... డీఆర్‌డీవో ఎంటీఎస్ పోస్టులు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ గురించి సమగ్ర సమాచారం...




- **పోస్టు పేరు:** మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్)

### పోస్టుల వివరాలు

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 1817(ఎస్సీ-163, ఎస్టీ-114, ఓబీసీ-503, ఈడబ్ల్యుఎస్-188, అన్‌రిజర్వ్‌డ్-849).

### వేతనం

ఎంపికైన అభ్యర్థులకు లెవెల్-1 వేతన శ్రేణి రూ.18000-రూ.56900 లభిస్తుంది.

### డీఆర్‌డీవో

భారత ప్రభుత్వ రక్షణశాఖకు చెందిన ప్రముఖ సంస్థ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)..రక్షణ శాఖకు సంబంధించిన పరిశోధన, అభివృద్ధిపై పనిచేస్తుంది. జాతీయ భద్రతకు సంబంధించి వైమానిక అవసరాలు, ఎలక్ట్రానిక్, మానవ వనరుల అభివృద్ధి, మిసైల్స్. యుద్ధనౌకలు వంటి వాటిపై దేశావ్యాప్తంగా ఉన్న లేబొరేటరీల్లో పరిశోధన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. డీఆర్‌డీవోలో ప్రస్తుతం దాదాపు 5వేల మంది సైంటిస్టులు, 25వేల మందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నట్లు అంచనా.

### ఎంటీఎస్‌ల విధులు

డీఆర్‌డీవో భర్తీచేసే మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) పోస్టుల్లో ఎంపికైన అభ్యర్థులు దేశ వ్యాప్తంగా ఉన్న లేబొరేటరీల్లో పనిచేయాల్సి ఉంటుంది. సంబంధిత పరిశోధన కేంద్రాల్లో అవసరాలకు అనుగుణంగా వీరి సేవలను ఉపయోగించుకుంటారు. సైంటిస్టులకు వివిధ రకాల సహాయ సహకారాలు అందించడం, ఫైల్స్‌ను భద్రపరచడం వంటివి చేయాలి.

### అర్హతలు

- ఎంటీఎస్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు పదోతరగతి ఉత్తీర్ణత లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు లేదా ఐటీఐ ఉత్తీర్ణులు అర్హులు.
- **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రిజర్వేషన్లకు అనుగుణంగా వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

### ఎంపిక విధానం

డీఆర్‌డీవో ఎంటీఎస్ పోస్టుల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. టైర్-1 (స్క్రీనింగ్ టెస్ట్), టైర్-2 (ఫైనల్ సెలక్షన్) ద్వారా ఎంపిక చేస్తారు.

### టైర్-1 (స్క్రీనింగ్ టెస్ట్)

ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ-కంప్యూటర్‌బేస్డ్ టెస్ట్). హిందీ, ఇంగ్లిష్ మాధ్యమంలో నిర్వహించే టైర్-1 పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు; జనరల్ అవేర్‌నెస్ 30 ప్రశ్నలు-30 మార్కులు; క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ35 ప్రశ్నలు-35 మార్కులకు జరుగుతుంది. అంటే.. మొత్తం 100 ప్రశ్నలకు-100 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. నెగిటివ్ మార్కులు ఉండవు.

- టైర్-1 పరీక్షల్లో జనరల్ అభ్యర్థులు 40 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీలు 35 శాతం మార్కులు సాధించాలి.
- టైర్-1లో కటాఫ్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను 1:10 నిష్పత్తిలో టైర్-2కి ఎంపిక చేస్తారు.

### టైర్-2 (ఫైనల్ సెలక్షన్)

- ఈ పరీక్షను కూడా సీబీటీ విధానంలోనే నిర్వహిస్తారు. మొత్తం 100 మార్కులకు నిర్వహించే టైర్ 2 పరీక్షలో.. జనరల్ మ్యాథ్స్40 ప్రశ్నలు-40 మార్కులు; జనరల్ సైన్స్40 ప్రశ్నలు-40 మార్కులు; జనరల్ ఇంగ్లీష్ 20 ప్రశ్నలు-20 మార్కులకు ఉంటాయి. మొత్తం 100 ప్రశ్నలు-100 మార్కులకు టైర్-2 పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు.
- టైర్-2 పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులను తుది ఎంపిక చేసి, ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

### ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తు ప్రారంభతేదీ:** డిసెంబర్ 23, 2019
- **దరఖాస్తు ముగింపు తేదీ:** జనవరి 23, 2020
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

## భారత వెయిట్‌లిఫ్టర్ రాఖీ హల్దర్‌కు కాంస్యం

దోహాలో జరిగిన ఖతర్ కప్ అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు మూడో పతకం లభించింది. మహిళల 64 కేజీల విభాగంలో రాఖీ హల్దర్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెలిచింది. రాఖీ మొత్తం 218 కేజీలు (స్నాచ్‌లో 85 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 123 కేజీలు) బరువెత్తింది. ఈ క్రమంలో రాఖీ 214 కేజీలతో తన పేరిటే ఉన్న జాతీయ సీనియర్ రికార్డును సవరించింది. టోక్యో ఒలింపిక్స్ సిల్వర్ స్థాయి అర్హత టోర్నమెంట్‌గా గుర్తింపు పొందిన ఖతర్ కప్‌లో ఓవరాల్‌గా భారత్‌కు మూడు పతకాలు లభించాయి. ఇంతకుముందు ఈ టోర్నీలో మీరాబాయి చాను స్వర్ణం, జెరెమీ లాల్‌రినుంగా రజతం సాధించారు.



# బుమ్రా వచ్చేశాడు...

## శ్రీలంక, ఆస్ట్రేలియాలతో సిరీస్‌లకు ఎంపిక

- రోహిత్, షమీలకు విశ్రాంతి
- ధావన్ పునరాగమనం
- జట్లను ప్రకటించిన సెలక్షన్ కమిటీ



బుమ్రా



షమీ



రోహిత్



ధావన్

**న్యూఢిల్లీ:** స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. వెస్టిండీస్ గడ్డపై సిరీస్ తర్వాత గాయంతో జట్టుకు దూరమైన అతను ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. స్వదేశంలో వచ్చే నెలలో శ్రీలంకతో జరిగే టి20, ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌లకు బుమ్రాను సెలక్టర్లు ఎంపిక చేశారు. బుమ్రా ఫిట్‌గా ఉన్నట్లు టీమిండియా ఫిజియో నితిన్ పటేల్ నివేదిక ఇవ్వడంతో అతని రాక ఖాయమైంది. అయితే ఈ సిరీస్‌లకు ముందు బుమ్రా తన మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం గుజరాత్ తరపున ఒక రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడతాడు. రాబోయే రెండు సిరీస్‌ల కోసం ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ జట్లను ఎంపిక చేసింది. గాయం కారణంగానే విండీస్‌తో సిరీస్‌లకు దూరంగా ఉన్న శిఖర్ ధావన్ కూడా మళ్లీ జట్టులోకి వచ్చాడు. గత రెండు సిరీస్‌లకు ఎంపికైనా... ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాని సంజూ సామ్సన్‌ను మరోసారి బ్యాకప్ ఓపెనర్‌గా లంకతో టి20 సిరీస్‌కు ఎంపిక చేశారు. మరోవైపు వెన్నునొప్పితో విండీస్‌తో రెండు మ్యాచ్‌లు ఆడని దీపక్ చాహర్ ఇంకా కోలుకోలేదు. దాంతో అతని స్థానంలో నవదీప్ సైనీ కొనసాగుతాడు.

### షమీకి బ్రేక్...

2019లో భారత జట్టులో అందరికంటే ఎక్కువ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన రోహిత్ శర్మకు ఊహించినట్లుగానే విశ్రాంతి లభించింది. శ్రీలంకతో టి20లకు అతను దూరంగా ఉంటాడు. అయితే ఆసీస్‌తో వన్డేల్లో మాత్రం రోహిత్ బరిలోకి దిగుతాడు. ఈ ఏడాది వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన పేసర్ మొహమ్మద్ షమీకి కూడా సెలక్టర్లు విశ్రాంతి కల్పించారు. భువనేశ్వర్, హార్దిక్ పాండ్యాలు ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో వారి పేర్లను పరిశీలించలేదు. ఎప్పటిలాగే మహేంద్ర సింగ్ ధోని విషయంలో సెలక్టర్లు ఎలాంటి స్పష్టతనివ్వలేదు. ప్రస్తుతానికి ఈ అంశంపై తాను ఎలాంటి వ్యాఖ్యా చేయలేనని ఎమ్మెస్కే చెప్పారు. జనవరి 5, 7, 10 తేదీల్లో శ్రీలంకతో 3 టి20ల్లో... జనవరి 14, 17, 19 తేదీల్లో ఆస్ట్రేలియాతో 3 వన్డేల్లో భారత్ తలపడుతుంది.

### భారత జట్ల వివరాలు

**శ్రీలంకతో 3 టి20లకు:** కోహ్లి (కెప్టెన్), ధావన్, రాహుల్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, జడేజా, శివమ్ దూబే, యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, సైనీ, శార్దుల్ ఠాకూర్, మనీశ్ పాండే, వాషింగ్టన్ సుందర్, సంజు సామ్సన్.

**ఆస్ట్రేలియాతో 3 వన్డేలకు:** కోహ్లి (కెప్టెన్), ధావన్, రోహిత్, రాహుల్, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, రిషభ్ పంత్, కేదార్ జాదవ్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చహల్, నవదీప్ సైనీ, శార్దుల్ ఠాకూర్, బుమ్రా, షమీ.

> 'ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ముగ్గురు ఓపెనర్లు కూడా అందుబాటులో ఉంటారు. చాహర్‌కు అనూహ్యంగా వెన్ను నొప్పి వచ్చింది. అయితే మనకు తగినంత సంఖ్యలో రిజర్వ్ పేస్ బౌలర్లు ఉన్నారు కాబట్టి ఎలాంటి ఇబ్బంది లేదు. గాయం నుంచి కోలుకుంటున్న హార్దిక్ పాండ్యాను న్యూజిలాండ్‌లో పర్యటించే భారత 'ఎ' జట్టులోకి ఎంపిక చేశాం' –ఎమ్మెస్కే ప్రసాద్, చీఫ్ సెలక్టర్

# 'టాప్'తో ముగించిన కోహ్లి

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

**దుబాయ్:** భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అగ్రస్థానంతో 2019ను ముగించాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన తాజా వన్డే బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో అతను 887 రేటింగ్ పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంకులో నిలిచాడు. కోహ్లి సహచరుడు, వైస్‌కెప్టెన్ రోహిత్ (873) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇటీవల టెస్టుల్లోను విరాట్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. మూడు ఫార్మాట్లలో ఈ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన ఓపెనర్‌గా రోహిత్ (2442 పరుగులు) లంక మాజీ ఓపెనర్ జయసూర్య (2387; 1997లో) 22 ఏళ్ల రికార్డును తిరగరాశాడు. అయితే ఓవరాల్‌గా 2455 పరుగులతో ఈ ఏడాది అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా కోహ్లి నిలిచాడు. ఈ రెండు రికార్డులు విండీస్‌తో జరిగిన ఆఖరి వన్డేలో నమోదయ్యాయి.



# ఫిలాండర్ కూడా...

- రిటైర్మెంట్ ప్రకటించిన దక్షిణాఫ్రికా పేసర్
- ఇంగ్లండ్‌తో సిరీసే చివరిది

**జొహన్నెస్‌బర్గ్:** సీనియర్లు దూరమై ఇప్పటికే దిక్కుతోచని స్థితిలో కనిపిస్తున్న దక్షిణాఫ్రికా క్రికెట్‌కు మరో దెబ్బ తగిలింది. స్టెయిన్, మోర్నీ మోర్కెల్ దూరమయ్యాక పేస్ బౌలింగ్ భారాన్ని మోస్తున్న సీనియర్ వెర్నాన్ ఫిలాండర్ కూడా టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు చెబుతున్నట్లు ప్రకటించాడు. త్వరలో స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే టెస్టు సిరీస్ తర్వాత అతను రిటైర్ కానున్నాడు. తొలి టి20 ప్రపంచకప్‌తో పాటు 30 వన్డేలు కూడా ఆడినా... టెస్టు స్పెషలిస్ట్‌గానే ఫిలాండర్‌కు ఎక్కువ గుర్తింపు దక్కింది. 12 ఏళ్ల కెరీర్‌లో ఫిలాండర్ 60 టెస్టుల్లో 22.16 సగటుతో 216 వికెట్లు పడగొట్టాడు. ఇందులో 13 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేయడం విశేషం. సఫారీ జట్టు చిరస్మరణీయ టెస్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఈ స్వింగ్ బౌలర్, ఆ దేశం తరపున అత్యధిక టెస్టు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఏడో స్థానంలో ఉన్నాడు. ఇటీవల తరచూ గాయాలబారిన పడుతుండటంతో 34 ఏళ్ల ఫిలాండర్ రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గత 18 నెలల్లో ఫిలాండర్ 6 టెస్టులు మాత్రమే ఆడగలిగాడు. కొన్నాళ్ల క్రితమే అతని ఫిట్‌నెస్‌ను మాజీ కెప్టెన్, ప్రస్తుతం దక్షిణాఫ్రికా బోర్డు డైరెక్టర్ గ్రేమ్ స్మిత్ ప్రశ్నించడంతో ఫిలాండర్ కెరీర్‌పై చర్చ మొదలైంది.

# భారత జట్లలో కల్పన, అంజలి, అరుంధతి

## మహిళల టి20 చాలెంజర్ ట్రోఫీ

**ముంబై:** సీనియర్ మహిళల టి20 చాలెంజర్ ట్రోఫీలో పాల్గొనే భారత 'ఎ'... 'బి'... 'సి' జట్లను సోమవారం ప్రకటించారు. ఈ టోర్నీ జనవరి 4 నుంచి 11 వరకు కటక్‌లో జరుగుతుంది. భారత 'బి' జట్టులో ఆంధ్ర అమ్మాయిలు రావి కల్పన, అంజలి శర్వాణిలకు స్థానం లభించగా... భారత 'సి' జట్టులో హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి ఎంపికైంది. భారత 'ఎ' జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్... 'బి' జట్టుకు స్మృతి మంధాన... 'సి' జట్టుకు వేద కృష్ణమూర్తి సారథ్యం వహిస్తారు.



అంజలి, కల్పన

# భారత 'ఎ' జట్టు కెప్టెన్‌గా విహారి

## న్యూజిలాండ్ పర్యటనకు జట్ల ఎంపిక



విహారి

**న్యూఢిల్లీ:** వచ్చే నెలలో న్యూజిలాండ్ పర్యటించే భారత 'ఎ' జట్లను సెలక్టర్లు ప్రకటించారు. ఈ టూర్‌లో భాగంగా 'ఎ' టీమ్ 3 వన్డేలు, 2 నాలుగు రోజుల మ్యాచ్‌లు (అనధికారిక టెస్టులు) ఆడుతుంది. జనవరి 19, 22, 24 తేదీల్లో వన్డేలు... జనవరి 30 నుంచి ఫిబ్రవరి 10 మధ్య రెండు అనధికారిక టెస్టులు జరుగుతాయి. భారత టెస్టు జట్టులో రెగ్యులర్ సభ్యులైన పలువురు ఆటగాళ్లను రెండు అనధికారిక టెస్టుల కోసం ఎంపిక చేశారు. ఈ రెండు టెస్టులకు ఆంధ్ర బ్యాట్స్‌మన్ హనుమ విహారి నాయకత్వం వహిస్తాడు. చతేశ్వర్ పుజారా, రహానే, మయాంక్ అగర్వాల్, సాహా, అశ్విన్ ఈ మ్యాచ్‌లో ఆడతారు. డోపింగ్ నిషేధం ముగిసిన మళ్లీ దేశవాళీ బరిలోకి దిగిన పృథ్వీ షాకు కూడా ఇందులో చోటు దక్కింది. ఆంధ్ర వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ కూడా రెండు టెస్టులకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ పేసర్ మొహమ్మద్ సిరాజ్ రెండు టీమ్‌లలోనూ ఉన్నాడు. వన్డే జట్టుకు శుబ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఈ టీమ్‌లో కూడా సిరాజ్‌కు అవకాశం దక్కింది. గాయం నుంచి కోలుకుంటున్న హార్దిక్ పాండ్యాను ఈ సిరీస్ కోసం ఎంపిక చేయడం విశేషం. 'ఎ' సిరీస్ తర్వాత భారత సీనియర్ జట్టు కివీస్‌తో తలపడనున్న నేపథ్యంలో సన్నాహకంగా అనేక మంది రెగ్యులర్ ఆటగాళ్లను ముందే న్యూజిలాండ్‌కు బీసీసీఐ పంపిస్తోంది. 24 జనవరి నుంచి భారత సీనియర్ టీమ్ పర్యటన మొదలవుతుంది.

# ధోని అంతర్జాతీయ క్రికెట్‌కు 15 ఏళ్లు



**న్యూఢిల్లీ:** భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని అంతర్జాతీయ క్రికెట్‌కు 15 ఏళ్లు పూర్తయ్యాయి. 2004లో సౌరవ్ గంగూలీ సారథ్యంలో అరంగేట్రం చేసిన ధోని సోమవారం డిసెంబర్ 23తో 15 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకున్నాడు. భారత క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన సారథిగా ఘనతకెక్కిన ఈ జార్ఖండ్ స్టార్ మూడు ఫార్మాట్లలో కలిపి 17, 266 పరుగులు చేశాడు. 38 ఏళ్ల ఈ వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ ఇప్పటివరకు 350 వన్డేలు, 98 టి20లు, 90 టెస్టులు ఆడాడు. 829 వికెట్ల పతనంలో పాలు పంచుకున్నాడు. అతని సారథ్యంలో భారత్ ఇటు పొట్టి ఫార్మాట్ (2007)లో, అటు వన్డేల్లో (2011) ప్రపంచకప్ విజేతగా నిలిచింది. మూడు ఐసీసీ ట్రోఫీలు గెలిపించిన ఏకైక భారత సారథిగా ధోనిది ఘనమైన రికార్డు. 2013లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలోనూ ధోని సేన గెలిచింది. టీమిండియాను ఐసీసీ టెస్టు, వన్డే ర్యాంకుల్లో అగ్రస్థానంలో నిలిపిన ఘనత కూడా అతనిదే. ప్రస్తుతం అతని చుట్టూ రిటైర్మెంట్ వార్తలు వస్తున్నా... ఇప్పటివరకు తను మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. జనవరి దాకా తనను ఈ విషయమై అడగొద్దని ఇటీవల మీడియాతో అన్నాడు. ఈ ఏడాది వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ తర్వాత అతను బరిలోకి దిగలేదు.




# స్వదేశంలో గెలిచి... మురిసిన పాక్

## శ్రీలంకపై 1–0తో టెస్టు సిరీస్ సొంతం

**కరాచీ:** పాక్ గడ్డపై టెస్టు క్రికెట్ తిరిగొచ్చిన ఆనందంలో ఉన్న ఆ దేశానికి సిరీస్ విజయం బోనస్ అయింది. దశాబ్దం తర్వాత సొంతగడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో పాకిస్తాన్ 1–0తో గెలిచింది. ఆఖరి టెస్టులో పాకిస్తాన్ 263 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. చివరి రోజు సోమవారం ఆట మొదలైన 14 నిమిషాలకే... 16 బంతుల్లోనే ముగిసింది. 476 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు 212/7 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్ అదే స్కోరు వద్ద ముగిసింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్, ఓపెనర్ ఫెర్నాండో (102)ను యాసిర్ షా ఔట్ చేయగా, లసిత్ ఎంబుల్దెనియా (0), విశ్వఫెర్నాండో (0)లను టీనేజ్ పేసర్ నసీమ్ షా (5/31) పెవిలియన్ బాట పట్టించాడు. మ్యాచ్‌లో 5 వికెట్లు తీసిన రెండో అతిపిన్న బౌలర్‌గా 16 ఏళ్ల 307 రోజుల వయసున్న నసీమ్ షా రికార్డులకెక్కాడు. తొలి బౌలర్ కూడా పాకిస్తానీ ఆటగాడే. 1958లో వెస్టిండీస్‌పై స్పిన్నర్ నజీమ్ ఉల్ ఘని (16 ఏళ్ల 303 రోజులు) ఈ రికార్డు సృష్టించాడు.

### పాక్ భద్రమే: లంక సారథి

పాకిస్తాన్‌పై అభద్రతా భావం తగదని, ఇప్పుడు పాక్ 200 శాతం భద్రమైన దేశమని శ్రీలంక సారథి కరుణరత్నే తెలిపాడు. ఈ దేశంలో పర్యటన ఇపుడు సురక్షితమైందేనని చెప్పాడు. 'ప్రభుత్వం చేపట్టిన భద్రతా చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయి. పర్యటనకు ముందు పాక్‌లో బయటికెళ్లడంపై ఆందోళనగా ఉండేది. కానీ వచ్చాక మాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు' అని కరుణరత్నే అన్నాడు.

# నిరూపించుకోవాల్సిన అవసరం లేదు: జడేజా



**కటక్:** వెస్టిండీస్‌తో చివరి వన్డేలో కీలక ఇన్నింగ్స్ ఆడిన రవీంద్ర జడేజా విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. కొన్నాళ్ల క్రితం వరకు జడేజా టెస్టులకే పరిమితమయ్యాడు. అయితే పునరాగమనంలో లభించిన అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకున్న అతను ఇప్పుడు వన్డేల్లోనూ ప్రధాన ఆటగాడిగా మారాడు. మూడో వన్డేలో జడేజా 39 పరుగులతో అజేయంగా నిలిచాడు. కటక్ ప్రదర్శనపై అతను మాట్లాడుతూ... 'నేనేమిటో ప్రపంచానికి నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. నేను ఏం ఆడగలనో నాకు సమాధానం చెప్పుకోగలిగితే చాలు. ఇంకా పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ సత్తా చాటగలనని ఈ మ్యాచ్‌తో చూపించాను. ఈ ఏడాది నేను ఎక్కువగా వన్డేలు ఆడలేదు. అయితే కీలక దశలో సిరీస్ విజయానికి అవసరమైన రీతిలో నా అత్యుత్తమ ఆటతీరు కనబర్చేందుకు ప్రయత్నించాను' అని వ్యాఖ్యానించాడు. టీమిండియా ఈ ఏడాది 28 వన్డేలు ఆడగా అందులో 15 మ్యాచ్‌లలో జడేజా ఉన్నాడు. మరోవైపు జడేజా ప్రదర్శన పట్ల బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కూడా సంతృప్తి వ్యక్తం చేశాడు. జడేజా బ్యాటింగ్ ఎంతో మెరుగుపడటం సానుకూలాంశమని అతను అన్నాడు.


భారతీయ రిజర్వు బ్యాంక్
भारतीय रिज़र्व बैंक
पर्यवेक्षण विभाग (गै बैं वि कं) - పర్యవేక్షణ విభాగము (NBFC)
क्षेत्रीय कार्यालय, 6-1-56, सचिवालय मार्ग, सैफाबाद, हैदराबाद - 500 004
ప్రాంతీయ కార్యాలయం, 6-1-56, సెక్రటేరియట్ రోడ్, సైఫాబాద్, హైదరాబాద్-500004

**నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థల సర్టిఫికేట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ రద్దు – బహిరంగ ప్రకటన**

**భారతీయ రిజర్వు బ్యాంక్ చట్టం, 1934 (చట్టం)లోని** సెక్షన్ 45-IA (6) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ భారతీయ రిజర్వు బ్యాంక్ సదరు చట్టంలోని సెక్షన్ 45-I(a) లో నిర్వచించిన విధంగా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ వ్యాపారం నిర్వహించేందుకు దిగువ తెలిపిన కంపెనీల యొక్క సర్టిఫికెట్స్ ఆఫ్ రిజిస్ట్రేషన్ (CoR)ను రద్దు చేయబడినవి.

| క్ర. సం. | కంపెనీ పేరు మరియు CIN నంబరు | కంపెనీ యొక్క నమోదిత కార్యాలయ చిరునామా | రిజర్వు బ్యాంక్ ద్వారా జారీ చేసిన సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ నంబరు | రద్దు పర్చబడిన తేది |
|---|---|---|---|---|
| 1 | క్యాపిటల్‌సిరి ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (CIN- U65929TG2017PTC120679) | తాన్లా టెక్నాలజీ సెంటర్, హైటెక్ సిటీ రోడ్, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ–500081 | N-09.00454 తేది: 28 మే, 2018 | 19 జూలై, 2019 |
| 2 | జగపతి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (CIN- U65993TG1984PTC004829) | ప్లాట్ నం. 82, కావూరి హిల్స్, ఫేజ్–II, మాదాపూర్, హైదరాబాద్–500081, తెలంగాణ | B-09.00380 తేది: 24 డిసెంబర్, 2001 | 8 నవంబర్, 2019 |
| 3 | M/s. స్వాన్ క్రెడిట్ కార్పొరేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (CIN- U67120TG1995PTC022603) | 6–32/1/224, వాయుశక్తినగర్, దమ్మాయిగూడ, నాగారం, కీసర మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ–500083 | B-09.00320 తేది: 17 అక్టోబర్, 2012 | 8 నవంబర్, 2019 |

కావున, పైన పేర్కొన్న కంపెనీలు ఇకపై నాన్ బ్యాంకింగ్ సంస్థల వ్యాపార కార్యకలాపాలు నిర్వహించరాదు. రద్దుపరచబడిన ఎన్‌బిఎఫ్‌సి యొక్క తాజా జాబితాను https://rbi.org.in/Scripts/BS_NBFCList.aspx నందు చూడవచ్చును.

ప్రజాప్రయోజనం దృష్ట్యా ఇది జారీ చేయబడినది.

సం/–
జనరల్ మేనేజర్
ప్రదేశం: హైదరాబాద్

**गैर बैंकिंग वित्तीय कंपनियों - पंजीकरण प्रमाणपत्रों को रद्द किया जाना - सार्वजनिक सूचना**

भारतीय रिज़र्व बैंक अधिनियम, 1934 (अधिनियम) की धारा 45-IA (6) के अंतर्गत भारतीय रिज़र्व बैंक को प्रदत्त शक्तियों का प्रयोग करते हुए भारतीय रिज़र्व बैंक ने अधिनियम की धारा 45-I (क) के अंतर्गत परिभाषित गैर बैंकिंग संस्थान का व्यवसाय करने के लिए निम्नलिखित कंपनियों के पंजीकरण प्रमाणपत्रों को रद्द कर दिया है :

| क्रम सं. | कंपनी का नाम और सीआईएन संख्या | कंपनी के पंजीकृत कार्यालय का पता | रिज़र्व बैंक द्वारा जारी पंजीकरण प्रमाणपत्र संख्या और दिनांक | रद्द करने की दिनांक |
|---|---|---|---|---|
| 1 | कैपिटलसिरि इन्वेस्टमेंट्स प्राइवेट लिमिटेड (CIN- U65929TG2017PTC120679) | तनला टेक्नोलॉजी सेंटर, हाई- टेक सिटी रोड, माधापुर, हैदराबाद, तेलंगाना - 500081 | एन -09.00454 दिनांक मई 28, 2018 | जुलाई 19, 2019 |
| 2 | जगपति फाइनेंस प्राइवेट लिमिटेड (CIN-U65993TG1984PTC004829) | प्लॉट नंबर 82, कावुरी हिल्स, फेज - II, माधापुर, हैदराबाद - 500081, तेलंगाना | बी- 09.00380 दिनांक दिसंबर 24, 2001 | नवंबर 08, 2019 |
| 3 | मेसर्स स्वान्स क्रेडिट कार्पोरेशन इंडिया प्राइवेट लिमिटेड (CIN- U67120TG1995PTC022603) | 6-32/1/224, वायु शक्ति नगर, दम्माइगूडा, नागारम, केसरा मंडल, रंगारेड्डी जिला, तेलंगाना - 500083 | बी-09.00320 दिनांक अक्टूबर 17, 2012 | नवंबर 08, 2019 |

अब से उपर्युक्त कंपनियाँ अधिनियम में परिभाषित किए अनुसार गैर-बैंकिंग वित्तीय संस्थानों का व्यवसाय नहीं कर सकती हैं। जिन कंपनियों के प्रमाणपत्र रद्द किए जा चुके हैं, उनकी अद्यतन सूची https://rbi.org.in/Scripts/BS_NBFCList.aspx पर उपलब्ध है।

यह जनहित में जारी किया गया है।

ह/-
महा प्रबंधक
स्थान: हैदराबाद

# సాక్షి బిజినెస్

మంగళవారం
24-12-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39 ▼ | 9 ▼ |
| 41,643 | 12,263 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,952 | ▲ | 27 |
| డోజోన్స్ | 28,569 | ▲ | 115 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,624 | ▲ | 41 |
| డాక్స్ | 13,301 | ▼ | 18 |
| షాంఘై | 2,963 | ▼ | 42 |
| నికాయ్ | 23,821 | ▲ | 4 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.40 | 72.04 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.10 | 94.30 |
| యూరో | ఎస్‌బీఐ | 77.48 | 80.36 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.90 | 66.30 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 48.15 | 50.32 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.61 | 53.42 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.19 | 19.80 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.92 | 19.92 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.53 | 10.93 |

## ఆర్థిక వృద్ధికి ఊపు ఎలా?

### ప్రధాని నేతృత్వంలో కీలక భేటీ

**న్యూఢిల్లీ:** పెట్టుబడులు, వృద్ధికి సంబంధించి ఏర్పాటయిన క్యాబినెట్ కమిటీ మొట్టమొదటి సమావేశం సోమవారం ఇక్కడ జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆర్థిక వృద్ధి స్పీడ్ పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశం చర్చించినట్లు ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. అయితే సమావేశం తీసుకున్న నిర్ణయాలు ఏమిటన్నది తెలియరాలేదు. జూన్‌లో ఏర్పాటయిన ఈ క్యాబినెట్ కమిటీలో ప్రధానితోపాటు మరో నలుగురు– హోం శాఖ మంత్రి అమిత్‌షా, రహదారులు–లఘు చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి నితిన్ గట్కరీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య–రైల్వే శాఖ మంత్రి పియుష్ గోయెల్ సభ్యులుగా ఉన్నారు. జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు ఆరేళ్ల కనిష్ట స్థాయి 4.5 శాతానికి పడిపోవడం ఈ సమావేశానికి నేపథ్యం.

## చట్టబద్ధంగానే వ్యవహరించాం..

- ఆదేశాలు సవరించండి
- టాటా సన్స్ కేసులో ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశాలపై ఆర్‌వోసీ అప్పీలు

**న్యూఢిల్లీ:** టాటా సన్స్, సైరస్ మిస్త్రీ వివాదానికి సంబంధించిన కేసులో ఇచ్చిన ఆదేశాలను సవరించాలంటూ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ–ముంబై) సోమవారం నేషనల్ కంపెనీ లా అపీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)ని ఆశ్రయించింది. టాటా సన్స్‌ను పబ్లిక్ కంపెనీ నుంచి ప్రైవేట్ కంపెనీగా మార్చడంలో తాము చట్టవిరుద్ధంగా వ్యవహరించామంటూ ఎన్‌సీఎల్‌ఏటీ వ్యాఖ్యానించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కంపెనీల చట్టంలోని నిబంధనలకు అనుగుణంగానే తాము వ్యవహరించామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆర్‌వోసీ చర్యలు 'చట్టవిరుద్ధం' అన్న వ్యాఖ్యలను .. ఉత్తర్వుల నుంచి తొలగించాలని, తగు విధంగా ఆదేశాలను సవరించాలని ఎంసీఏ కోరింది. దీనిపై వచ్చే ఏడాది జనవరి 2న ఎన్‌సీఎల్‌ఏటీ విచారణ జరపనుంది. టాటా గ్రూప్ చైర్మన్‌గా సైరస్ మిస్త్రీని తొలగించడం చెల్లుబాటు కాదంటూ ఈ ఏడాది డిసెంబర్ 18న ఎన్‌సీఎల్‌ఏటీ ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇదే సందర్భంలో టాటా సన్స్‌ను పబ్లిక్ కంపెనీ నుంచి ప్రైవేట్ కంపెనీగా మార్చడంలో ఆర్‌వోసీ చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని, తక్షణమే దాన్ని సరిదిద్దాలని కూడా ఆదేశించింది. దీనిపైనే తాజాగా ఎన్‌సీఎల్‌ఏటీని ఆర్‌వోసీ ఆశ్రయించింది.

## ఏపీ, తెలంగాణలో ఎయిర్‌టెల్ వైఫై కాలింగ్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** టెలికం రంగ సంస్థ ఎయిర్‌టెల్ వాయిస్ ఓవర్ వైఫై సర్వీస్ 'ఎయిర్‌టెల్ వైఫై కాలింగ్'ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌కు విస్తరించింది. అలాగే ముంబై, కోల్‌కతా, కర్ణాటక, తమిళనాడులోనూ ఈ సేవలను పరిచయం చేసింది. వైఫై ఆధారంగా ఏదేని నెట్‌వర్క్‌కు టెల్కో గ్రేడ్ కాల్స్ చేసుకునే వీలుండడం దీని ప్రత్యేకత. వినియోగదార్ల నుంచి అదనంగా ఎటువంటి చార్జీ వసూలు చేయబోమని కంపెనీ ప్రకటించింది. ఇల్లు, కార్యాలయంలో మొబైల్ నెట్‌వర్క్ సరిగా లేనప్పుడు వైఫై కాలింగ్ చక్కని ప్రత్యామ్నాయం అని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం కొన్ని మొబైల్ కంపెనీల మోడల్స్‌కు మాత్రమే వైఫై కాలింగ్ ఫీచర్ ఉంది. ఈ ఫీచర్‌ను జోడించేందుకు ఇతర కంపెనీలతో ఎయిర్‌టెల్ చర్చిస్తోంది. వైఫై కాలింగ్ ప్రస్తుతానికి ఎయిర్‌టెల్ ఎక్స్‌స్ట్రీమ్ ఫైబర్ హోం బ్రాడ్‌బ్యాండ్‌పై పనిచేస్తుంది. త్వరలో ఇతర కంపెనీల బ్రాడ్‌బ్యాండ్, వైఫై హాట్‌స్పాట్స్‌పైనా పనిచేసేలా ఏర్పాట్లు చేస్తోంది. ఎయిర్‌టెల్ వైఫై కాలింగ్ తొలుత ఢిల్లీలో ఈ నెల ప్రారంభంలో అందుబాటులోకి వచ్చింది. కాగా, రిలయన్స్ జియో సైతం వాయిస్ ఓవర్ వైఫై సేవలను కేరళ, మహారాష్ట్ర, కోల్‌కతాలో ప్రవేశపెట్టినట్టు సమాచారం.

## సింగపూర్, లండన్‌లలో...

# ఎయిరిండియా రోడ్‌షోలు...

- విక్రయంపై జోరుగా కసరత్తు
- విదేశీ ఇన్వెస్టర్ల నుంచి అంతంతమాత్రం స్పందన
- దేశీ రోడ్‌షోల్లోనే కాస్తంత ఆసక్తి
- జనవరిలో ఈవోఐ ప్రకటించే అవకాశాలు



**న్యూఢిల్లీ:** నష్టాలు, రుణాల భారంతో కుదేలవుతున్న ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా విక్రయ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం జోరుగా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఇన్వెస్టర్ల ఆసక్తిని అంచనా వేసేందుకు ఇటీవలే సింగపూర్, లండన్‌లో రోడ్‌షోలు నిర్వహించింది. అయితే, ఇన్వెస్టర్ల నుంచి స్పందన అంతంతమాత్రంగానే వచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయినప్పటికీ, ఎయిరిండియా ప్రైవేటీకరణ ప్రతిపాదనపై దీని ప్రభావం ఉండబోదని, ముందస్తుగా నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారమే విక్రయ ప్రక్రియ ప్రణాళిక కొనసాగుతుందని అధికారి పేర్కొన్నారు. 'సింగపూర్, లండన్‌లలో నిర్వహించిన రోడ్‌షోలకు పెద్దగా స్పందన కనిపించలేదు. కొందరు ఇన్వెస్టర్లు మాత్రమే హాజరయ్యారు. ఈ నేపథ్యంలో .. ఎయిరిండియా కొనుగోలుపై ఇన్వెస్టర్ల ఆసక్తి.. ఆలోచనలో పడేసేదిగా ఉంది' అని తెలిపారు. విదేశాల్లోని రోడ్‌షోల్లో వచ్చిన స్పందన బట్టి చూస్తే.. ఎయిరిండియా వేలంలో పెద్ద స్థాయిలో బిడ్లు రాకపోవచ్చని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

**షెడ్యూల్ ప్రకారం విక్రయ ప్రక్రియ ..**

అయితే, దేశీయంగా ముంబైలో నిర్వహించిన రోడ్‌షోల్లో ఇన్వెస్టర్ల నుంచి కాస్త ఆశావహ స్పందన కనిపించిందని మరో అధికారి చెప్పారు. ఇదే ఊతంతో.. ఎయిరిండియా విక్రయానికి సంబంధించి తుది బిడ్డింగ్ డాక్యుమెంట్లను ఖరారు చేసే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉంది. నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం పండుగ సీజన్ తర్వాత జనవరిలో ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలను (ఈవోఐ)ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు అధికారి తెలిపారు. అప్పుడైతే విదేశీ ఇన్వెస్టర్లు కూడా కాస్త పెద్ద సంఖ్యలో పాల్గొనవచ్చని భావిస్తున్నట్లు వివరించారు.

**విదేశీ ఎయిర్‌లైన్స్‌కు ఎఫ్‌డీఐ అడ్డంకులు..**

ఎయిరిండియా కొనుగోలు ప్రక్రియలో విదేశీ ఎయిర్‌లైన్స్ పాల్గొనడానికి లేకుండా నిబంధనలు ప్రతిబంధకంగా ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం భారతీయ విమానయాన సంస్థల్లో విదేశీ ఎయిర్‌లైన్స్ 49 శాతానికి మించి వాటాలు కొనుగోలు చేయడానికి లేదు. ఒకవేళ కొనదల్చుకున్న పక్షంలో ఏదైనా భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి బిడ్ చేయాల్సి ఉంటుంది. సదరు భారతీయ భాగస్వామ్య సంస్థ 51 శాతం, విదేశీ ఎయిర్‌లైన్స్ 49 శాతం వాటాలు కొనుగోలు చేయొచ్చు. కానీ ఎయిరిండియా విషయంలో భారత సంస్థలతో జట్టు కట్టే ఆలోచనేదీ విదేశీ ఎయిర్‌లైన్స్‌కు లేనట్లు తెలుస్తోంది. మరోవైపు, విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు ప్రతిబంధకంగా ఉన్న ఈ నిబంధనను సడలించడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ఎయిరిండియాను కొనుగోలు చేసే విదేశీ ఇన్వెస్టర్లకు కాస్త చెప్పుకోతగ్గ స్థాయిలో యాజమాన్య హక్కులు దక్కేలా, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు వారి అభిప్రాయాలకూ ప్రాధాన్యం లభించేలా నిబంధనను సవరించే అంశంపై సమాలోచనలు జరుగుతున్నాయి. గత నెల నవంబర్‌లో విమానయాన శాఖ, పరిశ్రమలు.. అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం మధ్య జరిగిన సమావేశంలో ఇది చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎయిరిండియా విక్రయానికి గతంలో ఒకసారి ప్రయత్నించినప్పటికీ.. ఇన్వెస్టర్ల నుంచి స్పందన కరువవడంతో సదరు ప్రతిపాదనపై ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. 2007–08లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌తో విలీనమైన తర్వాత నుంచి ఎయిరిండియా నష్టాల్లో కొనసాగుతోంది. 2018–19లో ఎయిరిండియా నష్టాలు సుమారు రూ. 8,556 కోట్లుగా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి రుణభారం రూ. 58,351 కోట్ల మేర ఉంది. కంపెనీని గట్టెక్కించడానికి 2011–12 నుంచి ఇప్పటిదాకా ప్రభుత్వం రూ. 30,520 కోట్ల దాకా సమకూర్చింది.

## బోయింగ్ సీఈవో డెనిస్‌కు ఉద్వాసన

### కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా డేవిడ్



**న్యూయార్క్:** మ్యాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల వివాదం కారణంగా ప్రతిష్ట మసకబారడంతో .. విమానాల తయారీ దిగ్గజం బోయింగ్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా డెనిస్ ములెన్‌బర్గ్‌ను చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) పదవి నుంచి తప్పించింది. ప్రస్తుతం బోర్డ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న డేవిడ్ కాలోన్‌కు సీఈవో, ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించింది. నియంత్రణ సంస్థలు, కస్టమర్లు, ఇతర వర్గాలతో సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు, వారి విశ్వాసం చూరగొనేందుకు ఈ మార్పులు అవసరమని బోయింగ్ పేర్కొంది. పూర్తి పారదర్శకంగా పనిచేసేందుకు కట్టుబడి ఉన్నామని ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం డెనిస్ ములెన్‌బర్గ్ తక్షణమే పదవి నుంచి తప్పుకోనున్నారు. వచ్చే ఏడాది జనవరి 13న కాలోన్ కొత్త బాధ్యతలు చేపడతారని బోయింగ్ తెలిపింది. ఈలోగా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ గ్రెగ్ స్మిత్.. తాత్కాలిక సీఈవోగా వ్యవహరిస్తారని వివరించింది. 737 మ్యాక్స్ రకానికి చెందిన రెండు విమానాలు కుప్పకూలడంతో ఈ విమానాలను పూర్తిగా పక్కన పెట్టాల్సి వచ్చిన సంగతి తెలిసిందే.

## ఎన్‌పీఎస్ కింద పన్ను ప్రయోజనం రెట్టింపు కావాలి

### రెగ్యులేటర్ పీఎఫ్‌ఆర్‌డీఏ

**న్యూఢిల్లీ:** నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) కింద ప్రస్తుతం ఒక ఆర్థిక సంవత్సరంలో చేసే రూ.50,000 పెట్టుబడులపై ఉన్న పన్ను ప్రయోజనాన్ని రూ.లక్షకు పెంచాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఆర్‌డీఏ) విజ్ఞప్తి చేసింది. వచ్చే బడ్జెట్‌లో ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు అథారిటీ హోల్ టైమ్ మెంబర్ సుప్రతిమ్ బందోపాధ్యాయ వెల్లడించారు.

## పర్యటనకు ఛలో హైదరాబాద్

### బుకింగ్‌డాట్‌కామ్ సర్వే వెల్లడి



**ముంబై:** దేశీయ పర్యాటకులు ఈ ఏడాది హైదరాబాద్‌కు జై కొట్టారు. దేశంలోని పర్యాటక ప్రాంతాల్లో హైదరాబాద్‌కే అగ్రతాంబూలం దక్కిందని బుకింగ్‌డాట్‌కామ్ సర్వేలో వెల్లడైంది. ఇక దేశీయ పర్యాటకుల అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాల్లో దుబాయ్ అగ్రస్థానంలో నిలిచిందని ఈ సర్వే పేర్కొంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబర్ 30 వరకూ పర్యాటక, వసతి పరంగా జరిగిన బుకింగ్స్ ఆధారంగా ఈ వివరాలను వెల్లడించింది. మరిన్ని వివరాలు...

- హైదరాబాద్‌తో పాటు పుణే, జైపూర్, కోచి, మైసూర్ ప్రాంతాలను కూడా దేశీయ పర్యాటకులు అత్యధికంగా సందర్శించారు.
- భారత పర్యాటకులు ప్రాధాన్యత ఇచ్చిన అంతర్జాతీయ సందర్శన నగరాలుగా దుబాయ్, బ్యాంకాక్, సింగపూర్, లండన్‌లు నిలిచాయి.
- దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న పర్యాటక ప్రాంతాలుగా షిల్లాంగ్, మంగళూరు, రిషికేశ్, గౌహతి, పుణేలు నిలిచాయి.
- ఈ ఏడాది భారత్‌కు అత్యధికంగా ఇజ్రాయెల్, బంగ్లాదేశ్, పోలండ్, జపాన్, సింగపూర్‌ల నుంచి పర్యాటకులు వచ్చారు.

## 90 నిముషాల్లో ఫోన్ డెలివరీ




ఆఫర్లను ప్రకటిస్తున్న బాలాజీ రెడ్డి, కైలాష్ లఖ్యానీ, బాలు చౌదరి, స్వప్న కుమార్ (ఎడమ నుంచి)

- ఆన్‌లైన్‌లోకి 'బిగ్ సి' మొబైల్స్
- స్మార్ట్ ఉపకరణాలూ విక్రయం
- కంపెనీ ఫౌండర్ బాలు చౌదరి

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ 'బిగ్ సి' ఆన్‌లైన్ విక్రయాల్లోకి ప్రవేశించింది. కంపెనీ స్టోర్లున్న నగరం, పట్టణంలో వెబ్, యాప్ ద్వారా ఆర్డరు ఇచ్చిన 90 నిమిషాల్లోనే మొబైల్‌ను ఉచితంగా డెలివరీ చేస్తారు. కస్టమర్ కోరితే ఇంటి వద్దే మొబైల్స్‌ను ప్రదర్శిస్తారు. ప్రస్తుతం సంస్థకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో 81 నగరాలు, పట్టణాల్లో 225 ఔట్‌లెట్లు ఉన్నాయి. కర్ణాటకలో కొద్ది రోజుల్లో అడుగు పెట్టనున్నట్టు బిగ్ సి ఫౌండర్ ఎం.బాలు చౌదరి తెలిపారు. 17వ వార్షికోత్సవ ఆఫర్లను ప్రకటించిన సందర్భంగా డైరెక్టర్లు స్వప్న కుమార్, బాలాజీ రెడ్డి, కైలాష్ లఖ్యానీతో కలిసి సోమవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. 2021 మార్చి నాటికి స్టోర్ల సంఖ్య 300లకు చేరుతుందన్నారు. ఇందు కోసం రూ.50 కోట్లదాకా ఖర్చు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

**స్టోర్లలో ఇతర ఉపకరణాలు..**

మొబైల్స్, యాక్సెసరీస్‌తోపాటు ఎంఐ, టీసీఎల్ కంపెనీల స్మార్ట్ టీవీల విక్రయాలను ప్రారంభించామని బాలు చౌదరి తెలిపారు. 'ఇతర కంపెనీల స్మార్ట్ టీవీలను సైతం ప్రవేశపెడతాం. ఇంటర్నెట్‌తో అనుసంధానించే స్మార్ట్ ఉపకరణాల సంఖ్య పెంచుతాం. 17వ వార్షికోత్సవం పురస్కరించుకుని రూ.12 కోట్ల విలువైన బహుమతులు, రూ.5 కోట్ల విలువైన క్యాష్ పాయింట్లను సైతం ఆఫర్ చేస్తున్నాం. ప్రతి కొనుగోలుపై స్క్రాచ్ కార్డు ద్వారా ఖచ్చితమైన బహుమతిని కస్టమర్ అందుకోవచ్చు. ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఎల్‌ఈడీ టీవీలు, ల్యాప్‌టాప్‌ల వంటి బహుమతులు వీటిలో ఉన్నాయి. జనవరి 31 వరకు ఈ ఆఫర్ ఉంటుంది' అని వివరించారు. 5 కోట్ల మంది కస్టమర్లకు చేరువయ్యామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

## మొబైల్స్‌దే మెజారిటీ వాటా

- ఆన్‌లైన్ షాపింగ్‌పై నీల్సన్ సర్వే
- తొలిసారి కస్టమర్లు 56%



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** భారత్‌లో ఈ–కామర్స్ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ఇద్దరు వినియోగదార్లలో ఒకరు తొలిసారిగా ఆన్‌లైన్ వేదికగా వస్తువులను కొనుగోలు చేస్తున్నవారే. ఈ ఏడాది మే–జూలైతో పోలిస్తే ఆగస్టు–అక్టోబరులో మొత్తం కస్టమర్లలో వీరి శాతం అత్యధికంగా 56 శాతానికి చేరుకుందని నీల్సన్ నివేదిక చెబుతోంది. 10 లక్షలకు పైగా జనాభా కలిగిన 52 నగరాల్లోని 1,90,000 మంది ఆన్‌లైన్ కస్టమర్ల షాపింగ్ తీరును ఈ నివేదికలో వివరించింది. కొత్త కస్టమర్లకు మొబైల్స్ తొలి ప్రాధాన్యతగా నిలిచింది. 28 సెప్టెంబరు–25 అక్టోబరు మధ్య ఫెస్టివ్ పీరియడ్‌లో వీరు ఖర్చు చేసిన మొత్తం విలువలో మొబైల్స్ వాటా ఏకంగా 53% ఉంది.

**అధిక ఆర్డర్లు ఎఫ్‌ఎంసీజీలో..**

2019 మే–ఆగస్టు కాలంలో జరిగిన షాపింగ్‌లో విలువ పరంగా మొబైల్స్ 48 శాతం, ఫ్యాషన్ 16 శాతం కైవసం చేసుకున్నాయి. ఇక అత్యధిక ఆర్డర్లు (పరిమాణం) ఎఫ్‌ఎంసీజీ విభాగంలో 56 శాతం చోటుచేసుకోవడం విశేషం. ఎఫ్‌ఎంసీజీలో ఎక్కువ ఆర్డర్లు 50 లక్షలు ఆపై జనాభా ఉన్న మెట్రో నగరాల నుంచే వస్తున్నాయి. 50 లక్షల లోపు జనాభా ఉన్న ప్రథమ శ్రేణి నగరాల నుంచి మొబైల్ ఫోన్ల కోసం 50 శాతం ఆర్డర్లు వస్తే.. మెట్రోల నుంచి ఇది 38 శాతంగా ఉంది. ఆన్‌లైన్ ఫ్యాషన్ విభాగంలో మే–అక్టోబరు మధ్య నాలుగింట మూడు భాగాలు దుస్తులు, పాదరక్షలు ఉన్నాయి.

**షాపింగ్ రాత్రిపూటే..**

మొబైల్స్ తర్వాత ఫ్యాషన్, టీవీలు, ఎలక్ట్రానిక్స్ వంటివి కొనుగోలు చేస్తున్నారు. కొనుగోళ్ల విషయంలో రెండు, మూడవసారి మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్‌కు నూతన వినియోగదార్లు మొగ్గు చూపుతున్నారు. ఫెస్టివల్ సీజన్లో ప్రైమ్ టైంలో అంటే రాత్రి 8–11 గంటల మధ్య అత్యధికంగా 23 శాతం షాపింగ్ జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు 17 శాతం షాపింగ్ నమోదైంది. పండుగల సమయంలో మూడు నాలుగు రెట్ల అమ్మకాలు జరిగాయి. ఇండిపెండెన్స్ డే సేల్ తర్వాత సాధారణంగా నమోదైన విక్రయాలు తిరిగి ఫెస్టివ్ పీరియడ్ వచ్చే సరికి అనూహ్యంగా ఎగబాకాయి. 28 సెప్టెంబరుతో మొదలైన ఫెస్టివ్ సీజన్ తొలి వారంలో 43 శాతం సేల్స్ జరిగాయి.

# పార్టీ లేదా పని.. దేనికైనా 'డెనిమ్'

- వస్త్రధారణలో సౌకర్యం
- ఎంపికకు విస్తృతమైన శ్రేణి
- పని ప్రదేశాల్లో మారుతున్న ధోరణి
- బోటమ్‌వేర్‌గా జీన్స్‌కు ప్రాధాన్యం
- దీంతో మందగమనంలోనూ అమ్మకాల్లో వృద్ధి



**న్యూఢిల్లీ:** దేశంలో వినియోగం పడిపోయిందని వింటున్నాం.. కానీ కొన్నింటికి డిమాండ్ బ్రహ్మాండంగా ఉంది. వాటిల్లో డెనిమ్ కూడా ఒకటి. పార్టీ అయినా, పనికి అయినా, క్యాజువల్ అయినా.. డెనిమ్ వస్త్రాలను ధరించేందుకు ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. తక్కువ ధర, సౌకర్యం, కొత్త కొత్త డిజైన్లు ఇవన్నీ దీనికి కారణం. గడిచిన దశాబ్ద కాలంలో జీన్స్ మార్కెట్ పరిమాణం మూడొంతులు పెరిగి రూ.21,993 కోట్లకు చేరుకుందని యూరో మానిటర్ అనే సంస్థ నివేదిక తెలియజేసింది. ముఖ్యంగా 2018లో ఈ మార్కెట్ 14 శాతం వృద్ధి చెందింది. 2009 తర్వాత ఒక ఏడాదిలో ఈ స్థాయి వృద్ధి నమోదు కావడం మళ్లీ ఇదే. గత కొన్నేళ్లుగా డెనిమ్ అమ్మకాలు ఏటా 9–11 శాతం స్థాయిలో పెరుగుతూ వస్తున్నాయి. అంతర్జాతీయ బ్రాండ్లు అయిన జరా, హెచ్‌అండ్‌ఎం, జాక్ అండ్ జోన్స్, గ్యాప్ గత దశాబ్దంలో మార్కెట్ వృద్ధికి తోడ్పడ్డాయి.

**యువతే ప్రోత్సాహకం**

''మిలీనియల్స్ (1980–2000 మధ్య జన్మించిన వారు) కారణంగా పనిచేసే చోట సంస్కృతి మారిపోవడం, యువతకు డెనిమ్ ఏకరీతి వస్త్రధారణ కావడం ఈ సంస్కృతికి దారితీసింది. దీంతో ఇదొక మెగా ట్రెండ్‌గా మారింది'' అని లెవిస్ ఇండియా ఎండీ సనీవ్ మొహంతి పేర్కొన్నారు. ఈ సంస్థ 2018–19లో అమ్మకాలను 25% పెంచుకుని రూ.1,104 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ''ఫ్యాషన్ నుంచి డెనిమ్ ఎప్పటికీ బయటకు వెళ్లలేదు. ఇప్పుడు అవగాహన మరింత పెరిగింది. వేగంగా అమ్ముడుపోయే వాటికి బదులు విశ్వసనీయ బ్రాండ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు'' ఫ్యూచర్ రిటైల్ జాయింట్ ఎండీ రాకేశ్ బియానీ పేర్కొన్నారు. ఫ్యూచర్ రిటైల్ దేశవ్యాప్తంగా తనకున్న రిటైల్ దుకాణాల పరిధిలో ఏటా కోటి వరకు జీన్స్‌ను విక్రయిస్తోంది. ఫార్మల్ వస్త్ర ధారణకు బదులు స్మార్ట్ క్యాజువల్స్‌ను ధరించే ధోరణి కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లలో గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతోందని ఈ రంగానికి చెందిన వారు చెబుతున్నారు. ముఖ్యంగా బోటమ్‌వేర్ (నడుము కింద ధరించే వస్త్రాలు) విషయంలో డెనిమ్‌కు బలమైన డిమాండ్ ఉన్నట్టు స్పైకర్ సీఈవో సంజయ్ వఖారియా తెలిపారు.

### ఎంపికలెన్నో...

**మో**నోక్రోమ్ డెనిమ్, అథ్లీష్యూర్ డెనిమ్, ఫ్లేర్డ్ డెనిమ్, హైవెయిస్ట్ ఫిట్, క్యారట్‌ఫిట్ నుంచి గతంలో నడిచిన క్లాసిక్ క్యాలిఫోర్నియన్ ఫిట్, మైనింగ్ జీన్స్ వరకు... వినియోగదారులకు జీన్స్ విషయంలో విస్తృతమైన శ్రేణి అందుబాటులో ఉండడం వారికి సౌకర్యంగానూ, ఈ మార్కెట్ వృద్ధికి ఊతంగానూ ఉంటోంది. డెనిమ్స్‌కు సంబంధించి రంగులు, ఫిట్టింగ్, డిజైన్లు, కొత్త స్టయిల్స్ విషయంలో కంపెనీలు ఎన్నో ఆవిష్కరణలు తీసుకొస్తున్నట్టు లైఫ్‌స్టయిల్ ఇంటర్నేషనల్ ఎండీ వసంత్‌కుమార్ అన్నారు. ''అప్పారెల్, లైఫ్‌స్టయిల్ విభాగంలో వినియోగం మందగించని విభాగాల్లో డెనిమ్ కూడా ఒకటి. ఈ ఏడాది కూడా దీనికి డిమాండ్ ఎక్కువగానే ఉంది'' అని అరవింద్ లైఫ్ స్టయిల్ బ్రాండ్స్ సీఈవో జే సురేష్ పేర్కొన్నారు. ఇతర విభాగాల్లో అమ్మకాలు క్షీణించినప్పటికీ.. అన్ని బ్రాండ్లలోనూ డెనిమ్ వస్త్రాల అమ్మకాలు స్థిరంగా 10–15 శాతం మధ్య పెరుగుతున్నట్టు ఆయన చెప్పారు.

## రూ.899లకే టికెట్

### భారీ డిస్కౌంట్లను ప్రకటించిన ఇండిగో



**న్యూఢిల్లీ:** చౌక ధరల విమానయాన సంస్థ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో).. రూ. 899కే దేశీ రూట్లలో టికెట్ అందిస్తోంది. 'ది బిగ్ ఫ్యాట్ ఇండిగో సేల్' పేరిట అందుబాటులోకి వచ్చిన ఈ ఆఫర్.. డిసెంబర్ 23 (సోమవారం) ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చింది. నాలుగు రోజులపాటు కొనసాగే ఈ చౌక చార్జీల ఆఫర్ ఈ నెల 26న రాత్రి 11 గంటల 59 నిమిషాలకు ముగియనుంది. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో వచ్చే ఏడాది జనవరి 15 నుంచి ఏప్రిల్ 15 వరకు జరిగే ప్రయాణాలపై ఆఫర్ వర్తిస్తుంది. విదేశీ ప్రయాణానికి ప్రారంభ టికెట్ ధర రూ. 2,999గా కంపెనీ ప్రకటించింది. ఇండిగో వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా బుకింగ్ చేసుకుంటే సౌలభ్య రుసుము (కన్వీనియన్స్) లేదని వెల్లడించింది.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 1,934 |
| ఎన్ఎస్ఈ | 30,108 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 10,07,983 |
| ఎఫ్ఐఐ | 1,463 |
| డీఐఐ | -1,947 |

## బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,010 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,150 |
| వెండి (కిలో) | 48,800 |
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,340 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,510 |
| వెండి (కిలో) | 48,800 |
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,340 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,510 |
| వెండి (కిలో) | 48,800 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,850 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,980 |
| వెండి (కిలో) | 46,100 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,190 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,440 |
| వెండి (కిలో) | 45,500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,470 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,510 |
| వెండి (కిలో) | 46,400 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 60.56 (రాత్రి 11.30కు) | $ 60.44 (శుక్రవారం ముగింపు) |
| బ్రెంట్ | 66.38 (రాత్రి 11.30కు) | $ 66.14 (శుక్రవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 24-12-2019

| | |
|---|---|
| విశాఖ | 475-00 |
| చిత్తూరు | 448-00 |
| వరంగల్ | 428-00 |
| విజయవాడ | 455-00 |
| గోదావరి | 455-00 |
| **23-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 425-00 |

# రికార్డ్ లాభాలకు బ్రేక్



- క్రిస్మస్ సెలవుల మూడ్‌లో ప్రపంచ మార్కెట్లు
- జార్ఖండ్‌లో బీజేపీకి చుక్కెదురు
- స్వల్ప నష్టాల్లో మన సూచీలు
- 39 పాయింట్లు పతనమై 41,643కు సెన్సెక్స్
- 9 పాయింట్ల నష్టంతో 12,263కు నిఫ్టీ



వరుస నాలుగు ట్రేడింగ్ సెషన్ల రికార్డ్‌ల లాభాలకు సోమవారం బ్రేక్ పడింది. ఒక దశ, దిశ లేకుండా రోజంతా ఒడిదుడుకులమయంగా సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు ఫ్లాట్‌గా ముగిశాయి. కొనుగోళ్లకు పురిగొల్పే తక్షణ కారణాలేవీ లేకపోవడంతో క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు కొనుగోళ్ల దూకుడును ఒకింత తగ్గించారు. బీఎస్ఈ సెన్సెక్స్ 39 పాయింట్ల నష్టంతో 41,643 పాయింట్ల వద్ద, నిఫ్టీ 9 పాయింట్ల నష్టంతో 12,263 పాయింట్ల వద్ద ముగిశాయి. సెన్సెక్స్ రోజంతా 227 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

**ప్రతికూలతలు**

ప్రపంచ మార్కెట్లు క్రిస్మస్ సెలవుల మూడ్‌లో ఉండటం, డిసెంబర్ సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులు ఈ వారంలోనే ముగియనుండటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ క్షీణించడం ప్రతికూల ప్రభావం చూపించాయి. జార్ఖండ్ లో పాలక, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఎదురుగాలి వీయడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో లాభపడిన బ్యాంక్, ఆర్థిక రంగ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. చివర్లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, మారుతీ సుజుకీ, హీరో మోటొకార్ప్ వంటి ఇండెక్స్ షేర్లలో కొనుగోళ్లు జరగడంతో నష్టాలు తగ్గాయి. సెన్సెక్స్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా టాటా మోటార్స్, టాటా మోటార్స్ డీవీఆర్, యస్ బ్యాంక్, వేదాంత షేర్లను తొలగించి, టైటాన్ కంపెనీ, అల్ట్రాటెక్ సిమెంట్, నెస్లే ఇండియాలను చేర్చారు. ఈ మార్పులు సోమవారం నుంచే అమల్లోకి వచ్చాయి. సెన్సెక్స్‌లోకి కొత్తగా చేరిన నెస్లే ఇండియా షేర్ సెన్సెక్స్‌లో 2 శాతం నష్టంతో రూ.14,527 వద్ద ముగిసింది.

## ప్రెస్టీజ్ ఎస్టేట్స్‌లో జీఐసీ పెట్టుబడులు

**రూ.434 కోట్లు ఇన్వెస్ట్ చేసిన సింగపూర్ వెల్త్‌ఫండ్**



**న్యూఢిల్లీ:** బెంగళూరుకు చెందిన రియల్టీ కంపెనీ ప్రెస్టీజ్ ఎస్టేట్స్‌లో సింగపూర్‌కు చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ జీఐసీ రూ.434 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నది. ఈ పెట్టుబడులకు గాను ప్రెస్టీజ్ ఎస్టేట్స్ కంపెనీ 1.34 కోట్ల ఈక్విటీ షేర్లను జీఐసీ అనుబంధ సంస్థ గామ్నాట్ పీటీఈ లిమిటెడ్‌కుకి జారీ చేయనున్నది. ఒక్కో షేర్‌ను రూ.323 ధరకు జారీ చేస్తామని, ఈ షేర్ల జారీకి డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని ప్రెస్టీజ్ ఎస్టేట్స్ వెల్లడించింది. ఈ షేర్ల జారీకి వాటాదారుల ఆమోదం తీసుకోవలసి ఉందని పేర్కొంది.

**236 రియల్టీ ప్రాజెక్టులు...**

ప్రెస్టీజ్ ఎస్టేట్స్ కంపెనీ తన 32 ఏళ్ల చరిత్రలో మొత్తం 236 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టలను పూర్తి చేసింది. 12.5 కోట్ల చదరపుటడుగుల స్పేస్‌ను డెవలప్ చేసింది. ఈ ప్రాజెక్టులు ఎక్కువగా దక్షిణ భారత్‌లోనే ఉన్నాయి. ఈ కంపెనీ ఇటీవలనే నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్) రియల్టీ మార్కెట్లోకి ప్రవేశించింది. ఏస్ గ్రూప్‌తో కలిసి నోయిడాలో తొలి హౌసింగ్ ప్రాజెక్టను రూ.500 కోట్ల పెట్టుబడులతో ఆరంభించనున్నది. ఇక ఏరో సిటీలో డీబీ గ్రూప్‌తో కలిసి రూ.2,000 కోట్లతో ఒక పెద్ద హోటల్‌ను డెవలప్ చేస్తోంది. ఇక సింగపూర్‌కు చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ భారత రియల్టీ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఈ సంస్థ ఇటీవలనే డీఎల్ఎఫ్ రెంటల్ విభాగం డీఎఫ్ఎల్ సైబర్ సిటీ డెవలపర్స్‌లో 33 శాతం వాటా కోసం రూ.9,000 కోట్లు పెట్టుబడులు పెట్టింది.

## కౌన్సిల్ పరిశీలనలో 66.79 లక్షల రిజిస్ట్రేషన్లు

**జీఎస్‌టీ మండలి అధ్యక్షుడు సుశీల్‌కుమార్ మోదీ**



**బెంగళూరు:** పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన 66.79 లక్షల నూతన రిజిస్ట్రేషన్లు నకిలీవా లేక షెల్ కంపెనీలకు సంబంధించినవా అన్నది జీఎస్‌టీ కౌన్సిల్ పరిశీలిస్తోందని జీఎస్‌టీ మండలి అధ్యక్షుడు, బిహార్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీకి సంబంధించి మంత్రుల బృందానికి ఆయన కన్వీనర్‌గా ఉన్న విషయం తెలిసిందే. ''నూతన పన్ను చెల్లింపుదారులు (వీరి సంఖ్య 66.7 లక్షలు ఉంటుంది) 15 శాతమే పన్ను చెలిస్తున్నారు. ఈ మొత్తం రూ.10,000 కోట్లు. దీంతో నూతన పన్ను చెల్లింపుదారులు నకిలీ కాదు కదా అన్నది నిర్ధారించుకునేందుకు పరిశీలన చేస్తున్నాం'' అని సుశీల్‌కుమార్ మోదీ తెలిపారు. జీఎస్‌టీ ప్రారంభమైన తర్వాత పన్ను చెల్లింపుదారుల సంఖ్య 1.21 కోట్లకు చేరిందన్నారు. ఇందులో 66.79 లక్షలు నూతన రిజిస్ట్రేషన్లుగా పేర్కొన్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలో ఉన్న కంపెనీల ప్రాంగణాలను స్వయంగా సందర్శించి, ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నట్టు వివరించారు.

**3బీ రిటర్నులు దాఖలు చేయకపోతే..**

వరుసగా 2 నెలల పాటు 3బీ రిటర్నులు దాఖలు చేయకపోతే వ్యాపారుల ఈవే బిల్లు బ్లాక్ చేయడం జరుగుతుందని సుశీల్‌కుమార్ మోదీ తెలిపారు. ఇప్పటి వరకు 3.47 లక్షల డీలర్ల ఈవే బిల్లులను బ్లాక్ చేశామని చెప్పారు. రిటర్ను దాఖలు చేసిన తర్వాత బిల్లు జారీ అవుతుందన్నారు.



## ఎంఎస్ఎంఈ వర్గీకరణ సవరణలతో ప్రయోజనం

**పీహెచ్‌డీసీసీఐ విశ్లేషణ**

**న్యూఢిల్లీ:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) సంస్థలను వాటి టర్నోవర్ ఆధారంగా వర్గీకరించడం అన్నది వ్యాపార సులభత్వాన్ని ప్రోత్సహిస్తుందని, అప్పుడు ఆయా సంస్థల గుర్తింపు, లావాదేవీలు మరింత సులభంగా మారతాయని పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) పేర్కొంది. ప్లాంట్, మెషినరీపై చేసిన పెట్టుబడులు, వార్షిక టర్నోవర్ ఆధారంగా ఎంఎస్ఎంఈ గుర్తింపు విషయమై చట్టంలో సవరణలకు గతేడాది ఫిబ్రవరిలో కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి ప్రకారం వార్షిక టర్నోవర్ రూ.5 కోట్లకు పైన రూ.75 కోట్లకు మించని వాటిని చిన్న సంస్థగా పరిగణిస్తారు. రూ.75-200 కోట్ల మధ్య టర్నోవర్ ఉన్న వాటిని మధ్య తరహా సంస్థగా పరిగణించడం జరుగుతుంది. ప్రభుత్వం త్వరలోనే ఈ మార్పులను అమల్లోకి తీసుకొస్తుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవలే పేర్కొనడం గమనార్హం. దీంతో పీహెచ్‌డీసీసీఐ ఇలా స్పందించింది.



## జనవరిలో బీఎస్-6 యాక్సెస్ 125 విడుదల

**న్యూఢిల్లీ:** ప్రముఖ ద్విచక్ర వాహన కంపెనీ 'సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా'.. భారత్ స్టేజ్ (బీఎస్)-6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న తన వాహనాలను వచ్చే నెల నుంచి మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. కంపెనీ పాపులర్ మోడల్ యాక్సెస్ 125 స్కూటర్‌ను జనవరిలో ప్రవేశపెట్టడం ద్వారా నూతన ప్రమాణాలకు తగిన ద్విచక్ర వాహనాలను అందించనున్నట్లు పేర్కొంది. నూతన ఉద్గార నిబంధనలు 2020 ఏప్రిల్ నుంచి దేశవ్యాప్తంగా అమలుకానున్న విషయం తెలిసిందే కాగా, గడువు తేదీ కంటే ముందే ఇందుకు తగిన ఆవిష్కరణలు జరగనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కొయిచిరో హిరావ్ చెప్పారు. కొత్త యాక్సిస్‌లో ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్ వంటి అధునాతన ఫీచర్లు ఉండనున్నాయని వెల్లడించారు.

## మార్కెట్లోకి ఎలక్ట్రిక్ స్కూటర్ రియో ఎలైట్

**ధర రూ. 45,099**



**ముంబై:** గ్రీవ్స్ కాటన్ ఈ-మొబిలిటీ అనుబంధ సంస్థ యాంపియర్ వెహికిల్స్.. 'రియో ఎలైట్' పేరిట సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను సోమవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 45,099 (ఎక్స్-షోరూం-బెంగళూరు)గా ప్రకటించింది. ఎల్ఈడీ డిజిటల్ డాష్‌బోర్డ్, డ్యూయల్ షాక్ అబ్జార్బర్స్, యూఎస్‌బీ చార్జింగ్ పాయింట్ వంటి ఫీచర్లు ఉన్నట్లు వివరించింది. 48వీ-20ఏహెచ్ బ్యాటరీ కలిగిన ఈ స్కూటర్లను సంస్థ వెబ్‌సైట్ ద్వారా కొనుగోలు చేయవచ్చు. యాంపియర్ వెహికిల్స్ వెబ్‌సైట్ ద్వారా రూ. 1,999 చెల్లించి బుకింగ్స్ చేసుకోవచ్చని ఆ సంస్థ ప్రకటించింది.

# ఆస్పత్రులకు బీమా ఊతం

- రెండేళ్లలో పెరగనున్న లాభదాయకత
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా



**న్యూఢిల్లీ:** ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో దేశీ ప్రైవేట్ ఆస్పత్రుల లాభదాయకత మరింత మెరుగుపడగలదని రేటింగ్స్ సంస్థ క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది. ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ పథకాలతో కవరేజీ పెరగడం, చిన్న పట్టణాల వారికి కూడా బీమా సదుపాయం అందుబాటులోకి రావడం ఇందుకు దోహదపడగలవని తెలిపింది. జీవన విధానాలపరమైన ఆరోగ్య సమస్యలు, మెడికల్ టూరిజం పెరుగుతుండటం .. మారే నిబంధనలకు అనుగుణంగా హాస్పిటల్ చెయిన్స్ ఆరోగ్య సేవల విధానాలను మార్చుకోవడం వల్ల డిమాండ్ మెరుగుపడుతుండటం వంటి అంశాలు కూడా ఆస్పత్రుల లాభదాయకతకు తోడ్పడగలవని క్రిసిల్ రేటింగ్స్ వివరించింది. 'ఆయుష్మాన్ భారత్ స్కీమ్ కింద బీమా కవరేజీ రూ. 5 లక్షలకు పెరగడంతో (గతంలో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ. 1-3 లక్షల దాకా ఉండేది) .. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు మొగ్గు చూపే వారి సంఖ్య పెరుగుతోంది. 41 దేశీ ఆస్పత్రి సంస్థలపై నిర్వహించిన సర్వే ఆధారంగా క్రిసిల్ ఈ నివేదిక రూపొందించింది.

**గత రెండేళ్లుగా నిరాశ..**

2017, 2018లో నియంత్రణాపరమైన నిబంధనల కారణంగా ప్రైవేట్ ఆస్పత్రుల ఆదాయం, లాభదాయకతపై ప్రతికూల ప్రభావాలు పడినట్లు క్రిసిల్ తెలిపింది. పెద్ద నోట్ల రద్దు, పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలపై నిషేధం వంటి అంశాలు ఆక్యుపెన్సీని దెబ్బతీశాయి. అదే సమయంలో వస్తు, సేవల పన్నుల విధానం (జీఎస్‌టీ) అమల్లోకి రావడం, మెడికల్ ఇంప్లాంట్స్ ధరలపై పరిమితులు విధించడం, నర్సులు.. ఇతర సిబ్బంది కనీస వేతనాలను పెంచాల్సి రావడం మొదలైనవి కూడా లాభదాయకతపై ప్రతికూల ప్రభావం చూపినట్లు క్రిసిల్ తన నివేదికలో తెలిపింది. అయితే, క్రమంగా ఆక్యుపెన్సీ, ఆదాయాలు మెరుగుపడుతుండటంతో ఆస్పత్రులు (సర్వేలో పాల్గొన్న 41 సంస్థలు) 2020, 2021 ఆర్థిక సంవత్సరాల్లో మరింతగా విస్తరించనున్నాయని క్రిసిల్ నివేదిక విశ్లేషించింది.

## రాష్ట్రీయం



# నిజామాబాద్‌లో భారీ ప్రదర్శన

**ఎన్నార్సీ, సీఏఏలకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన**

**నిజామాబాద్‌అర్బన్:** ఎన్నార్సీ. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ముస్లిం మైనార్టీలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పౌరసత్వ సవరణ చట్టం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరంలోని బోధన్ రోడ్డు నుంచి సారంగపూర్ వరకు దుకాణాలను స్వచ్ఛందగా బంద్ చేశారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్నార్సీ. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు యత్నించగా.. తోపులాట జరిగింది. పోలీసు కమిషనర్ కార్తికేయన్ బందోబస్తును పర్యవేక్షిస్తున్న సమయంలో కొందరు నినాదాలు చేస్తూ వాటర్ ప్యాకెట్లను విసిరేశారు. పోలీసులు మత పెద్దలతో మాట్లాడి నిరసనను విరమింపజేయాలని కోరగా.. కొందరు నిరసన కారులు వినిపించుకోలేదు. బైక్‌లపై మాలపల్లి, అర్సపల్లి ఖిల్లా రోడ్డు ప్రాంతాల్లో ర్యాలీ తీశారు. ప్రధాన చౌరస్తాలు, కూడళ్ల వద్ద ప్రత్యేక బలగాలతో సాయంత్రం నాలుగు గంటల వరకు బందోబస్తు కొనసాగింది.

సోమవారం నిజామాబాద్‌లో ఎన్నార్సీ, సీఏఏలకు వ్యతిరేకంగా ముస్లింల భారీ ర్యాలీ



దుక్కిదున్నుతున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

## కూలీగా మారిన సబ్‌రిజిస్ట్రార్

**ములుగు:** జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా సోమవారం కూలీగా అవతారమెత్తారు. రైతు దినోత్సవం సందర్భంగా వ్యక్తిగత సెలవు తీసుకున్న ఆమె.. తన స్వగ్రామమైన ములుగు మండలం రామచంద్రాపురానికి వచ్చారు. రైతు దొంతి రాంరెడ్డి పొలంలో వరినాటు పనుల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం మిగతా కూలీలు తెచ్చుకున్న అన్నం, పచ్చడి మెతుకులు తిన్నారు. సాయంత్రానికి కూలీ డబ్బులు తీసుకుని స్థానిక నిరుపేద కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, వారి కష్టం తెలుసని అన్నారు. రైతులకు భరోసా కల్పించే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. గత ఖరీఫ్‌లో సైతం సబ్‌రిజిస్ట్రార్ స్వగ్రామంలో ఒక రోజు కూలీ పని చేశారు.

# 'ఆ రెండు కులాల వారికి బలుపు ఎక్కువ'

**టీఆర్ఎస్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ వివాదాస్పద వ్యాఖ్యలు**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్ నాయక్

**సాక్షి, మహబూబాబాద్:** మహబూబాబాద్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రెండు కులాల వారికి బలుపు ఎక్కువ అని చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా సోమవారం నిర్వహించిన దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆ రెండు కులస్తులవారు తక్కువ కులాల వారిని కించపరుస్తారని వ్యాఖ్యానించారు. 'కుల మతాలు లేకుండా అందరం కలసిమెలిసి ఉంటే ఎంత బాగుంటుంది.. అబ్రహం లింకన్ కష్టపడి అమెరికాకు ప్రెసిడెంట్ అయ్యాడు. చెప్పులు కుట్టే వాడి కొడుకు అమెరికాకు ప్రెసిడెంట్ కావడం ఏమిటి అని అప్పట్లో ఓ వ్యక్తి హేళన చేశాడు' అని గుర్తు చేశారు. మనిషిలో మూడు రకాల బలుపులు ఉంటాయని వివరించారు. 'నేను ఫలానా కులపోణ్ణి అనే బలుపు ఒకటి.. నా దగ్గర బాగా డబ్బున్నది అనేది మరొకటి.. నేను బాగా చదువుకున్నా అనేది ఇంకొకటి.. అందుకే ఎవరికి ఇలాంటి బలుపు ఉండొద్దు.. ఎవర్ని కోసినా వచ్చేది రక్తమే.. అందరం తినేది అన్నమే.. కాబట్టి అందరం కలసిమెలిసి ఉండటం ముఖ్యం' అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. శంకర్‌నాయక్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## నాచుపల్లి జేఎన్టీయూకు జాతీయస్థాయి గుర్తింపు



జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల

కొండగటు: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లిలోని జేఎన్టీయూ కాలేజీకి ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్) గుర్తింపు లభించింది. మూడేళ్లుగా కళాశాల సిబ్బంది పడిన శ్రమకు గుర్తింపు దక్కింది. ఎన్‌బీఏ సర్టిఫికెట్ కోసం మూడు డిపార్ట్‌మెంట్లు (సీఎస్ఈ, మెకానికల్, ఈఈఈ) దరఖాస్తు చేసుకున్నాయి. ఇటీవల నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ బృందం కళాశాలను సందర్శించింది. ప్రిన్సిపాల్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. ఎన్‌బీఏ గుర్తింపు కళాశాల ఇంజనీరింగ్ పట్టాకు దేశమంతటా ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు రావడంపై ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ రాజు హర్షం వ్యక్తంచేశారు.

## కరెంట్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

**హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారు వ్యవసాయ బావుల కరెంట్ సరఫరాను విద్యుత్ అధికారులు పునరుద్ధరించారు. నస్తీపూర్ శివారులో వ్యవసాయ బోరుబావులకు 'బిల్లులు కట్టలేదని కరెంట్ కట్' శీర్షికన 'సాక్షి'లో సోమవారం వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే బోరుబావులకు విద్యుత్‌ను పునరుద్ధరించారు.

## ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సహించాలి

**వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి**

**సాక్షి, హైదరాబాద్:** ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులను మొగ్గు చూపేలా ప్రోత్సహించాలని, సాంప్రదాయ పంటలతోపాటు ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ వైపు వారిని మళ్లించాలని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచించారు. తెలంగాణలో 206 మండలాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని, రాష్ట్రంలో 50వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు కేంద్రం అనుమతినిచ్చిందని చెప్పారు. సోమవారం ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆయిల్‌పామ్ సాగుపై ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. నూనెల దిగుమతికి దేశం ఏడాదికి రూ.70 వేల కోట్లు వెచ్చించాల్సి వస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుకు విదేశీయులు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వాలు రైతులను, వ్యవసాయాన్ని విస్మరించాయని, సీఎం కేసీఆర్ చేయూతనిచ్చే నిర్ణయాలు, పథకాలతో దేశం దృష్టి రైతుల వైపు మళ్లిందని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావడంతో కరువు నేలలు సస్యశ్యామలం అయ్యాయని, విభిన్న పంటల సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారని తెలిపారు. సమావేశంలో మంత్రి సత్యవతి రాథోడ్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, ఉద్యాన శాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# మురుగునీటి శుద్ధిపై పరిశోధనలు

**ఐఐటీహెచ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ దేబ్రజ్ భట్టాచార్య**



ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దేబ్రజ్ భట్టాచార్యతో రీసెర్చ్ స్కాలర్స్

**సాక్షి, సంగారెడ్డి:** మురుగునీటి శుద్ధి వ్యవస్థలను మరింత అభివృద్ధిపరచేందుకు పరిశోధనలు చేస్తున్నామని ఐఐటీ హైదరాబాద్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దేబ్రజ్ భట్టాచార్య తెలిపారు. మురుగు నీటిని పునర్‌వినియోగించడం, బయోడీజిల్ ఉత్పత్తి చేయడం వంటి లక్ష్యాలతో 'ఆల్గే'ఆధారిత శుద్ధి వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి తమ పరిశోధనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిశోధనలు దీర్ఘకాలంలో గ్రామీణ వర్గాలకు ఎంతో సహాయ పడతాయని భట్టాచార్య తెలిపారు. పునర్ వినియోగానికి అనువైన నీరు, బయోడీజిల్ ఉత్పత్తికి ఆచరణాత్మక మార్గాలను అందించడంతోపాటు శుద్ధికి అయ్యే ఖర్చును గణనీయంగా తగ్గించగలమని ఆయన వివరించారు. పెద్ద నగరాల్లో వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి చాలా అవసరమని పేర్కొన్నారు. క్లాస్-1, 2 నగరాలు, పట్టణాల్లో సరైన వ్యర్థ జలాల శుద్ధి వ్యవస్థ లేకపోవడంతో మురుగునీటిని భూమిలోకి పంపడం వల్ల తీవ్రమైన కలుషిత నీటి సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు.

## తేజ మిర్చి క్వింటాల్‌కు రూ.18,500

**వరంగల్:** వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చికి రికార్డు స్థాయి ధర పలికింది. సోమవారం 1,000 బస్తాల మిర్చి రాగా క్వింటాలుకు రూ.18,500 ధరలు చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు. తేజ రకానికి రూ.18,500, యూఎస్-341 రకానికి రూ.14,500 ధర పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చి పెద్దగా లేక పోవడంతో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారని మార్కెట్ అధికారులు తెలిపారు.

## సమతా కేసులో సాక్షుల విచారణ

**ఆదిలాబాద్‌టౌన్:** సమత కేసుకు సంబంధించి విచారణ ప్రారంభమైంది. ఈనెల 31వ తేదీ వరకు సెలవు దినాలు మినహాయించి మిగతా రోజుల్లో విచారణ జరగనుంది. సోమవారం ఏడుగురు సాక్షులు కోర్టుకు హాజరయ్యారు. ఇందులో నుంచి కోర్టు ఇద్దరిని మాత్రమే విచారించింది. మంగళవారం మరో ఏడుగురు సాక్షులను విచారించనుంది. మొత్తం ఈ కేసులో 44 మందిని కోర్టు విచారణ చేపట్టనుంది.

epaper.sakshi.com

## మే మొదటి వారంలో ఎంసెట్!

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో సాంకేతిక, వృత్తి విద్యా కాలేజీల్లో 2020–21 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్) తేదీలను ఖరారు చేసేందుకు ఉన్నత విద్యా మండలి సిద్ధమైంది. ఈనెల 24న మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే ఉన్నత స్థాయి సమావేశంలో సెట్స్ తేదీలను ఖరారు చేయనున్నారు. 2020 మే మొదటి వారంలో ఎంసెట్ ప్రవేశ పరీక్షలను నిర్వహించేలా షెడ్యూలు ఖరారు చేయనున్నట్లు తెలిసింది. ఎంసెట్, ఈసెట్, ఐసెట్, పీఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్ తదితర పరీక్షలను ఈ సారి కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు.

## ఫిబ్రవరి 11 నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

### మిగతా తరగతులకు ఏప్రిల్ 7 నుంచి వార్షిక పరీక్షలు

**సాక్షి, హైదరాబాద్:** వచ్చే మార్చి 19వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11వ తేదీ నుంచి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆర్జేడీఈలను, డీఈవోలను ఆదేశించింది. నిర్ణీత తేదీల్లో అన్ని ఉన్నత పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టాలని పేర్కొంటూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఫిబ్రవరి 11, 12, 13, 14, 15, 17, 18, 19, 20, 24, 25 తేదీల్లో ఈ పరీక్షలను నిర్వహించాలని స్పష్టంచేసింది. 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు వచ్చే ఏప్రిల్ 7 నుంచి 16వ తేదీ వరకు వార్షిక పరీక్షలను (ఎస్ఏ–2) నిర్వహించాలని తెలిపింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు పరీక్షలను ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6, 7 తరగతుల వారికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు, 8వ తరగతి వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు, 9వ తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పేపర్–1 పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు పేపర్–2 పరీక్షలు నిర్వహించాలని వెల్లడించింది. ఏప్రిల్ 18వ తేదీన ఫలితాలను ప్రకటించి, విద్యార్థులకు జవాబు పత్రాలను అందజేయాలని, 20వ తేదీన పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించాలని సూచించింది.

## అన్నారం బ్యారేజీ సవరించిన వ్యయాలకు ఓకే

### ఆమోదించిన ఎస్ఎల్ఎస్సీ

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న అన్నారం బ్యారేజీలో పెరిగిన అంచనా వ్యయాలకు నీటి పారుదల శాఖ స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్సీ) ఆమోదం తెలిపింది. అన్నారం బ్యారేజీ తొలి అంచనా వ్యయం రూ.1,785 కోట్లు ఉండగా, దాన్ని గతంలోనే రూ.2,456 కోట్లకు సవరించారు. అనంతరం మరిన్ని అదనపు నిర్మాణాలు వచ్చి చేరడంతో దాని అంచనా వ్యయం రూ.2,795 కోట్లకు పెరిగింది. దీనిపై ఈఎన్సీ మురళీధర్ నేతృత్వంలోని ఎస్ఎల్ఎస్సీ చర్చించి పెరిగిన వ్యయానికి ఆమోదం తెలిపింది. ఇక దీనితో పాటే సీతారామ ఎత్తిపోతల పథకంలోని ఎనిమిది ప్యాకేజీల పనుల నిర్మాణ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా, వాటి గడువును పెంచుతూ ఎస్ఎల్ఎస్సీ నిర్ణయించింది. ప్యాకేజీ–1 గడువును వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికే పూర్తి చేయాలని, ప్యాకేజీ–2 నుంచి ప్యాకేజీ–7 వరకు జూన్ లోపు, ప్యాకేజీ–8ను మాత్రం డిసెంబర్ వరకు పూర్తి చేసేలా గడువు పెంచుతూ నిర్ణయం చేశారు. దీంతో పాటే దేవాదుల ఎత్తిపోతల పథకంలోని పలు నిర్మాణాల గడువును వచ్చే ఏడాది జూన్, జూలైకి పూర్తి చేసేలా గడువు పెంచారు.



సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వాలంతరీలో జరిగిన కార్యక్రమంలో 'సాక్షి' జర్నలిస్టు పంతంగి రాంబాబుకు అవార్డు అందజేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి




వర్క్‌షాప్‌లో పాల్గొన్న సతోషి ససాకి, హీరాలాల్ సామరియా, దేవేందర్‌సింగ్, డాక్టర్ ఆర్.కె.ఎలంగోవన్

## వృత్తిపరమైన భద్రతపై రెండు రోజుల వర్క్‌షాప్

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం (ఓఎస్‌హెచ్)పై హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో రెండు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమయింది. కార్మిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఫ్యాక్టరీ అడ్వయిస్ సర్వీస్, లేబర్ ఇన్‌స్టిట్యూట్ (డీజీఎఫ్ఏఎస్ఎల్ఐ), ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌వో) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. జాతీయ ఓఎస్‌హెచ్ ప్రొఫైల్‌లోని అంతరాలను గుర్తించి సరిచేయాలని తద్వారా కార్మికుల రక్షణ, ఆరోగ్యం మరింత మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్ కార్యక్రమం చేపట్టారు. జాతీయ కార్మిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ హీరాలాల్ సామరియా దీన్ని ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్‌లో కార్మిక శాఖ ఆర్థిక నిపుణుడు దేవేందర్ సింగ్, డీజీఎఫ్ఏఎస్ఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎలంగోవన్, ఐఎల్‌వో డిప్యూటీ డైరెక్టర్ సతోషి ససాకితోపాటు దేశంలోని దాదాపు 70 మంది ప్రముఖులు పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ బి.రాజగోపాల్ రావు, ఏపీ నుంచి కార్మికశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బి.ఉదయలక్ష్మి హాజరయ్యారు.

## బాధ్యతలు స్వీకరించిన హెచ్చార్సీ చైర్మన్



**హైదరాబాద్:** రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్చార్సీ) తొలి చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జి.చంద్రయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. హెచ్చార్సీ సభ్యులుగా రిటైర్డ్ జిల్లా సెషన్స్ జడ్జి నడిపల్లి ఆనందరావు, నాన్ జ్యుడీషియల్ సభ్యులుగా మహ్మద్ ఇర్ఫాన్ మొయినుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, శాంతిభద్రతల అదనపు డీజీ జితేందర్ పాల్గొన్నారు.



ఓ స్టాల్‌లో 'సాక్షి' దినపత్రికను పరిశీలిస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# పుస్తకాలే గొప్ప సంపద

### పుస్తక ప్రదర్శనలో గవర్నర్ తమిళిసై

**సాక్షి, హైదరాబాద్:** పుస్తకాల కంటే గొప్ప సంపద మరొకటి లేదని, ధనవంతులుగా ఉండటం ఏ మాత్రం గొప్ప విషయం కాదని, జ్ఞానమే అపారమైన సంపద అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో (ఎన్టీఆర్ స్టేడియం) ఏర్పాటు చేసిన 33వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తనను కలిసేందుకు వచ్చే వారిని పూల బొకేలకు బదులు పుస్తకాలు తీసుకురావాలని కోరినట్లు చెప్పారు. డాక్టర్‌గా, రాజకీయవేత్తగా, గవర్నర్‌గా తీరికలేకుండా ఉన్నా.. రోజూ ఏదో ఓ పుస్తకం చదువుతానన్నారు. గొప్ప గొప్ప విజయాలు సాధించిన ప్రతి ఒక్కరి విజయం వెనుక పుస్తకాల ప్రభావం కచ్చితంగా ఉంటుందని తెలిపారు. పుస్తకానికి ఖరీదు ఉంటుంది కానీ దాన్ని చదివిన తర్వాత వచ్చే తెలివిని వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఐటీ టవర్లు

- 30న కరీంనగర్ ఐటీ టవర్స్ ప్రారంభించనున్న కేటీఆర్
- ఏడాదిలోగా ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లో
- రూ.25 కోట్లతో ఒక్కో టవర్
- శరవేగంగా నిర్మాణ పనులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కరీంనగర్ ఐటీ టవర్స్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని నగరం చుట్టూ కేంద్రీకృతమైన ఐటీ రంగాన్ని ద్వితీయ శ్రేణి పట్టణాలకూ విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2016లో 'రూరల్ టెక్నాలజీ సెంటర్స్ పాలసీ'ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. ఈ పాలసీ ప్రకారం రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి పట్టణాలు, మండల కేంద్రాల్లో ఐటీ కార్యకలాపాలు చేపట్టే సంస్థలకు రాయితీలు ప్రకటించారు. ప్రభుత్వపరంగా రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో ఐటీ రంగం విస్తరణకు వీలుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్ పట్టణాల్లో ఐటీ టవర్స్ నిర్మాణాన్ని చేపట్టింది. ఒక్కో ఐటీ టవర్‌ను 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.18 కోట్ల నుంచి రూ.24 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. వరంగల్‌లో ఇప్పటికే ఐటీ టవర్స్ నిర్మాణం పూర్తి చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించగా, నెలాఖరులోగా కరీంనగర్ ఐటీ టవర్స్ ప్రారంభం కానుంది.

**కరీంనగర్‌లో 11 కంపెనీలు**

కరీంనగర్ ఐటీ టవర్స్‌లో తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు 11 ఐటీ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఈ కంపెనీలు మంగళవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి జయేశ్ రంజన్‌తో భేటీ కానున్నాయి. కాగా, ఈ నెల 30న ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా కరీంనగర్ ఐటీ టవర్స్‌ను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ టవర్స్‌లో తొలి విడతలో సుమారు 3 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కనుండగా, 80 శాతం మంది స్థానికులే ఉంటారని ఐటీ శాఖ అధికారులు వెల్లడించారు. వరంగల్ ఐటీ టవర్స్‌లో ఓ ప్రముఖ సంస్థ జనవరి 7న తన శాఖను కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనుంది. ఖమ్మంలో నిర్మాణంలో ఉన్న ఐటీ టవర్స్ మరో 2 నెలల్లో కార్యకలాపాలు ప్రారంభించనుండగా, మహబూబ్‌నగర్, నిజామాబాద్ ఐటీ టవర్స్ నిర్మాణం 2020 చివరి నాటికి పూర్తి కానుంది.

### 'టాస్క్' ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ

ద్వితీయ శ్రేణి పట్టణాల్లో నిర్మిస్తున్న ఐటీ టవర్స్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించే సంస్థలకు విద్యుత్, ఇంటర్నెట్ చార్జీల్లో రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీలు ఇస్తోంది. దీంతో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న పలు ఐటీ కంపెనీలు ఈ పట్టణాల్లో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. అయితే స్థానికంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను ఐటీ సంస్థలకు అందుబాటులోకి తెచ్చేందుకు టాస్క్ ద్వారా యువతకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీ ఐటీ టవర్‌లో 'టాస్క్' శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు.

# ముగిసిన రీ పోస్టుమార్టం

### దిశ నిందితుల మృతదేహాలకు 4 గంటలపాటు సాగిన ప్రక్రియ



సోమవారం రీపోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఉస్మానియా ఆస్పత్రి నుంచి బయటకు వస్తున్న ఎయిమ్స్ వైద్యుల బృందం

**సాక్షి, హైదరాబాద్/బన్సీలాల్‌పేట:** పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన దిశ నిందితుల మృతదేహాలకు హైకోర్టు ఆదేశాల ప్రకారం ఢిల్లీ ఎయిమ్స్ వైద్యబృందం సోమవారం గాంధీ ఆస్పత్రిలో రీపోస్టుమార్టం నిర్వహించింది. మహమ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, నవీన్ కుమార్, చెన్నకేశవుల మృతదేహాలను అనువణువు పరిశీలించింది. డాక్టర్ సుధీర్ గుప్తా, ఆదర్శ్ కుమార్, అభిషేక్ యాదవ్, వరుణ్ చంద్రాలతో కూడిన వైద్య బృందం సుమారు 4 గంటలపాటు ఈ ప్రక్రియ చేపట్టింది. పోలీసు బందోబస్తు, కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించిన పోస్టుమార్టం ప్రక్రియను వీడియోలో చిత్రీకరించింది. రీ పోస్టుమార్టం నివేదికను మరో రెండు రోజుల్లో కోర్టుకు అందజేయనుంది.

**గాంధీ వైద్యులను దూరంగా ఉంచి..**

హైకోర్టు ఆదేశాల మేరకు ఎయిమ్స్ వైద్య బృందం సోమవారం ఉదయం హైదరాబాద్ చేరుకుంది. తొలుత గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్‌తో సమావేశమై మొదటి పోస్టుమార్టం నివేదికపై ఆరా తీసింది. అయితే ఆ నివేదిక తమ వద్ద లేదని, కోర్టుకు సమర్పించినట్లు డాక్టర్ శ్రవణ్ చెప్పారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి అభ్యంతరాలను తెలుసుకుంది. కుటుంబ సభ్యులు మృతదేహాలను గుర్తించిన అనంతరం రీ పోస్టుమార్టం ప్రక్రియ చేపట్టింది. ఏ మృతదేహానికి ఎన్ని గాయాలున్నాయి? ఏ భాగంలో ఎన్ని బుల్లెట్లు తగిలాయి? అవి ఎంత దూరం నుంచి దూసుకొచ్చాయి? బుల్లెట్ గాయాలు కాకుండా ఇతర గాయాలేమైనా ఉన్నాయా? వంటి అంశాలను గుర్తించే ప్రయత్నం చేసింది. మధ్యాహ్నం 2.30 గంటలకు రీ పోస్టుమార్టం పూర్తయింది. పోస్టుమార్టం సమయంలో ఎయిమ్స్ వైద్యులు ఎవరినీ లోపలకు రానివ్వలేదు. దీంతో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ సహా ఇతర అధికారులంతా బయటే ఉండాల్సి వచ్చింది. పోస్టుమార్టం ప్రక్రియ అనంతరం మృతదేహాలను పోలీసులకు అప్పగించగా, వారు మృతుల బంధువులకు అప్పగించారు. ఆపై నాలుగు పోలీసు వాహనాల్లో మృతదేహాలను వారి స్వగ్రామానికి తరలించారు.



మృతదేహాలను స్వగ్రామాలకు తరలిస్తున్న దృశ్యం

**గంటన్నరలో అంత్యక్రియలు పూర్తి...**

**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల, జక్లేర్ గ్రామాల్లో మృతుల అంత్యక్రియలు ముగిశాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన దాదాపు 18 రోజుల తర్వాత ఇళ్లకు చేరుకున్న తమ బిడ్డల మృతదేహాలను చూసి మృతుల తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీంటి పర్యంతమయ్యారు. రాత్రి ఏడున్నర గంటలకు మృతదేహాలను వారివారి పొలాల్లోనే ఖననం చేశారు. అవివాహితులైన శివ, నవీన్ ఇళ్ల ముందు పందిళ్లు వేసిన వారి కుటుంబ సభ్యులు ముందుగా తమ సంప్రదాయాల ప్రకారం కత్తితో పెళ్లి చేశారు. తర్వాత మృతదేహాలను ట్రాక్టర్లలో వారి పొలాలకు తరలించారు. చెన్నకేశవులు మృతదేహానికి పాడె కట్టి శవయాత్ర నిర్వహించారు. శివ, నవీన్, చెన్నకేశవులను వారి స్వగ్రామమైన గుడిగండ్లలో.. ఆరిఫ్‌ను జక్లేర్‌లో ఖననం చేశారు. చెన్నకేశవులు భార్య రేణుక భోరున విలపించింది. ఆరిఫ్ ఇంటి పక్కనే ఉన్న మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసిన కుటుంబసభ్యులు, గ్రామస్తులు.. ఖబర్‌స్తాన్‌లో ఖననం చేశారు.

## పదోన్నతి రాలేదని ఎస్సై ఆత్మహత్య!

- అంబర్‌పేటలో తనువు చాలించిన సబ్ ఇన్‌స్పెక్టర్
- 2017 నుంచి రెండేళ్ల పాటు సిక్ లీవ్.. ఇటీవలే బాధ్యతలు



ఎస్సై కారింగుల సైదులు (ఫైల్)

**హైదరాబాద్:** ప్రజలకు రక్షణగా నిలిచే పోలీసు తన జీవితానికి భరోసా లేదని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీవితంలో చుట్టుముట్టిన సమస్యలను తట్టుకోలేకపోయాడు. ఎన్నో ఆశలతో సబ్ ఇన్‌స్పెక్టర్ అయిన కారింగుల సైదులు తిరిగిరాని లోకానికి వెళ్లాడు. ఈ ఘటన సోమవారం అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలను డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సైదులు కుటుంబ సభ్యులు మీడియాకు వివరించారు. సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రానికి చెందిన కారింగుల సైదులు 2007లో ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని ట్రాఫిక్ విభాగంలో మొబైల్ కోర్టు వాహన విధులు చేపట్టాడు. 2009లో ఇతనికి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆరోగ్యం చూసుకోవడం కోసం స్వగ్రామానికి చెందిన నిర్మలతో తల్లిదండ్రులు వివాహం జరిపించారు. అంబర్‌పేటలో అద్దె ఇంట్లో కాపురం పెట్టాడు. 2017, అక్టోబర్‌లో సీసీఎస్‌కు బదిలీ అయ్యాడు. అనంతరం సిక్ లీవ్‌లోకి వెళ్లిన సైదులు సీసీఎస్‌లో రిపోర్ట్ చేయలేదు. రెండేళ్లు ఇంట్లోనే ఉంటూ మానసిక, ఆర్థిక ఇబ్బందులు పడుతుండేవాడు.

**ఇటీవలే పోస్టింగ్‌లో చేరిక..**

ఇతని పరిస్థితి తట్టుకోలేక నిర్మల ఉన్నతాధికారులకు తన భర్త ఉద్యోగం చేసే వాతావరణం కల్పించాల్సిందిగా వేడుకుంది. దీంతో నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ అతనికి సీసీఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. గత నెల నవంబర్ 18న సీసీఎస్‌లో సైదులు రిపోర్ట్ చేశాడు. అతను మానసికంగా ఇబ్బంది పడుతుండటంతో నిర్మలే సీసీఎస్ కార్యాలయానికి తీసుకువెళ్లి తీసుకువస్తోంది. 2009 బ్యాచ్‌కు చెందిన కొందరు ఎస్సైలు.. ఇన్‌స్పెక్టర్లు కావడం, తాను కాకపోవడంపై కూడా ఇంట్లో చెప్పుకుంటూ బాధపడేవాడని నిర్మల వాపోయింది.

### పిల్లలకు టాటా చెప్పి....

అంబర్‌పేట పటేల్‌నగర్‌లో రామకృష్ణారెడ్డి ఇంట్లో సైదులు.. భార్య, పిల్లలతో అద్దెకు ఉంటున్నాడు. సోమవారం ఉదయం కూతుళ్లు నక్షత్ర (8), సహస్ర (4)లను స్కూల్‌కు తయారుచేసేందుకు భార్యకు సహాయపడ్డాడు. కూతుళ్లు స్కూల్‌కు వెళ్తుండగా టాటా చెప్పాడు. సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిర్మల కూతుళ్లను దింపి 15 నిమిషాల్లో తిరిగి వచ్చే సరికి తలుపు వేసి ఉంది. వెంటనే లోపలికి వెళ్లి చూసే సరికి బెడ్‌రూం లో సైదులు ఉరేసుకుని విగత జీవిగా కనిపించాడు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని ప్రత్యేక వాహనం లో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దివ్యాంగురాలితో 'పెళ్లి'.. ఆపై అత్యాచారం

**పాల్ఘర్:** దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో హైదరాబాద్‌కు చెందిన 37 ఏళ్ల వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాకు చెందిన అన్వర్ మొయినుద్దీన్ అనే వసాయి కాలేజీ ప్రొఫెసర్ ఆమెను అక్రమంగా వివాహం చేసుకుని అత్యాచారానికి పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.